ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

శుక్రవారం 25 సెప్టెంబర్ 2026 | సంపుటి: 1 సంచిక: 99 పేజీలు 12 వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

స్లీపర్ బస్సులో మంటలు

9 మంది సజీవ దహనం..



నోయిడాలో ఘటన గ్రేటర్ నోయిడాలోని యమునా ఎక్స్‌ప్రెస్ వే మీద బుధవారం అర్ధరాత్రి స్లీపర్ బస్సుకు మంటలు అంటుకోవడంతో 9 మంది సజీవ దహనం అయ్యారు. - న్యూఢిల్లీ (సింగిడి)

2



తిరుపతి వేదికగా అఖిల భారత

డీజీపీల సదస్సు

హాజరుకానున్న ప్రధాని మోదీ, అమిత్ షా

2



జలాశయాలు నింపండి

సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

రాష్ట్రంలో రేపు కూడా వర్షాలు కొనసాగుతాయని అంచనాల నడుమ సీఎం చంద్రబాబు సమీక్ష

భారీ వర్షాల నేపథ్యంలో జలాశయాలన్నీ నింపాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు

గోదావరి, కృష్ణా బేసిన్లలో పలుచోట్ల వరద హెచ్చరికలు జారీ చేసే అవకాశం

ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని సూచన

వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, క్రీడలు, విద్యుత్ సరఫరాపైనా కీలక ఆదేశాలు జారీ

2

అక్టోబరు 2న యూపీఐ చెల్లింపులు బంద్



2

యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ ఛార్జీలకు వ్యతిరేకంగా వ్యాపారుల నిరసన

అక్టోబర్ 2న 'నో యూపీఐ డే' పాటించాలని వ్యాపార సంఘాల పిలుపు

రూ.2,000 దాటిన లావాదేవీలపై 0.4 శాతం రుసుమును విధించనున్న ప్రభుత్వం

కొత్త నిబంధనలు వెనక్కి తీసుకోకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరిక

22ఏ నుంచి విముక్తి

నిషేధిత జాబితాలోని సుమారు 300 కాలనీల్లో ఇళ్లు.. ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు వీలు

స్థానిక సంస్థల అనుమతి ఉన్న వాటికే వర్తింపు

ఏదో ఒక లింక్ డాక్యుమెంట్ ఉంటే చాలు

కీలక ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

తక్షణమే రిజిస్ట్రేషన్లు: మంత్రి పొంగులేటి

దశాబ్దాలుగా పీటముడిలా ఉన్న నిషేధిత జాబితా చిక్కుముడి వీడింది. రాష్ట్రవ్యాప్తంగా చాలా కాలం నుంచి 22 ఏ జాబితాలో కొనసాగుతున్న ఇళ్లు, ప్లాట్లు, ప్లాట్లకు శాశ్వత విముక్తి కల్పిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 16న శాసనసభలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

- హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సింగిడి)



గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ, వివేక్‌లు సమావేశమై చర్చించారు. అనంతరం ప్రభుత్వం 22ఏ పరిష్కారాలపై కీలక నిర్ణయం వెల్లడించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్, పరిసర జిల్లాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 300 కాలనీల్లోని 1.41 లక్షల ఇళ్లు, ప్లాట్లకు ఈ ఉత్తర్వులతో 'విముక్తి' లభించనున్నట్లు అంచనా వేస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో 44, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 65 కాలనీలు ఉన్నట్లు సమాచారం. కోర్టు కేసుల్లో తీర్పులు, భూముల వేలం, క్రమబద్ధీకరణల అనంతరం ఏర్పడిన కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు, ఖాళీ స్థలాల వారికి ఆ సమాచారం రికార్డుల్లో అప్‌డేట్ కాకపోవడంతో ప్రభుత్వ భూముల జాబితాల్లో ఉండిపోయాయి. హైకోర్టు ఆదేశాలతో గత ఏడాది 22ఏ జాబితాను అప్‌డేట్ చేసి.. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. దానిలో కొన్ని నివాసాలు, లేఅవుట్లు కూడా 22ఏలో చేరిపోయాయి. ఫలితంగా పలు చోట్ల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ఆందోళన వ్యక్తమైంది. ప్రభుత్వం ఈ సమస్యను ప్రత్యేకంగా భావించి శాసనసభ సమావేశాల్లో చర్చ పెట్టింది. మొత్తం 12 రకాల సమస్యలు ఉన్నట్లు ప్రకటించి పరిష్కారానికి చర్యలు ప్రారంభించింది.

కీలక అంశాలు ఇలా...

22 ఏ పరిష్కారాలకు ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల్లో పలు అంశాలను పేర్కొన్నారు.

జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డైరెక్టర్ ఆఫ్ టౌన్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ), అర్బన్, గ్రామీణ స్థానిక సంస్థల (మున్సిపల్ కార్పొరేషన్స్, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలు) నుంచి అనుమతులు పొంది అభివృద్ధి చేసిన ఖాళీ స్థలాలు, ఇళ్లు, ప్లాట్లకు నిర్దేశిత నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇస్తారు. రిజిస్ట్రేషన్‌కు వెళ్లే దరఖాస్తుదారులు కొన్ని సూచనలు పాటించాలి.

ప్రభుత్వ సంస్థల నుంచి చట్టబద్ధమైన అనుమతులున్నట్లు తెలిపే పత్రాలు తప్పనిసరి. పైన పేర్కొన్న సంస్థలు జారీ చేసిన చెల్లుబాటు అయ్యే లే అవుట్, భవన, అపార్ట్‌మెంట్ నిర్మాణ అనుమతులు ఉండాలి.

అనుమతుల అనంతరం జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఏదో ఒక లింక్ డాక్యుమెంట్ తప్పనిసరి.

ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే పరిష్కరించడానికి జిల్లా స్థాయిలో కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ నేతృత్వం వహిస్తారు.

కోర్టు కేసుల్లో ఉన్న సమస్యలు, అంశాలైతే.. అవి కోర్టుల తుది తీర్పునకు లోబడి ఉంటాయి.

సత్వర పరిష్కారం: మంత్రి పొంగులేటి

అనేక ఏళ్లుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న 22ఏ సమస్యకు పరిష్కారం చూపినట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రభుత్వం చెప్పినట్లుగానే ఫాస్ట్‌ట్రాక్ విధానంలో చర్యలు తీసుకుంది. అనుమతులు పొందిన ఆస్తుల రిజిస్ట్రేషన్లకు ఆటంకం లేదు. దరఖాస్తుదారులు ఏదో ఒక లింక్ డాక్యుమెంట్ చూపాలి. న్యాయపరమైన అంశాలను పరిశీలించి అర్హత ఉన్న వాటికి సత్వర పరిష్కారం చూపుతాం' అని మంత్రి పేర్కొన్నారు.



దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

'ఎమ్మెల్యేగా దానం అనర్హుడే'

పిటిషన్ డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు

దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. ఆయన ఎమ్మెల్యేగా అనర్హుడని ప్రకటించిన హైకోర్టు తీర్పును సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీ తరపున పోటీ చేయడాన్ని తప్పుపట్టిన సుప్రీంకోర్టు, దానం నాగేందర్ పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు ఏమీ లేదని, ఫుర్ వాపసీ చట్ట సభలకు వర్తించదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఆయారాం, గయారాంలు పెరుగుతున్నారని వ్యాఖ్యానించింది. అటు సుప్రీంకోర్టు తీర్పుపై దానం నాగేందర్ స్పందించారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

- న్యూఢిల్లీ (సింగిడి)

2

ఎన్నికలకు సిద్ధం అవుతా

సుప్రీం తీర్పుపై దానం నాగేందర్

సుప్రీం తీర్పును గౌరవిస్తున్నానన్న దానం

న్యాయపోరాటం చట్టపరంగానే చేశానని వెల్లడి

ఖైరతాబాద్ ఉప ఎన్నికకు సిద్ధమని ప్రకటన

ప్రజల ఆశీర్వాదం కోరతానన్న దానం

ఖైరతాబాద్ ఉప ఎన్నికకు మార్గం సుగమం

2



బీఆర్ఎస్ నాయకుల కేటీపీఎస్ సందర్శన

చేతగాని దద్దమ్మ ప్రభుత్వంలో

వ్యవసాయ రంగంలో తీవ్ర సంక్షోభం

చేతగాని దద్దమ్మ ప్రభుత్వంలో వ్యవసాయ రంగంలో తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్నదని,రైతాంగం నిర్వేదంతో,బాధల్లో ఉన్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయానికి సాగునీళ్లు, విత్తనాలు, కరెంట్,యూరియా సక్రమంగా సరఫరా చేయకుండా ఉద్దేశపూర్వకంగా, కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పాలకులపై ఆయన మండిపడ్డారు.

2

పాల్వంచ, సెప్టెంబర్ 24 (సింగిడి)

కేసీఆర్.. కుటుంబ సభ్యుల భూములపై..

విచారణకు ప్రత్యేక కమిటీ





2

ప్రభుత్వ భూముల ఆక్రమణలు.. కొనుగోళ్లు తేల్చాలంటూ ఆదేశాలు

జాబితాలో కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి, గంగుల, పల్లా..

కమిటీ చైర్‌పర్సన్‌గా సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన.. మరో ముగ్గురు సభ్యులు

16 అంశాల జాబితాతో టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ జారీ

భూ అక్రమాలు, ఆక్రమణల నిగ్గు తేల్చేందుకు శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన మేరకు.. ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 16 అంశాలపై విచారణ చేయాలని నిర్ణయించింది.

- హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సింగిడి)

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై

అభిశంసన

సిద్ధమైన విపక్షాలు- పార్లమెంటులో తీర్మానం పెట్టేందుకు సన్నాహాలు!

పార్లమెంటులో తీర్మానం తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం

ఎన్నికల కమిషన్‌లో భిన్నాభిప్రాయాల అంశం తెరపైకి రాగా విపక్షాల నిర్ణయం

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (SIR- స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై విపక్షాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. ఈ క్రమంలో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (CEC) జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసనకు సిద్ధమయ్యాయి. ఎన్నికల సంఘంలోనే విభేదాలు ఉన్నట్లు జాతీయ మీడియాల్లో వస్తున్న వరుస కథనాల నేపథ్యంలో ఆయనను తొలగించాలని కోరుతున్నాయి. - న్యూఢిల్లీ (సింగిడి)



2

నేడు అత్యంత భారీ వర్షాలు

భారీ వర్షాలతో అతలా కుతులమైన ఉత్తరాంధ్ర

జలాశయాలు, నదుల్లో పెరుగుతున్న నీటి మట్టాలు

ప్రధాన విమానాశ్రయాలలో రాకపోకలకు తీవ్ర విఘాతం

2



రాహుల్, రేవంత్‌లకు ఇది

చెంపపెట్టు: కేటీఆర్

దానం నాగేందర్ అనర్హతను సమర్థించిన సుప్రీంకోర్టు

ఇది రాహుల్, రేవంత్‌కు తగిలిన చెంపపెట్టు అన్న కేటీఆర్

ఫిరాయింపుల ద్వారా ప్రజా తీర్పును దొంగిలించాలని చూశారని విమర్శ

రాజ్యాంగాన్ని కాపాడాలనే కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి బయటపడిందన్న హరీశ్ రావు

పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని రాహుల్‌కు సవాల్

2

సుప్రీం తీర్పు పార్టీలన్నింటికీ

ఓ గుణపాఠం

ఫిరాయింపులపై నారాయణ విమర్శలు

2

జనరల్ న్యూస్ సింగిడి

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన

ఈ మేరకు పార్లమెంట్ ఉభయ సభల్లో తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఈ అభిశంసన తీర్మానం నోటీసులకు సంబంధించి ముసాయిదా రూపొందించే పనిలో ఉన్నారని, న్యాయ నిపుణుల పరిశీలన తీసుకొని ఒకటి రెండు వారాల్లోగా లోక్‌సభ, రాజ్యసభల్లో నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి కాంగ్రెస్ ఇతర ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రధానంగా సర్ ప్రక్రియ చుట్టూ తలెత్తిన వివాదాలే ఈ పరిణామానికి కారణంగా నిలిచాయి. ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలు, ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, పునరుద్ధరణ వంటి అంశాలపై ఎన్నికల కమిషన్‌లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయని ఇటీవల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రిపోర్ట్ ప్రకారం– ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల వ్యవధిలోనే ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలపై కనీసం 14 సార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు పేర్కొంది. ఇంకా కొన్ని సౌకర్యాలకు సంబంధించిన యాక్సెస్ కోసం గోవా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, దిల్లీలోని ఎన్నికల సంఘం అధికారులను 7 రోజుల్లో 8 సార్లు సంప్రదించినప్పటికీ స్పందన రాలేదని మరో నివేదికలో తెలిపింది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల సంఘం పనితీరుపై కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి.

సీఈసీపై తృణమూల్ ఎంపీ ఫిర్యాదు

మరోవైపు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా గురువారం దిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో సీఈఓ జ్ఞానేశ్ కుమార్‌పై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఏకపక్ష నిర్ణయాలు, విధి విధానాల ఉల్లంఘన, ఓటరు జాబితాల్లో మార్పులకు సంబంధించి అవకతవకలకు పాల్పడ్డారంటూ ఆమె ఆరోపణలు చేశారు. సీఈసీ అండ్ ఈసీ యాక్ట్ 2023 సెక్షన్ 16 కింద, ఎన్నికల సంఘంలోని ముగ్గురు కమిషనర్లు కలిసి తీసుకునే ఉమ్మడి నిర్ణయాలకే చట్టపరమైన రక్షణ (ఇమ్యూనిటీ) వర్తిస్తుందని, ఒంటరిగా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్న సీఈసీకి ఈ రక్షణ వర్తించదని ఆమె వాదించారు. కాంగ్రెస్ సీనియర్ నేత ప్రమోద్ తివారీ కూడా ఎన్నికల కమిషన్ తాజా నిర్ణయాలపై తీవ్రంగా విమర్శించారు. సీఈసీపై వస్తున్న ఆరోపణలకు ఎన్నికల కమిషన్ లేదా సీఈసీనే సమాధానం ఇవ్వాల్సి ఉండగా, బీజేపీ నేతలు ఎందుకు స్పందిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. మరోవైపు ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కాంగ్రెస్ ఎంపీ, సీనియర్ నేత రణదీప్ సుర్జేవాలా డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, ఆయనపై క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ చేయాలని కోరారు. ఈ ఎస్ఐఆర్ కారణంగా 19 రాష్ట్రాల్లో ఏకంగా 13 కోట్ల మందిని ఓటరు లిస్ట్ నుంచి తొలగించారని, కర్ణాటకలోనే 1.08 కోట్ల పేర్లు తొలగించారని ఆరోపించారు. మరో 43 లక్షల మందికి నోటీసులు కూడా ఇచ్చారని మండిపడ్డారు. సీఈసీని తొలగించడానికి ప్రతిపక్షాలు సిద్ధపడటం ఇదేం తొలిసారి కాదు. గతంలోనూ ఇది జరిగింది. ఈ ఏడాదే మార్చిలో ఒకసారి, మళ్లీ ఏప్రిల్‌లో కూడా సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని నోటీసులు సమర్పించాయి. అయితే అప్పుడు సరైనంత సంఖ్యాబలం లేకపోవడం, ఇతర ప్రక్రియల నేపథ్యంలో అవి తిరస్కరణకు గురయ్యాయి. ప్రస్తుతం మరోసారి ఉభయ సభల్లో నోటీసులు ఇచ్చేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి.

అంత సులభమేం కాదు!

ఇక అత్యున్నత పదవుల్లో ఉన్న వారిని పదవీకాలం పూర్తికాకముందే తొలగించాలనే ప్రతిపాదనను పార్లమెంటులో ప్రవేశపెట్టడాన్ని అభిశంసన తీర్మానం అంటారు. అయితే భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలంటే అనుసరించాల్సిన ప్రక్రియ కూడా చాలా కఠినంగానే ఉంటుంది. పార్లమెంట్ ఉభయసభల్లోకి వచ్చే అభిశంసన నోటీసును ముందుగా లోక్‌సభ స్పీకర్ లేదా రాజ్యసభ ఛైర్మన్ పరిశీలించి, నోటీసును అంగీకరిస్తే వచ్చిన ఆరోపణలపై విచారణకు ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేస్తారు. విచారణ జరిపి, ఆరోపణల్లో నిజం ఉందని నివేదిక ఇస్తేనే పార్లమెంటులో ఓటింగ్ నిర్వహిస్తారు. అక్కడ మళ్లీ మూడింట రెండొంతుల మెజార్టీతో తీర్మానానికి ఆమోదం లభించాలి.

కేసీఆర్.. కుటుంబ సభ్యుల భూములపై.. విచారణకు ప్రత్యేక కమిటీ

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, టి.హరీశ్‌రావులతోపాటు.. వారి కుటుంబ సభ్యులు, మరికొందరు భారాస నేతలకు సంబంధించి ఆయా గ్రామాల్లోనే భూముల వివరాలను విచారణ అంశాల్లో చేర్చింది. వారి అధీనంలోని భూముల్లో ప్రభుత్వ భూములు ఏ మేరకు ఉన్నాయి, ఎసైన్డ్, ఇతర భూముల ఆక్రమణలు, కొనుగోళ్లు జరిగాయన్న ఆరోపణల నిగ్గు తేల్చాలని విచారణ కమిటీకి నిర్దేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు ఉత్తర్వులు జారీచేశారు. బుధవారం జారీ అయిన ఈ జీవో.. గురువారం వెలుగులోకి వచ్చింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఎ.శ్రీదేవసేనను కమిటీ చైర్‌పర్సన్‌గా నియమించారు. స్టాంపులు–రిజిస్ట్రేషన్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతోపాటు.. ఆయా భూములున్న జిల్లాకు చెందిన కలెక్టర్ సభ్యులుగా ఉంటారు. తుది నివేదిక ఇచ్చేలోగా అంశాల తీవ్రతను బట్టి మధ్యంతర నివేదికలను సమర్పించాలంటూ ప్రభుత్వం ఆదేశించింది. సిద్దిపేట, రంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల్లో క్షేత్రస్థాయి విచారణను ఈ కమిటీ చేపట్టనుంది.

విచారణాంశాలు ఇవే..

మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, ఆయన కుటుంబ సభ్యులు, భాగస్వాములకు సంబంధించి సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని ఎర్రవల్లి, మర్కుక్, శివారు వెంకటాపూర్‌లోని భూములు.

మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, కుటుంబ సభ్యులు, భాగస్వాములకు సంబంధించి సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచ గ్రామంలోని రంగనాయకసాగర్ జలాశయానికి సంబంధించిన భూములు, ఇతర అంశాలు, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ గ్రామ పరిధిలోని భూములు.

ఎం.హనుమంతరావు, 271 సర్వే నంబరులో కొనుగోలు చేసిన ఎసైన్డ్ భూములు – సిద్దిపేట జిల్లా, కొండపాక మండలం వెలికట్ట గ్రామం.

మల్లన్నసాగర్ నిర్మాణంలో భాగంగా సిద్దిపేట జిల్లాలో చేపట్టిన భూ సేకరణలో ఆరోపణలపై మాజీ ఎమ్మెల్యే ఎస్.రామలింగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించనున్నారు. తొగుట మండలంలోని ఏటిగడ్డ కిష్టాపూర్, పల్లెపహాడ్, రాంపూర్, తుక్కాపూర్ గ్రామాల్లో భూ సేకరణ జరిగిన ప్రాంతాల్లో విచారణ.

మాజీ మంత్రి కె.తారక రామారావు, కుటుంబ సభ్యులు, భాగస్వాములు, శతభిష అగ్రో, ఇతర కంపెనీలు, వ్యక్తిగతంగా కొనుగోలు చేసినవి– రంగారెడ్డి జిల్లా, శంకర్‌పల్లి మండలం, జన్వాడ.

మాజీ మంత్రి జి.జగదీశ్వర్‌రెడ్డి, కుటుంబసభ్యులు, భాగస్వాములు – రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మద్దూరు.

మాజీ ఎమ్మెల్యే పి.రోహిత్‌రెడ్డి, ఎసైన్డ్ భూముల కొనుగోళ్లు, ఆక్రమణలు– రంగారెడ్డి జిల్లా, మొయినాబాద్ మండలం, అజీజ్‌నగర్ గ్రామం.



రాహుల్, రేవంత్‌లకు ఇది
చెంపపెట్టు: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సింగిడి)

బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద తనపై అనర్హత వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకునేందుకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది.

ఈ తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఇది లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తగిలిన "సుప్రీం చెంపపెట్టు" అని అభివర్ణించారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ, అనర్హత వేటు నుంచి తప్పించుకోవడానికి దానం నాగేందర్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. "ఫిరాయింపుల ద్వారా ప్రజా తీర్పును దొంగిలించి, స్పీకర్ చాటున దాక్కోవచ్చని రాహుల్, రేవంత్ భావించారు. స్పీకర్ కార్యాలయాన్ని అడ్డుపెట్టుకుని ఫిరాయింపులను ప్రోత్సహించే వారి ప్రయత్నాలను ఈ తీర్పు బట్టబయలు చేసింది" అని కేటీఆర్ ఆరోపించారు.

దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

ఒక పార్టీ నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికైన వ్యక్తి మరో పార్టీ నుంచి లోక్‌సభకు పోటీ చేయకూడదని రాజ్యాంగపరమైన నిషేధమేమీ లేదని సుప్రీంలో దాఖలు చేసిన పిటిషన్‌లో దానం నాగేందర్ పేర్కొన్నారు. దానిని ప్రాతిపదికగా తీసుకొని తెలంగాణ హైకోర్టు తనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించడాన్ని ఆయన తప్పుబట్టారు. గతంలో ఈ విధంగా వేరే పార్టీ నుంచి పోటీ చేశారన్న కారణంతో బిహార్ రాష్ట్రానికి చెందిన మహేంద్రప్రసాద్ అనే వ్యక్తిని సుప్రీంకోర్టు అనర్హుడిగా ప్రకటించిందన్న ఏకైక కారణాన్ని ప్రాతిపదికగా తీసుకొని శాసన సభాపతి ఆదేశాలను హైకోర్టు కొట్టేయడం పొరపాటు అని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారించిన సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పును సమర్థించింది.

సుప్రీంకోర్టు తీర్పుపై దానం నాగేందర్ స్పందన

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నానని దానం నాగేందర్ అన్నారు. సర్వోన్నత న్యాయస్థానం గురువారం తీర్పును వెలువరించిన సందర్భంగా ఆయన స్పందించారు. తనకు ప్రజా క్షేత్రంలో బలం ఉందని తెలిపారు. తాను ప్రతి ఇంటికి సేవ చేశానని వాళ్లను అడిగితే తెలుస్తుందన్నారు. ఉపఎన్నికల్లో పోటీపై సీఎం స్పష్టత ఇస్తారన్నారు.

"సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా. గతంలో మూడు సార్లు గెలిచాను. ఒక ఉపఎన్నికలో 1,600 ఓట్లతో ఓడిపోయాను. ఇప్పుడు పరిస్థితులు చాలా అనుకూలంగా ఉన్నాయి. నాకు ప్రజా క్షేత్రంలో బలం ఉంది కలిసి పని చేస్తాం తప్పకుండా గెలుస్తాం. పోటీపై సీఎం స్పష్టత ఇస్తారు" – దానం నాగేందర్

ఇదీ కేసు నేపథ్యం

పార్టీ ఫిరాయింపుల అంశంలో దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ శాసనసభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలు స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. విచారణ చేపట్టిన సభాపతి ఈ పిటిషన్‌లను కొట్టివేశారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వీరిద్దరూ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ ఇటీవల తీర్పును వెలువరించింది.

బీఆర్ఎస్ సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థిగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసినందున రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తున్నట్లు పేర్కొంది. దానంపై అనర్హత నేపథ్యంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్లు పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. ఈ ఉత్తర్వుల ప్రతిని స్పీకర్ కార్యదర్శికి, ఎన్నికల సంఘానికి పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

అలా చేయడం స్వచ్ఛందంగా సభ్యత్వాన్ని వదులుకున్నట్లే

బీఆర్ఎస్ సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ తరపున పోటీ చేసినందున స్వచ్ఛందంగా బీఆర్ఎస్ సభ్యత్వాన్ని వదులుకున్నట్లేనని, కాంగ్రెస్ తరపున పోటీ చేయడం అన్నది పదో షెడ్యూల్ ప్రకారం బీఆర్ఎస్ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవడం అవుతుందా లేదా అన్నదానిపై స్పీకర్ సమాధానమిచ్చారని హైకోర్టు తెలిపింది. శాసనసభ్యుడిగా ఉంటూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని రాజ్యాంగపరంగా నిషేధించలేదని, ఒకవేళ మరో పార్టీ టిక్కెట్‌పై లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని పార్టీ ఫిరాయింపుగా పరిగణించాల్సి వస్తే రాజ్యాంగం దాన్ని స్పష్టంగా పేర్కొని ఉండేదని, అలా నిర్దేశించనపుడు రాజ్యాంగ అనర్హతను నిర్ధారించలేమని స్పీకర్ పేర్కొన్నట్లు హైకోర్టు వివరించింది.

ఎన్నికలకు సిద్ధం అవుతా

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సింగిడి)



ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ సుప్రీంకోర్టు తీర్పుపై స్పందించారు. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సంపూర్ణంగా గౌరవిస్తున్నానని తెలిపారు. చట్టపరమైన ప్రక్రియ పట్ల ఉన్న గౌరవంతోనే తాను న్యాయ పోరాటం చేశానని చెప్పారు. ఇక తన భవిష్యత్తును ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటానని స్పష్టం చేశారు. "కోర్టు తీర్పు ఇలా వస్తుందని ముందే ఊహించాను. అయితే రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం కొంత ఊరట లభిస్తుందని భావించాను. అందుకే చట్టపరంగా చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశాను" అని దానం నాగేందర్ పేర్కొన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైన నేపథ్యంలో తాను సిద్ధంగా ఉన్నట్లు దానం తెలిపారు. ఖైరతాబాద్ ప్రజలతో తనకు దశాబ్దాలుగా అనుబంధం ఉందన్నారు. నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో ఎప్పుడూ వారికి అండగా ఉన్నానని చెప్పారు. రాబోయే ఉప ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లి వారి ఆశీర్వాదం కోరతానన్నారు. ప్రజల మద్దతు తనకే ఉంటుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ తరపున ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. దీనిపై దాఖలైన అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు ఆయనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించి ఖైరతాబాద్ సీటు ఖాళీ అయినట్లు పేర్కొంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. నేడు అత్యున్నత న్యాయస్థానం ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సమర్థించింది. దీంతో ఖైరతాబాద్‌లో ఉప ఎన్నికకు మార్గం ఏర్పడింది.

సుప్రీం తీర్పు పార్టీలన్నింటికీ ఓ గుణపాఠం

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సింగిడి)



దానం నాగేందర్ అనర్హత కేసులో సుప్రీంకోర్టు తీర్పు పార్టీ ఫిరాయింపులపై కీలక సందేశం ఇచ్చిందని సీపీఐ సీనియర్ నేత కె.నారాయణ అన్నారు. దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం కొట్టివేసిన విషయం తెలిసిందే. తెలంగాణ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునే అవసరం లేదని స్పష్టం చేసింది. 2023లో బీఆర్ఎస్ టికెట్‌పై ఖైరతాబాద్ నుంచి గెలిచిన నాగేందర్.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయనపై అనర్హత వేటు పడింది. ఈ తీర్పును ఒక్క దానం నాగేందర్ వ్యవహారానికే పరిమితం చేయకూడదని నారాయణ అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీలు ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న తీరుపై ఆత్మపరిశీలన జరగాలని సూచించారు. తీర్పు వెలువడిన వెంటనే బీజేపీ సంబరాలు చేసుకోవడాన్ని ఆయన తప్పుపట్టారు. దేశంలో, వివిధ రాష్ట్రాల్లో పార్టీ మార్పులను ప్రోత్సహించిన చరిత్ర బీజేపీకి కూడా ఉందని విమర్శించారు. ఇప్పుడు ఫిరాయింపులపై నీతులు చెప్పడం సరికాదని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యేల చేరికలపై బీఆర్ఎస్ విమర్శలు చేస్తోందని నారాయణ పేర్కొన్నారు. అయితే గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకున్న విషయాన్ని కూడా గుర్తు చేశారు. ప్రధాన రాజకీయ పార్టీలు గతంలో చేసిన ఫిరాయింపులపై పరస్పరం ఆరోపణలు చేసుకోవడం కంటే తమ వైఖరిని సమీక్షించుకోవాలని సూచించారు. రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాల వల్ల చివరికి ప్రజాస్వామ్య వ్యవస్థకే నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దానం నాగేందర్ కేసులో వచ్చిన తీర్పు భవిష్యత్ ఫిరాయింపు కేసులకు మార్గదర్శకంగా నిలవాలని నారాయణ ఆకాంక్షించారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలో చేరే ఎమ్మెల్యేలపై వెంటనే అనర్హత వేటు పడేలా ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని మరింత కఠినతరం చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి మార్పులు వస్తేనే పార్టీ మారే రాజకీయాలకు అడ్డుకట్ట పడుతుందని అన్నారు.

అక్టోబరు 2న యూపీఐ చెల్లింపులు బంద్

దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలకమైన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే కొన్ని లావాదేవీలపై ఛార్జీలు విధించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై వ్యాపార వర్గాలు భగ్గుమన్నాయి. ఈ కొత్త నిబంధనలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అక్టోబర్ 2 (గాంధీ జయంతి) నాడు "నో యూపీఐ డే" పాటించాలని పలు వాణిజ్య, వ్యాపార సంఘాలు పిలుపునిచ్చాయి. ఆ రోజున తమ దుకాణాల్లోని యూపీఐ క్యూఆర్ కోడ్‌లు, స్కానర్లు, సౌండ్ బాక్సులను నల్లటి వస్త్రంతో కప్పివేసి నిరసన తెలపాలని నిర్ణయించాయి.

అక్టోబర్ 15 నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు

అక్టోబర్ 15 నుంచి యూపీఐ చెల్లింపులకు సంబంధించి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. దీని ప్రకారం, వ్యాపారులు (P2M – పర్సన్ టు మర్చంట్) స్వీకరించే రూ.2,000కు పైబడిన ప్రతి యూపీఐ లావాదేవీపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (MDR) చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఒక లావాదేవీపై గరిష్ఠంగా రూ.300 మాత్రమే ఛార్జ్ చేస్తారు.

అయితే, వ్యక్తుల మధ్య జరిగే (P2P – పర్సన్ టు పర్సన్) యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. అలాగే, నెలకు రూ.1 లక్ష వరకు యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు (P2PM) కూడా ఈ ఎండీఆర్ నుంచి మినహాయింపు ఇచ్చారు. 2026 ఆగస్టు నెలలోనే వ్యాపారులకు రూ.8.95 ట్రిలియన్ల విలువైన 15.51 బిలియన్ల లావాదేవీలు జరగ్గా, అందులో రూ.2,000కు పైబడిన చెల్లింపుల వాటానే సుమారు 67 శాతం ఉండటం గమనార్హం.

వ్యాపారుల ఆందోళన ఎందుకు?

తమకు ఇప్పటికే చాలా తక్కువ లాభాలు వస్తుండగా, ఇప్పుడు యూపీఐపై కొత్త ఛార్జీలు విధించడం వల్ల ఆర్థికంగా మరింత భారం పడుతుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ ఇండియాను ప్రోత్సహించి, పారదర్శక లావాదేవీలు జరుపుతున్న తమను ప్రోత్సహించాల్సింది పోయి, ఇలా ఛార్జీలతో శిక్షించడం సరికాదని వారు వాదిస్తున్నారు. మహారాష్ట్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ (MACCIA), ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ ఫెడరేషన్ (AICPDF) వంటి అనేక జాతీయ స్థాయి సంఘాలు ఈ నిరసనకు మద్దతు ప్రకటించాయి.

ఈ అంశంపై పెట్రోలియం డీలర్లు, స్టాక్ బ్రోకర్లు కూడా తమకు మినహాయింపులు ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికే పెట్రోలియం మంత్రిత్వ శాఖ డీలర్లతో చర్చలు జరపగా, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలపై విధించిన 0.02 శాతం ఎండీఆర్‌పై బ్రోకర్ల ఆందోళనలను పరిశీలిస్తామని సెబీ హామీ ఇచ్చింది. అక్టోబర్ 15 లోగా ప్రభుత్వం ఈ ఛార్జీలను ఉపసంహరించుకోకపోతే తమ నిరసనను మరింత ఉద్ధృతం చేస్తామని వ్యాపార సంఘాలు హెచ్చరించాయి.

జలాశయాలు నింపండి

అమరావతి, సెప్టెంబర్ 24 (సింగిడి)

రాష్ట్రంలో రానున్న 24 గంటల్లో కూడా పలు జిల్లాల్లో వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) కేంద్రం నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష జరిపి, క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా నదులు, వాగులకు వస్తున్న వరద ప్రవాహాలను సమర్థంగా వినియోగించుకుని రాష్ట్రంలోని అన్ని జలాశయాలు, నీటి వనరులను నింపాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సాధారణ జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. గడిచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో భూగర్భజలాలు కొంతమేర పెరిగాయని అధికారులు సీఎంకు వివరించారు. ప్రకాశం బ్యారేజీతో పాటు మున్నేరు పరీవాహక ప్రాంతం నుంచి 11 వేల క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. ఈ నీటిని ప్రాజెక్టుల దిగువన ఉన్న అన్ని నీటి వనరుల్లో నిల్వ చేయాలని, అవసరమైతే మోటార్లు ఉపయోగించి లిఫ్ట్ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. గోదావరి ప్రవాహాలతో ఏలేరు రిజర్వాయర్‌లో 24 టీఎంసీల నీటిని నింపాలని, పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకు నీటిని తరలించాలని దిశానిర్దేశం చేశారు. విశాఖ, అనకాపల్లి, శ్రీకాకుళం, మన్యం, కోనసీమ, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ సహా 16 జిల్లాల్లో వర్ష ప్రభావం అధికంగా ఉందని అధికారులు తెలిపారు. గోదావరి, కృష్ణా, నాగావళి, వంశధార బేసిన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు.



బీఆర్ఎస్ నాయకుల
కేటీపీఎస్ సందర్శన

బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు, కార్యనిర్వహక అధ్యక్షులు కే.టీ.రామారావుల పిలుపు మేరకు ఎంపీ రవిచంద్ర ఆధ్వర్యాన గులాబీ శ్రేణులు గురువారం పాల్వంచలోని కేటీపీఎస్ సందర్శనకు వెళ్లారు.థర్మల్ పవర్ స్టేషన్ లో బొగ్గు నిల్వలు, విద్యుదుత్పత్తికి సంబంధించి వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి వెంకటేశ్వర రావు, మాజీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు, పార్టీ శ్రేణులు, రైతులు వెడుతుండగా పెద్ద సంఖ్యలో మోహరించిన పోలీసులు బ్యారీకేడ్స్ అడ్డుపెట్టి నిలువరించారు.ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకోగా పలువురు స్వల్పంగా గాయపడ్డారు.ఆ తర్వాత ఎంపీ వద్దిరాజు నేతృత్వంలో ప్రతినిధి బృందం కేటీపీఎస్ లోపలికి వెళ్లి బొగ్గు నిల్వల్ని, విద్యుదుత్పత్తిని పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర విలేకరులతో మాట్లాడుతూ, వ్యవసాయ రంగాన్ని కాంగ్రెస్ సర్కార్ నిర్వీర్యం చేస్తున్న తీరును దుయ్యబట్టారు.సాగునీళ్లు,కరెంట్ సక్రమంగా సరఫరా చేస్తే పంటలు పండుతాయని, వాటిని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాల్సి వస్తుందని..వాటిని నెరవేర్చడం చేతగాకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగాన్ని,రైతన్నల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు.కేసీఆర్ సుదీర్ఘ పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాక బంగారు మయంగా తీర్చిదిద్దారని, తీవ్ర నష్టాలలో సింగరేణి సంస్థను లాభాల బాట పట్టించారని ఎంపీ రవిచంద్ర కొనియాడారు.

నేడు అత్యంత భారీ వర్షాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సింగిడి)

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం

జవహర్ నగర్ ఠాణా పరిధిలోని పేకాట స్థావరంపై మెరుపు దాడి



- పేకాట రాయుళ్లు అరెస్ట్ ముగ్గురు పరారీ
- నిందితులపై చట్టపరమైన చర్యలు
- జితేందర్ సింగ్ దర్యాప్తు అధికారి

జవహర్ నగర్, సెప్టెంబర్ 24 (సింగిడి): జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోశాల సమీపంలో కొంతమంది వ్యక్తులు డబ్బులు పందెంగా పెట్టి పత్తాలాడుతున్న సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సైఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఎస్సై రమేష్ కు జవహర్ నగర్ గోశాల సమీపంలో కొంతమంది వ్యక్తులు డబ్బులు పందెంగా పెట్టి మూడుముక్కలాట ఆడుతున్నారనే సమాచారంతో వెంటనే ఉన్నతాధికారుల ఆదేశంతో పోలీస్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లారు. ఈ మేరకు అక్కడ ఆరుగురు వ్యక్తులు డబ్బులు పందెంగా పెట్టి పత్తాలాడుతూ కనిపించారు. పోలీసులను గమనించిన ముగ్గురు వ్యక్తులు రవి నాగరాజు రాజు సంఘటనా స్థలం నుండిపారిపోయారు. మిగిలిన ముగ్గురు వ్యక్తులైన పిట్టల బాలయ్య, ఎర్రగుంట రాజు, దేవరుప్పుల మహేష్ లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అనంతరం నిందితులపై పంచనామా నిర్వహించి వారి వద్ద నుండి రెండు సెట్ల ప్లేయింగ్ కార్డులు సుమారు రూ.6,950 రూపాయలు నగదు, రెండు మొబైల్ ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మొత్తం ఆస్తి విలువ సుమారు 20వేల వరకు ఉంటుందని సమాచారం. ఈ మేరకు ఎస్సై కే రమేష్ స్వయంగా ఈ ఘటనపై ఫిర్యాదు చేయగా జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో సుమోటో కేసుగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి దర్యాప్తును సితేందర్ సింగ్ దర్యాప్తు అధికారి చేపట్టారు. ఈ సందర్భంగా దర్యాప్తు అధికారి జితేందర్ సింగ్ మాట్లాడుతూ పేకాటరాయుళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంతటి వారినైనా వదిలి పెట్టబోమని హెచ్చరించారు.

నవ సమాజ నిర్దేశకులు గురువులు

- పటాన్చెరులో ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రైవేట్ పాఠశాలల గురుపూజోత్సవ వేడుకలు
- 25 సంవత్సరాలుగా గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించడం అభినందనీయం..
- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





పటాన్చెరు, సెప్టెంబర్ 24 (సింగిడి): ఒక దేశ భవిష్యత్తు నిర్మాణం తరగతి గదిలోనే జరుగుతుందని.. ప్రతి విద్యార్థిని భావిభారత పౌరుడుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గత 25 సంవత్సరాలుగా గురుపూజోత్సవం పురస్కరించుకొని నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను ప్రతి ఏటా సన్మానించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. బుధవారం స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి గారి ఆధ్వర్యంలో పటాన్చెరు డివిజన్ పరిధిలో పటాన్చెరు నియోజకవర్గస్థాయి ప్రైవేటు పాఠశాలల గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ప్రైవేటు పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 200 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులని కొనియాడారు. విద్యార్థులకు చదువుతోపాటు నైతిక విలువలు, కుటుంబ బంధాలు, సమాజంలో వస్తున్న మార్పులను తెలియజేస్తూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో అధిక శాతం పేద, మధ్యతరగతి కుటుంబాలు తమ పిల్లలని ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలల ద్వారా పోటీ ఏర్పడుతున్నప్పటికీ ప్రైవేటు పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయని అభినందించారు.. ప్రతి రంగంలో పటాన్చెరు నియోజకవర్గానికి వన్నెతెచ్చేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు.. ప్రభుత్వ ప్రైవేటు తేడా లేకుండా గత 24 సంవత్సరాలుగా గురుపూజోత్సవ వేడుకలు నిర్వహిస్తూ ఉపాధ్యాయులను సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత సమాజంలో మొబైల్ వాడకం అత్యంత ప్రమాదకరంగా మారిందని తెలిపారు. టెక్నాలజీని మనిషి ఎదుగుదలకు ఉపయోగించుకుంటే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని.. అదే టెక్నాలజీని దుర్వినియోగం చేస్తే సమాజానికి ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఉపాధ్యాయుడు తన తరగతి గదిలోని ప్రతి విద్యార్థి చదువుతోపాటు మానసిక ప్రవర్తన పై ఎప్పటికప్పుడు గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రైవేట్ పాఠశాలల సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డికి ఘన సన్మానం



వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 24 (సింగిడి): కాలాపూర్ గ్రామ రైతుల భూ సమస్య పరిష్కారం కోసం చేపట్టిన పోరాటానికి పూర్తి స్థాయి మద్దతుగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీ నాయకులకు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భూ బాధితుల పక్షాన నిలబడి అండగా ఉన్న పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులను కాలాపూర్ గ్రామ సర్పంచ్ పులేందర్, మాజీ సర్పంచ్ జంగయ్య మరియు గ్రామ ప్రజలు కలిసి పొన్నాడ సన్మాన కార్యక్రమంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి మాట్లాడుతూ కాలాపూర్ గ్రామ ప్రజలకు, రైతులకు ఏ సమస్య వచ్చినా తనవంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని స్పష్టం చేశారు. రైతుల హక్కుల సాధన కోసం జరిగే ప్రతి పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా వెన్నంటి ఉంటుందని హామీ ఇచ్చారు. రైతుల భూ సమస్యలపై తాము చేసే పోరాటానికి నాయకులు స్పందించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 24 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో వివిధ ప్రాంతాలకు చెందిన తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు. పలు ప్రాంతాలలో జరగబోయే గణేశ్ ఉత్సవాల్లో పాల్గొనాలని పలువురు ఆహ్వానించారు.

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 24 (సింగిడి): ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పదవీ విరమణ తప్పనిసరి అని మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు శశికళవెంకట్ రెడ్డి అన్నారు. మోమిన్ పేట మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన నర్సమ్మ, పదవివిరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన నర్సమ్మ సేవలు మరువలేనివని ఆయన కొని యాడారు. ఈ కార్యక్రమంలో సుప్రియ, గున్నమ్మ, జ్యోతి, శశికళ పాల్గొన్నారు.

బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు

రాజేంద్రనగర్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లలో కార్తిక్ రెడ్డి



రాజేంద్రనగర్, సెప్టెంబర్ 24 (సింగిడి): నవరాత్రులు వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని బొజ్జ గణపయ్యకు రాజేంద్రనగర్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య ప్రత్యేక పూజలు చేశారు. నార్సింగి సర్కిల్ మణికొండ డివిజన్ పరిధిలోని శివాజీ నగర్ కాలనీ, బాబా సాహెబ్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో పూజలు అందుకుంటున్న పార్వతీ పుత్ర బొజ్జ గణపయ్య ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... గణనాథుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. భక్తి భావంతో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మణికొండ నాయకులు సీతారాం దూళిపాళ్ల, అర్జున్, శ్రీకాంత్, కార్యకర్తలు కాలనీ అధ్యక్షులు యువజన సంఘాల యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

భారతీనగర్‌లో మిన్నంటిన వినాయక నవరాత్రి శోభ

పలు మండపాల్లో మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ప్రత్యేక పూజలు

భక్తులతో మమేకమై అన్నప్రసాద వితరణ



రామచంద్రపురం, సెప్టెంబర్ 24 (సింగిడి): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని రామచంద్రపురం పరిధిలోని భారతీనగర్ డివిజన్‌లో గణేశ్ నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక ఉత్సాహం నడుమ వైభవంగా సాగుతున్నాయి. కాలనీలు, బస్తీల్లో కొలువైన లంబోదరుడి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి పలు కాలనీల్లో పర్యటించి, గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత బీడీఎల్ కాలనీ, మ్యాక్ సొసైటీ, ఓల్డ్ ఎంఐజీ కాలనీలలో కొలువుదీరిన వినాయక మండపాలను ఆమె సందర్శించారు. నిర్వాహకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ విఘ్నేశ్వరుడికి విశేష అర్చనలు, హారతులు సమర్పించారు. అనంతరం బాంబే కాలనీలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన గణపతిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ఆమె ప్రారంభించి, స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. అనంతరం భక్తులతో కలిసి సామూహికంగా కూర్చుని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ విఘ్ననాయకుడి కృపాకటాక్షాలతో భారతీనగర్ ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని, డివిజన్ మరింత ప్రగతిపథంలో సాగాలని ప్రార్థించినట్లు తెలిపారు. కాలనీల ఐక్యతకు, సాంస్కృతిక వారసత్వానికి గణేశ్ ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తున్నాయని నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమాలలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల బాధ్యులు, స్థానిక నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భజనలు, జై గణేశ్ నామస్మరణలతో ఆయా ప్రాంతాలు మార్మోగాయి.



సహారా బాధితుల ఆవేదన

స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు ఏజెంట్ల వినతిపత్రం



వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 24 (సింగిడి): సహారా సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన ఖాతాదారులకు పెండింగ్‌లో ఉన్న చెల్లింపులన్నీ పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని సహారా కార్యకర్తలు, ఏజెంట్లు కోరారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు వారు వినతిపత్రం సమర్పించారు. సహారా సంస్థల్లో పెట్టుబడి పెట్టిన వేలాది మంది ఖాతాదారులు తమ సొమ్ము కోసం దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారని ఏజెంట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. వికారాబాద్ బ్రాంచ్, వికారాబాద్ ఎఫ్‌సీ, హైదరాబాద్ పరిధిలోని సహారా సంస్థలలో సాధారణ ప్రజలు తమ కష్టార్జితాన్ని దాచుకున్నారని తెలిపారు. ముఖ్యంగా సహారా సంస్థలలోని ఎస్‌పీఓఎస్ నగదును సహారా ఇండియా పరివార్‌లో పెట్టుబడిగా పెట్టిన బాధితులు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రభుత్వం సిఆర్‌సిఎస్ సహారా రిఫండ్ పోర్టల్ ద్వారా అర్హులైన ఖాతాదారులకు సొమ్ము చెల్లించే ప్రక్రియను కొనసాగిస్తున్నప్పటికీ, చాలా మందికి తమ పెట్టుబడి మొత్తం పూర్తిస్థాయిలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకించి మూడేళ్లకు పైగా చెల్లింపుల కోసం నిరీక్షిస్తున్న వారి పరిస్థితి మరీ తీవ్రంగా ఉందన్నారు. వృద్ధులు, తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధితుల సమస్యలను అధికారులు ప్రత్యేకంగా పరిశీలించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఖాతాదారులతో పాటు వారికి జవాబుదారీగా ఉన్న ఏజెంట్లు కూడా మానసిక, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పెండింగ్ చెల్లింపులన్నీ త్వరితగతిన విడుదలయ్యేలా చూడాలని స్పీకర్‌ను కోరారు.

దిశ సమావేశంలో అధికారుల నిర్లక్ష్యంపై ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి ఆగ్రహం



వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 24 (సింగిడి): వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో అధికారుల పనితీరు, ప్రజా సమస్యలపై చేవెళ్ల ఎంపీ, దిశ కమిటీ చైర్మన్ శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో ఆయన సమగ్రంగా సమీక్షించారు. ప్రోటోకాల్ ఉల్లంఘిస్తే సహించేది లేదని అన్నారు. కోట్‌పల్లి, పూడూరు మండలాల్లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీ) ప్రారంభోత్సవాల్లో ప్రోటోకాల్ నిబంధనలు పాటించకపోవడంపై ఎంపీ అధికారులను తీవ్రంగా తప్పుపట్టారు. "కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జిల్లాలో అత్యధిక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. అధికారులు ప్రోటోకాల్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జుంటుపల్లి ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. తాండూర్ నియోజకవర్గం, యాలాల మండలంలోని జుంటుపల్లి ప్రాజెక్టు స్లూయిస్ గేట్ల మరమ్మతులు ఇప్పటివరకు పూర్తికాకపోవడంపై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పనుల కోసం నా ఎంపీలాడ్స్ నిధులు ఇవ్వడానికి, లేదా అవసరమైతే నా సొంత నిధులు వెచ్చించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పినా అధికారులు స్పందించకపోవడం దారుణమని వ్యాఖ్యానించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి రైతులకు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. అక్రమ మైనింగ్‌పై జిల్లా మైనింగ్ శాఖ ఏడీ (ఎ డి) తీరుపై ఎంపీ తీవ్ర అసంతృప్తి చెందారు. పులుసుమామిడి, రాకంచెర్ల గ్రామాల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైనింగ్ లీజులు, రాయల్టీల ద్వారా జిల్లాకు వచ్చే ఆదాయాన్ని పెంచాలని, జిల్లా మినరల్ ఫౌండేషన్ (డి ఎం ఎఫ్) నిధులను ప్రజా ప్రయోజనాలకే పారదర్శకంగా వినియోగించాలని సూచించారు. అవినీతికి తావులేదని నేరస్తులతో సాన్నిహిత్యం వద్దని అన్నారు. మత్స్య, సహకార శాఖల్లో వస్తున్న అవినీతి ఆరోపణలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. నేర చరిత్ర ఉన్న వ్యక్తులతో కొందరు అధికారులు సన్నిహితంగా మెలగడంపై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వికారాబాద్ జిల్లాలో నేరాలకు పాల్పడే వ్యక్తులకు ఎలాంటి ప్రోత్సాహం ఉండకూడదని అధికారులు పారదర్శకంగా అవినీతికి తావులేకుండా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. కేంద్ర పథకాలు అర్హులకు అందాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం క్షేత్రస్థాయిలో ఉన్న చివరి అర్హుడికి కూడా అందేలా చూడాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సరైన సమన్వయంతో పనుల్లో జాప్యాన్ని నివారించాలని చెప్పారు. ఈ సమావేశంలో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పీ ఎస్, దిశ కమిటీ సభ్యులు వట్ల నందు, మిట్ట పరమేశ్వర్ రెడ్డి, జానకిరామ్ నాయక్, లలితతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎల్లకొండలో స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ



వికారాబాద్, సెప్టెంబర్ 24 (సింగిడి): జిల్లా పరిధిలోని నవాబుపేట మండలం ఎల్లకొండ గ్రామపంచాయతీ వద్ద గ్రామ సర్పంచ్ కొండల్ యాదవ్ ఆధ్వర్యంలో రేషన్ కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంటని చంద్రయ్య, వార్డు సభ్యులు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకటయ్య, జీ పీ వో అంజయ్య, రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారం చేసిన పీఏసీఎస్ పాలకవర్గం



వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 24 (సింగిడి): ప్రాథమిక సహకార సంఘం వట్టిమినపల్లి సంఘం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకునే విధానాన్ని కాకుండా నామినేటెడ్ పద్ధతిలో మండల ప్రాథమిక సహకార సంఘం తాత్కాలిక కార్యావర్గం ప్రమాణస్వీకారం చేశారు. ఛైర్పర్సన్‌గా పులుమామిడి గ్రామానికి చెందిన ఎ రంగారెడ్డి, పర్సన్స్‌గా 13 మంది కూడా ప్రమాణస్వీకారం చేశారు. పర్సన్స్‌గా టీ ప్రభాకర్, గుండ్ల ప్రభాకర్ రెడ్డి, ఎ గోవర్ధన్ రెడ్డి, చల్లా మల్లారెడ్డి, నారేగూడెం బోజిరెడ్డి, నాంచారి రవీందర్ రెడ్డి, ఎం డి కదీర్, ఊరడి సత్యమ్మ, కమ్మరి మోనాచారి, న్యాలం ప్రకాశం, గంజాయి మణెమ్మ, రాందాస్ లు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో మోహన్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రావుగారి వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకుడు చిట్టెపు మల్ రెడ్డి, నాయకులు నాగిరెడ్డి, సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షుడు బలవంత్ రెడ్డి, సర్పంచ్ శేఖర్ పాల్గొన్నారు.

గణేష్ మండపాలు.. ప్రజల సౌభ్రాతృత్వానికి వేదికలు

- ఐకమత్యానికి చిహ్నాలు... ప్రజల అవగాహనకు సూచికలు
- జవహర్‌నగర్ గణేష్ సురక్ష సంకల్ప్ 2026
- జవహర్‌నగర్ డివిజన్ ఏసిపి చక్రపాణి





జవహర్‌నగర్, సెప్టెంబర్ 24 (సింగిడి): గణేష్ మండపాలు ప్రజల సౌభ్రాతృత్వానికి వేదికలని సమాజపు ఐక్యమత్యానికి చిహ్నాలని ప్రజల అవగాహనకు సూచికలని జవహర్ నగర్ డివిజన్ ఏసిపి చక్రపాణి పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో గణేష్ సురక్ష సంకల్ప్ 2026 లో భాగంగా మల్కాజ్గిరి సిపి సుమతి ఆదేశాల మేరకు ఈనెల 15వ తేదీ నుండి 23వ తేదీ వంకు ప్రతిరోజు ఒక్కొక్క ప్రోగ్రాం మీద గణేష్ మండపాల వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా జవహర్ నగర్ డివిజన్ ఏసిపి చక్రపాణి హాజరై మాట్లాడుతూ ఈనెల 15, 16వ తేదీలలో యాంటీ డ్రగ్స్ మీద ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించామని అదేవిధంగా 17, 18 వ తేదీలలో ట్రాఫిక్ రోడ్ సేఫ్టీ మీద అదేవిధంగా 19, ఇంకా 20వ తేదీ నాడు ఉమెన్స్ సేఫ్టీ షీ టీమ్స మీద 21, ఇంకా 22వ తేదీలలో సైబర్ సేఫ్టీ మీద అదేవిధంగా 23వ తేదీ నాడు ఫుడ్ సేఫ్టీ అండ్ ఫుడ్ అలర్ట్‌షన్ మీద ప్రజలకు అవగాహన కల్పించినట్టు తెలిపారు. గణేష్ మండపాలు ప్రజల అవగాహనకు వేదికలని అందువలన గణేష్ మండపాల వద్ద కార్యక్రమాలు సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. పండుగలు సర్వ మానవ సంస్కృతిలో భాగమని అట్టి పండుగలు నిర్వహించుకుంటూ దేశ ఔన్నత్యాన్ని సర్వ సమానత్వాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. భారత జాతి ఐక్యతే ముఖ్యమని దేశ అభివృద్ధికి ప్రజలందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. దేశ యువత ఇప్పుడు జెన్ జీ తరంతో ముందుకు దూసుకెళుతుందని ఈ తరం దేశ అభివృద్ధికి దేశ సాంకేతిక నైపుణ్యాలకు ఊతమిచ్చేలా దేశ అభివృద్ధి ప్రపంచం గుర్తించేలా పనిచేయాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ ఇన్స్పెక్టర్ సైదులు, పోలీస్ స్టేషన్ సెక్టార్ ఎస్ఐలు, పోలీస్ స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు గ్రామస్తుల ఆర్థికసాయం



కొడంగల్, సెప్టెంబర్ 24 (సింగిడి): కొడంగల్ మండలం లోని అప్పాయిపల్లి గ్రామంలో గ్రామస్తులు తమకు తోచినన్ని డబ్బులు పోగు చేసి,గ్రామంలో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం చేసి, అండగా నిలిచారు. ఇటీవల మృతిచెందిన తెలుగు నర్సిములు కుటుంబ సభ్యులకు 14,012 రూపాయలు, దుబ్బ పద్మమ్మ కుటుంబ సభ్యులకు 9,411రూపాయలు, పిల్లికండ్ల మల్లప్ప కుటుంబసభ్యులకు 8,011 రూపా యలు సాయంగా అందించారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు గోకుల్ సింగ్, సంగప్ప పాల్గొన్నారు.

Editorial

ఎడిటోరియల్

మంటలు చెలరేగే వరకు..
పర్యవేక్షణ ఏం చేసింది?
ప్రాణాలు కాపాడాల్సిన చోటే విషాదం

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాణాలను కాపాడాల్సిన అత్యంత సున్నితమైన వార్డులోనే మంటలు చెలరేగి ఐదుగురు పసికందులు ప్రాణాలు కోల్పోవడం.. ప్రమాదం కంటే పెద్ద ప్రశ్నను సమాజం ముందుంచింది. ఆదిలాబాద్ రిమ్స్ లోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగంలో సెప్టెంబర్ 21 అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటుచేసకుంది. ఘటన సమయంలో 27 మంది నవజాత శిశువులను అక్కడి నుంచి తరలించినట్లు అధికారులు, పలు వార్తా నివేదికలు పేర్కొన్నాయి. ఏసీ యూనిట్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు ప్రారంభమై ఉండొచ్చని ప్రాథమిక విచారణలో తేలినప్పటికీ.. అదే అంతిమ కారణమని ఇప్పుడే నిర్ధారించలేం. ఏసీ భాగాలు కాలిపోవడంతో దట్టమైన పొగ వ్యాపించిందని అధికారులు తెలిపారు. తొలుత ముగ్గురు శిశువులు మృతి చెందగా.. చికిత్స పొందుతున్న మరో ఇద్దరు సెప్టెంబర్ 23న మృతి చెందడంతో సంఖ్య ఐదుకు చేరింది. అసలు ప్రశ్న ఏసీ ఎందుకు దెబ్బతిన్నదన్నదొక్కటే కాదు.. ఇంత సున్నితమైన విభాగంలో విద్యుత్, అగ్నిమాపక, పొగ హెచ్చరిక, అత్యవసర తరలింపు వ్యవస్థలు ముందుగానే ఎంత సమర్థంగా ఉన్నాయన్నదీ తేలాలి.

ఆరోపణలు వేరు.. ఆధారాలు వేరు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వహణ, పర్యవేక్షణలో లోపాలే ఘటనకు కారణమని ఆరోపిస్తూ.. బాధిత కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని, రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల పిల్లల వార్డులు, ఐసీయూలను నిపుణులతో తనిఖీ చేయాలని కోరారు. మాజీ మంత్రి జోగు రామన్న కూడా ఆస్పత్రి నిర్వహణ, భద్రతపై ప్రభుత్వాన్ని విమర్శిస్తూ సమగ్ర విచారణ కోరారు. మరోవైపు స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ రిమ్స్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, మరమ్మతులకు నిధులు కోరామని చెబుతున్నారు. ఈ వాదనలన్నింటినీ వాటి రాజకీయ సందర్భంలోనే చూడాలి. ఎవరి ఆరోపణ నిజమో, ఎవరి వాదనకు ఎంత ఆధారం ఉందో తేల్చేది రాజకీయ ప్రకటనలు కాదు.. అధికారిక పత్రాలు, నిర్వహణ రికార్డులు, విద్యుత్ తనిఖీ నివేదికలు, అగ్నిమాపక భద్రతా వివరాలు, నిపుణుల విచారణ. అందుకే ముందుగానే ఎవరినీ బాధ్యుడిగా తేల్చకుండా.. లోపం ఎక్కడ జరిగిందో ఆధారాలతో నిర్ధారించడం అవసరం.

ప్రభుత్వం స్పందించింది.. అసలు పరీక్ష విచారణదే

ఘటనపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేసి, చికిత్స పొందుతున్న శిశువులకు మెరుగైన వైద్యం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఘటనకు దారితీసిన కారణాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సూచించారు. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రిమ్స్‌ను సందర్శించి ఘటన జరిగిన విభాగాన్ని పరిశీలించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఏసీ యూనిట్‌లో విద్యుత్ లోపం వల్ల మంటలు ప్రారంభమై ఉండొచ్చని, కాలిన ప్లాస్టిక్ భాగాల వల్ల దట్టమైన పొగ వ్యాపించిందని తెలిపారు. అయితే భద్రతా ప్రమాణాల అమలులో, నిర్వహణలో లేదా పర్యవేక్షణలో లోపాలు ఉన్నాయా అన్నది సమగ్ర విచారణలోనే తేలుతుందని స్పష్టం చేశారు. విద్యుత్, అగ్నిమాపక, భవన భద్రతపై తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. మృతి చెందిన ప్రతి శిశువు కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తాజా సమాచారం వెల్లడించింది. రిమ్స్‌లో 150 పడకల తల్లి--శిశు ఆరోగ్య కేంద్రాన్ని వేగంగా చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ఇవన్నీ తక్షణ చర్యలు మాత్రమే.. బాధ్యతను నిర్ణయించే అసలు పరీక్ష మాత్రం విచారణదే.

పర్యవేక్షణ ఎక్కడ ఆగిపోయింది?

ఇక్కడే ఘటన అసలు ప్రశ్నను ముందుకు తెస్తోంది. ఏసీ యూనిట్ నిర్వహణకు సంబంధించిన తనిఖీలు గతంలో ఎప్పుడు జరిగాయి? విద్యుత్ వ్యవస్థను నిర్దిష్ట కాల వ్యవధిలో పరిక్షించారా? అగ్నిమాపక పరికరాలు, హెచ్చరిక వ్యవస్థలు పనిచేసే స్థితిలో ఉన్నాయా? పొగ వ్యాపించినప్పుడు అత్యవసరంగా శిశువులను తరలించేందుకు తగిన మార్గాలు, పరికరాలు, సిబ్బంది శిక్షణ ఉన్నాయా? ఈ ప్రశ్నలు ఇప్పుడు కేవలం ఊహలు కావు. తెలంగాణ మానవ హక్కుల కమిషన్ కూడా ఘటనపై స్వయంచాలకంగా స్పందించి.. అగ్ని ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, ఎస్ఎన్‌సీయూ భద్రతా, నిర్వహణ ఏర్పాట్లు, రక్షణ చర్యలు, విచారణ వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆరోగ్యశాఖను కోరింది. విద్యుత్, ఏసీ వ్యవస్థలు, అగ్నిమాపక పరికరాలు, అగ్ని హెచ్చరిక వ్యవస్థలు, అత్యవసర తరలింపు ఏర్పాట్లపై వివరాలు కోరినట్లు కమిషన్ వెల్లడించింది. అందుకే "లోపం ఉందా?" అన్నదానికంటే "లోపం ఉంటే అది ఏ స్థాయిలో జరిగింది? ముందస్తు పర్యవేక్షణలో ఎందుకు గుర్తించబడలేదు? ఎవరి పరిధిలో ఆ బాధ్యత ఉంది?" అన్న ప్రశ్నలకు ఆధారాలతో సమాధానం రావాలి.

మంటలు ఆరినా.. బాధ్యత తప్పక తేలాలి

ప్రాణాలు కోల్పోయిన ఘటనను పరిహారంతోనో, రాజకీయ విమర్శలతోనో ముగించకూడదు. ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం అవసరమే.. కానీ ప్రాణాలను కాపాడే ప్రభుత్వ వైద్య వ్యవస్థకు అసలు పరీక్ష ప్రమాదానికి ముందే ముప్పును గుర్తించి నివారించడంలో ఉంటుంది. అందుకే ఏసీ పరికరాల నిర్వహణ నుంచి విద్యుత్ భద్రత వరకు, అగ్నిమాపక ఏర్పాట్ల నుంచి అత్యవసర తరలింపు మార్గాల వరకు ప్రతి అంశాన్ని రికార్డుల ఆధారంగా పరిశీలించాలి. ప్రభుత్వం ఇప్పటికే నిపుణుల విచారణ, విద్యుత్, అగ్నిమాపక, భవన భద్రతా తనిఖీలకు ఆదేశించిన నేపథ్యంలో.. నివేదికను వేగంగా పూర్తి చేసి వాస్తవాలను ప్రజల ముందుంచడం అత్యవసరం. తప్పిదం నిర్ధారణ కాకముందే ఎవరినీ దోషిగా తేల్చడం సరికాదు. అదే సమయంలో లోపం నిర్ధారణ అయితే.. అది ఏ స్థాయి నిర్వహణలో జరిగింది, ఎవరి పరిధిలో పర్యవేక్షణ బాధ్యత ఉంది, ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేకపోయారు అన్నది స్పష్టంగా తేలాలి. ప్రాణాలు కోల్పోయిన పసికందులు తిరిగి రారు. కానీ వారి మరణం కేవలం ఒక విషాదంగా మిగిలిపోకూడదు. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రమాదానికి ముందే ముప్పును గుర్తించే పర్యవేక్షణ, అప్రమత్తంగా స్పందించే వ్యవస్థ, ప్రాణాలను కాపాడే భద్రతా ప్రమాణాలు మరింత పటిష్ఠం కావాలి. ముఖ్యంగా జిల్లా యంత్రాంగం పరిధిలోని పర్యవేక్షణ వ్యవస్థల్లో ఎక్కడ లోపం జరిగిందో, ముందస్తు చర్యలు ఎక్కడ అవసరమయ్యాయో విచారణ తేల్చాలి. మంటలు ఆరిపోవడం ముగింపు కాదు.. పర్యవేక్షణలోని లోపాలు మళ్లీ ఏ ఆస్పత్రిలోనూ మరో ప్రాణాన్ని బలితీసుకోకుండా వ్యవస్థను మార్చడమే ఈ విషాదానికి నిజమైన సమాధానం.

-ఫిరోజ్ ఖాన్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9640466464

వైద్యులకు రోగులకు వారధులు
ఫార్మసిస్టులు
సెప్టెంబర్ 25... ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం

ఆరోగ్యంపై ప్రతి వారికీ శ్రద్ధ ఉండడం సహజం. ఆరోగ్యం కోసం ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ నానా పాట్లు పడుతుంటారు. చికిత్స కన్నా, నివారణే నయమని, ఇప్పుడిప్పుడే చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఏ చిన్నపాటి రోగం వచ్చినా, వెంటనే మందులు తీసుకుంటున్నారు. ఆరోగ్య మెరుగుదలలో మందులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఇంతకూ మందులను ఎవరు మెరుగు పరుస్తారో, ఎవరు తయారు చేస్తారో తెలుసా? ఫార్మాసిస్టులు. వైద్య బృందంలో ఫార్మసిస్టుల ప్రాముఖ్యత ఎంతో ఉంది. చికిత్స, ఉత్పత్తులను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా రోగులకు ఆరోగ్య సేవలను మెరుగు పరచడం ఔషధ నిపుణుల ప్రాథమిక లక్ష్యం. అందువల్ల, ఫార్మసిస్ట్ యొక్క ప్రాముఖ్యత, పాత్ర గురించి అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25 న ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రపంచ ఫార్మసిస్ట్స్ దినోత్సవంను సెప్టెంబర్ 25 న ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ (ఎఫ్ఐపి) ప్రకటించింది. ఈ సందర్భంగా ఫార్మాసిస్టులు మానవాళి ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు ఎలాంటి పాత్ర పోషిస్తారో, వైద్య ప్రపంచంలో ఫార్మాసిస్టుల పాత్ర ఏమిటో తెలుసుకోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.



వాస్తవానికి ఫార్మాసిస్టు రెండో వైద్యుడిగా పరిగణించబడతాడు. రోగులకు కావాల్సిన మందులను, ఏ రోగికి ఎంత మోతాదులో కావాలో నిర్ధారిస్తాడు. అంతేకాదు వాటి వల్ల ప్రయోజనాలు కలిగేలా చేస్తాడు. దుష్ప్రభావాలు కలగకుండా మార్గ నిర్దేశాలు చేస్తాడు. క్లినికల్ ఫలితాలను మెరుగు పరచడానికి మందులు వాటి వాడే పద్ధతిని, సురక్షితమైన వాడకాన్ని కూడా ప్రోత్సహిస్తాడు.
ప్రపంచం లోని ప్రతి ఒక్కరోగికీ అందరికీ సురక్షితమైన మరియు సమర్థ వంతమైన మందులు అందించేందుకు అనుక్షణం ఫార్మా సిస్టులు కృషి సల్పుతారు. ఔషధాల వాడకాన్ని మెరుగు పరచి, రోగుల భద్రతను నిర్ధారించే మరియు పరిరక్షించేందుకు ఫార్మాసిస్టులు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తారు. ప్రజల ఆరోగ్య భద్రత రీత్యా మెడిసిన్స్ లోని లోపాలను తగ్గించేందుకు ఫార్మాసిస్టులు ఎక్కువగా కృషి చేస్తారు. ఫార్మాసిస్టులు వారి విస్తృత జ్ఞానం మరియు నైపుణ్యాన్ని ప్రజల ఆరోగ్యాల కోసం ఉపయోగిస్తారు. ఏ ఒక్క రోగిని హాని కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందనే విషయాన్ని అనుక్షణం గుర్తుంచుకుని, పని చేస్తారు. వారు తయారు చేసిన మెడిసిన్స్ నుండి ఉత్తమ ఫలితం వచ్చేలా చాలా కృషి చేస్తారు. చాలా మంది వారి పని, తాము సూచించిన మందులను అప్పగించడమే అనుకుంటారు. కానీ జ్ఞానం, అనుభవరం పరంగా వారు డాక్టర్ కంటే ఏ మాత్రం తక్కువ కాదు. ఫార్మాసిస్టులకు మెడిసిన్స్, వాటి దుష్ప్రభావాల గురించి సంపూర్ణ అవగాహన ఉంటుంది. ప్రధానంగా వైద్యుల వద్దకు వెళ్లలేని, వైద్యం చేయించుకోలేని నిరు పేదలకు, ఔషధాలను అందించడం లోనూ వారు ఎక్కువ బాధ్యత వహిస్తారు.
ఫార్మాసిస్టును కూడా ఒకరకంగా వైద్యుడి లాగే తెల్లటి కోటు ధరించి, మందులు పంపిణీ చేసే ఆరోగ్య సంరక్షక నిపుణుడిలా భావించ వచ్చు. కాని ఔషధ పంపిణీకి మించి ఫార్మాసిస్టు పాత్ర విస్తరిస్తుందని మనం తెలుసుకోవాలి. రోగులకు హాని లేదా మరణానికి మరో ప్రధాన కారణం ఔషధ లోపం అని కొన్ని అధ్యయనాలు చెపుతున్నాయి. లోపం తరచుగా శాశ్వత అవయవ నష్టం, పక్షవాతం లేదా మరణానికి దారి తీస్తుంది. ఔషధ లోపం, వాటిని నివారించడంలో ఫార్మాసిస్టుల వల్ల కలిగే పరిణామాలను చూసిన ఈరోజును ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ 2009 ఇస్తాంబుల్ (టర్కీ)లో జరిగిన వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ ఫార్మసీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ లో గుర్తించింది. కానీ అంతకు ముందే 1912 సంవత్సరం లోనే సెప్టెంబర్ 25న ఫార్మాసిస్టు దే జరుపు కోవడానికి ఎంపిక చేయ బడింది. అప్పటి నుండి ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ ప్రారంభించ బడింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచ వ్యాప్తంగా కనీసం 2.6 మిలియన్ ఫార్మసిస్టులు ఇతర ఫార్మాస్యూటికల్ సిబ్బంది ఉన్నట్లు అంచనా వేసింది. ఆరోగ్య కరమైన జీవనానికి సలహా ఇవ్వడం, వ్యాధిని నివారించడానికి టీకాలు వేయడం మందులు సరిగ్గా తీసుకునెలా చూడడం, తద్వారా వ్యాధులను చక్కగా నయం చేయడం, జీవిత నాణ్యతను మెరుగు పరచడం, సురక్షితమైన మరియు సమర్థ వంతమైన మందులు మరియు వ్యాక్సిన్లను అభివృద్ధి చేయడం ద్వారా ఔషధ శాస్త్రవేత్తలు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేస్తున్న సేవలు అమోఘం. ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం అంటే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అందరూ ఫార్మాసిస్టుల సేవలను గుర్తించి, ఔషధ తయారీ నుండి, వలసిన వారికి పంపిణీ, మందులు వాడే విధానం వరకు, అసమాన, అమూల్య సేవలు అందిస్తున్న, వారి ప్రతిభావంత మైన పాత్రకు సముచిత గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలి. ప్రధానంగా ప్రస్తుత పరిస్థితులలో కరోనా వైరస్ యొక్క వ్యాప్తిని ఆపడానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఫార్మసిస్ట్‌లు అవిశ్రాంతంగా కృషి వెల కట్టలేనిది. ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం, పంపిణీ చేయడం, కుటుంబ సభ్యులకు దూరంగా, స్వార్థం మరిచి, మానవ సేవే పరమార్థంగా, ఈ క్లిష్ట సమయంలో ఫార్మసిస్టులు చేస్తున్న సేవలకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం అందించి, కృతజ్ఞతలు ప్రకటించాల్సిన సమయం ఇది.

ప్రపంచం లోని ప్రతి ఒక్కరోగికీ అందరికీ సురక్షితమైన మరియు సమర్థ వంతమైన మందులు అందించేందుకు అనుక్షణం ఫార్మా సిస్టులు కృషి సల్పుతారు. ఔషధాల వాడకాన్ని మెరుగు పరచి, రోగుల భద్రతను నిర్ధారించే మరియు పరిరక్షించేందుకు ఫార్మాసిస్టులు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

ఏకాత్మతా మానవవాద సిద్ధాంత కర్త దీన్ దయాళ్

కొందరు మరణించేవరకు జీవిస్తారు, కొందరు మరణించిన తర్వాత కూడా జీవిస్తారు. రెండవ కోవకు చెందిన వారు పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ. అతి సామాన్య కుటుంబంలో జన్మించి అసామాన్య వ్యక్తిగా ఎదిగారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మాజీ అధ్యక్షుడు, భారతీయ జనసంఘ్ మాజీ అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ హైందవ రాష్ట్రం సిద్ధాంతకర్త దీనదయాళ్ ఉపాధ్యాయ. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ 1916 సెప్టెంబర్ 25న ఉత్తర ప్రదేశ్ లోని మధుర దగ్గర 'నగ్ల చంద్రభాన్' అనే గ్రామంలో జన్మించారు. చిన్నతనంలోనే తల్లి, తండ్రి మరణించిన దీనదయాళ్ జీ మేనమామ ఇంటిలో పెరిగారు.

నేడు దీన్ దయాళ్ ఉపాధ్యాయ జన్మదినం

1925 ప్రాథమిక విద్యకు శ్రీకారం చుట్టిన దయాళ్ కాన్పూర్‌లో బి.ఎ, చదువు తున్నప్పుడు ఆర్ఎస్ఎస్‌తో పరిచయం ఏర్పడింది. 1937లో మొదటి కొద్దిమంది స్వయం సేవకులలో ఒకరిగా చేరి ప్రాదేశిక సహ ప్రచారక్ స్థాయికి ఎదిగారు. అప్పటి నుండి ఆయన జీవిత విధానం, గమ్యం మారిపోయింది. సంఘ్‌లో పనిచేస్తూనే బి.ఎ, డిగ్రీ, ఉపాధ్యాయ శిక్షణ ఎంఎ, ప్రథమ సంవత్సరం పూర్తిచేశారు. సంఘ్ విస్తరణకు పూర్తి సమయం ఇచ్చేందుకు చదువుకు స్వస్తి పలికారు. ఉత్తర ప్రదేశ్‌లోని లఖంపూర్ ప్రాంతానికి ప్రచారకులుగా నియుక్తులైన కొద్ది సంవత్సరాల లోనే ఆ ప్రాంతంలో సంఘ్ కార్యక్రమాలను వికసింప జేశారు. అది గమనించిన సంఘ్ పెద్దలు వారిని ఉత్తరప్రదేశ్ ప్రాంత సహ ప్రచారకులుగా నియమించారు. ఆయన అసామాన్యమైన ప్రతిభా పాటవాలు అందరినీ ఆకట్టు కున్నాయి. సంఘ్ కార్యక్రమాలు చూస్తూనే పత్రికారంగంపై దృష్టి సారించి రాష్ట్ర ధర్మ ప్రకాశన్ అనే సంస్థ ఏర్పాటు చేశారు. ఆ ప్రకాశన్ ద్వారా "రాష్ట్ర ధర్మ", అనే ఒక మాస పత్రిక, "పాంచజన్య" అనే వారపత్రిక, "స్వదేశ్" అనే దిన పత్రిక ప్రారంభించారు. ఆ పత్రికలు దీనదయాళ్ జీ కార్యదీక్షకు ప్రతీకలుగా నిలిచాయి. 1952లో భారతీయ జన సంఘ్ లో చేరి ఉపాధ్యక్షులుగా నియమితుడైనారు. 1967లో జన సంఘ్ అధ్యక్ష పదవి చేపట్టేవరకు ఆ పదవిలో కొన సాగారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మరణించాక, పార్టీ బాధ్యతలు భుజాన వేసుకొని విజయ పథంలో నడిపించారు. అలాగే ఆర్. ఎస్. ఎస్ వారపత్రిక పాంచజన్య, లక్నో దినపత్రిక 'స్వదేశ్'లకు సంపాదకులుగా వ్యవహరించారు. భారతీయ జనతా పార్టీ హైందవ రాష్ట్రం సిద్ధాంతానికి పునాదిగా చెప్పబడే ఏకాత్మతా మానవతా వాదం, శంకరాచార్య జీవిత చరిత్ర వంటి పుస్తకాలు, హిందీలో 'చంద్రగుప్త మౌర్య' నాటకం, మరాఠీ నుండి ఆర్. ఎస్. ఎస్ వ్యవస్థాపకులు డా. హెడ్గేవార్ జీవిత చరిత్ర అనువాదం వంటి పలు రచనలు చేశారు. భారతీయ జనసంఘ్‌కు సిద్ధాంతాలు ఉన్నాయని వివరించే క్రమంలో "ఏకాత్మతా మానవతా వాదం" అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. అట్టడుగున పడివున్న మానవుడు ఐహిక సుఖంతో వర్ధిల్లి, ఆధ్యాత్మిక దృష్టితో మానవసేవ చేయడమే సరైన జీవిత విధానమని అందులో వాదించారు. గాంధీజీని కాల్చి చంపిన నేరాన్ని హిందూ మహాసభతో పాటు ఆర్ఎస్ఎస్ పై కూడా మోపిన నేపథ్యంలో, ఆనాటి ప్రధాని నెహ్రూజీ సంఘ్‌ను నిషేధించారు. ఆ నిషేధాన్ని తొలగించాలంటూ జరిగిన ఉద్యమానికి ఉత్తర ప్రదేశ్‌లో దీనదయాళ్ జీ నిర్వహించిన పాత్ర గణనీయమైంది. ఈ హత్యానేరంలో సంఘ్ పాత్ర లేదని దీనదయాళ్ జీ పాంచజన్యలో స్పష్టం చేస్తూ ప్రభుత్వ అణచివేత విధానాలకు వ్యతిరేకంగా రాసిన రాతలకు ఆనాటి ప్రభుత్వం పాంచజన్యను నిషేధించింది. దానికి బదులుగా "హిమాలయ" అనే మరో వార పత్రికను ప్రారంభించి తన కలంతో నాటి ప్రభుత్వానికి కలవరం పుట్టించారు. ఈలోగా గాంధీజీ హత్యా నేరంలో ఆర్ఎస్ఎస్ పాత్ర లేదని భారత అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. జాతి, జాతీయత, భారతీయ సంస్కృతి, ధర్మం మొదలైన విషయాలపై ఆయనలోని అభిప్రాయాలు, మౌలిక సిద్ధాంతాలు తదితరాలపై ఆయన రచనా వ్యాసంగం కొనసాగింది. నాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ విధానాలు, భారతీయ తత్వజ్ఞాన సారాన్ని దేశ కాల మాన పరిస్థితులకు అనుగుణంగా అన్వయించి సామ్రాట్, చంద్రగుప్త, జగద్గురు శంకరాచార్య అనే చారిత్రక నవలలను కూడా దయాళ్‌జీ రాశారు. 1951లో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ప్రధాని నెహ్రూ విధానాలకు నిరసనగా కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి బయటికి వచ్చారు. ఆనాడు దేశవ్యాప్తంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రధానమంత్రి నెహ్రూ అనుసరిస్తున్న, ముస్లిం సంతుష్టీ కరణ, హిందూ ధర్మ వ్యతిరేక విధానాలను ఎదుర్కొనడానికి, భారతీయ సంస్కృతి సభ్యులతో, జాతీయ భావాలతో కూడుకున్న రాజకీయ పార్టీని స్థాపించాలనే ఉద్దేశంతో ఆనాటి ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ గురూజీ సహాయాన్ని అర్థించారు. ఆయన కోరిక ప్రకారంగా పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ, అటల్ జీ, జగన్నాధరావు జీ, సుందర్ సింగ్ భాండారి లాంటి మరి కొందరు యువకులను అప్పగించారు. డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ 1951 అక్టోబరు 21న ఏర్పాటు చేసిన జనసంఘ్ పార్టీకి ప్రధాన కార్యదర్శిగా దీనదయాళ్ జీ ఎన్నికైనారు. పార్టీ స్థాపించిన మూడు మాసాలకే 1952లో జరిగిన జనరల్ ఎన్నికలలో పోటీ చేసిన నాలుగు జాతీయ రాజకీయ పార్టీలలో ఒకటిగా జనసంఘ్ ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందింది. తన ఉనికిని సాధారణ ఎన్నికలలో రుజువు చేసుకో గలిగింది. దీనికి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ నాయకత్వంతో పాటు దీనదయాళ్ జీ సమన్వయ కౌశలం కూడా తోడైంది. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ మరణం తర్వాత జనసంఘ్ నామరూపాలు లేకుండా పోతుందని ఆశించిన వారి ఆలోచనలను తలకిందులు చేస్తూ పార్టీని దేశ వ్యాప్తంగా పటిష్ఠ పరచిన ఘనత దీనదయాళ్‌జీకి ఆయన సహచరులకు దక్కుతుంది. భారతీయ జనసంఘ్‌కు సిద్ధాంతాలు లేవన్నవారికి సవాలు విసురుతూ, ఏకాత్మతా మానవతా వాదం అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. అట్టడుగున పడివున్న మానవుడు ఐహిక సుఖంతో వర్ధిల్లి, ఆధ్యాత్మిక దృష్టితో మానవసేవ చేయడమే సరైన జీవిత విధానమని అందులో వాదించాడు. భారతీయ జనసంఘ్ అఖిల భారత కార్యదర్శిగా ఎక్కువ కాలం పనిచేసిన దీనదయాళ్‌జీ కార్యకర్తల హృదయాలను మలిచి వారి మనస్సులలో అతి స్థిర స్థానాన్ని చూరగొన్నారు. సుఖమంటే ఏమిటో తెలియక కష్టాలనే చవిచూస్తూ దేశ సేవ నిమగ్నమై దానినే జీవన కార్యంగా స్వీకరించాడు. జనసంఘ్‌లో చేరినప్పటి నుంచి మహారథియై పార్టీకి సారథ్యం వహించి, దేశ రాజకీయాలలో జనసంఘ్‌కు ప్రత్యేక స్థానాన్ని కల్పించడంలో కృతకృత్యులై 1967లో పార్టీ అఖిల భారత అధ్యక్షుడు కాగలిగారు. కాలికట్‌లో జరిగిన అఖిల భారత జనసంఘ్ మహాసభలో భారత దర్శనాన్ని ప్రదర్శింపచేసి విశేష కీర్తి నార్జించారు. ఆ కీర్తియే జనసంఘ్ సిద్ధాంత వ్యతిరేకుల కినుకకు కారణమైంది. రాజకీయాలకు చిత్త శుద్ధి గల నేత బలి అయినారు. ఉత్తర ప్రదేశ్‌లోని మొగల్ సరాయి రైల్వే స్టేషన్‌లో 1968 ఫిబ్రవరి 11న రైలు పట్టాల వద్ద శవమై కనిపించారు. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మరణం మాదిరిగానే దీనదయాళ్‌జీ మరణం కూడా పలు అనుమానాలకు దారితీసింది.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

50 ఏళ్ల విమలక్క ప్రజా కళా ప్రస్థానానికి ఘన నివాళి

- ఈ నెల 26 నుంచి 28 వరకు హైదరాబాద్‌లో ప్రజా కళా జాతర
- 50 గంటల పాటు పాట, ఆట, మాట కార్యక్రమాలు



కరీంనగర్, సెప్టెంబర్ 24(సింగిడి): 52 ఏళ్ల అరుణోదయంలో 50 ఏళ్ల విమలక్క ప్రస్థానం" పేరుతో ఈ నెల 26 నుంచి 28 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రజా కళా జాతరను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ప్రజా కళా జాతర కరపత్రాలను ఆవిష్కరించారు. తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ జిల్లా పూర్వ అధ్యక్షుడు బొల్లం లింగమూర్తి పటేల్, పూర్వ కార్యదర్శి బిజిగిరి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అరుణోదయ కళాకారులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 52 ఏళ్ల అరుణోదయ సాంస్కృతిక ప్రస్థానంలో 50 ఏళ్లుగా విమలక్క కొనసాగిస్తున్న ప్రజా కళా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఈ జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళ్యాణ మండపం (నాగన్న ప్రాంగణం)లో మూడు రోజుల పాటు కార్యక్రమాలు కొనసాగుతాయని, 50 గంటల పాటు వివిధ కళారూపాలు, పాటలు, ఆటలు, మాటల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలు, సామాజిక చైతన్యం, ఉద్యమాల నేపథ్యాన్ని కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. విమలక్క ఐదు దశాబ్దాలుగా వివిధ ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేశారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ ధూంధాం కార్యక్రమాల ద్వారా ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో సాంస్కృతిక కళాకారుల పాత్రను గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ప్రజా కళలు, సాంస్కృతిక ఉద్యమాలతో సుదీర్ఘ అనుబంధం ఉందని, జిల్లాకు చెందిన కళాకారులు, కవులు, గాయకులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజా కళా జాతరను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా ఉద్యమ నాయకురాలు ఓల్లాల వాణి, కళాకారులు పొద్దుపొడుపు శంకర్, దుర్గం మురళిగౌడ్, పల్లె రాజేశం, వెంకటేష్ వెంకీ, కలర్ సత్తన్న, పల్లె నారాయణగౌడ్, జీఎస్ ఆనంద్, కోటేశ్వర్, లింగంపల్లి సత్యనారాయణ, గాలిపల్లి శ్రీనివాస్, పూసల సంపత్‌కుమార్, సర్దార్ రణధీర్‌సింగ్, కెమంసారం సమ్మయ్య, మహమ్మద్ అంజద్, పెద్దపల్లి మధుసూదన్, తోట రాకేష్, కొల్లిపాక శ్రీనివాస్, సుహాసిని బిందు, గడ్డం లత తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

చిగురుమామిడి ఆదర్శ పాఠశాల, కళాశాలలో

'నషా ముక్త్ భారత్ అభియాన్'పై అవగాహన



కరీంనగర్, సెప్టెంబర్24(సింగిడి): మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చిగురుమామిడి ఆదర్శ పాఠశాల, కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు మత్తు పదార్థాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అర్జిత్ కౌర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మిషన్ వాత్సల్య అధికారి సాదినేని రమేష్, బాలల సహాయవాణి ప్రతినిధి సుందరగిరి సాయికిరణ్ గౌడ్, పోషణ్ అభియాన్ సిబ్బంది రోమిలా, ప్రణీత, మహిళా సాధికారత కేంద్రం లింగ నిపుణురాలు కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, కుటుంబం, విద్య, భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాలను జాగ్రత్తగా వినియోగించాలని, అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దని, వ్యక్తిగత వివరాలు, చిత్రాలు, ఇతర సమాచారాన్ని తెలియని వారికి ఇవ్వకూడదని సూచించారు. అనుమానాస్పద సందేశాలు, అనుసంధానాలు, వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని, చదువుపై పూర్తి ఏకాగ్రతతో దృష్టి సారించి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని అతిథులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పీజీ నాలుగో సెమిస్టర్‌లో 95.29 శాతం ఉత్తీర్ణత

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫలితాలు విడుదల



కరీంనగర్, సెప్టెంబర్24(సింగిడి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), కరీంనగర్‌లో జూలైలో నిర్వహించిన పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ అఫ్సరీ ఉస్మాని విడుదల చేశారు. కళాశాల పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జి. శ్రీనివాస్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ బి. రజనిదేవి, కె. సతీష్‌కుమార్, విద్యా సమన్వయకర్త డాక్టర్ ఎన్. మనోజ్‌కుమార్ సమక్షంలో ఫలితాలను ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 170 మంది విద్యార్థినులు హాజరుకాగా, 162 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. దీంతో 95.29 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. 2024--26 పీజీ బ్యాచ్‌లో మొత్తం 170 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా, 153 మంది అన్ని సెమిస్టర్లలో ఉత్తీర్ణత సాధించి 90 శాతం మొత్తం ఉత్తీర్ణత నమోదైనట్లు వివరించారు. విద్యార్థినులు ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో లేదా ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు.

జన్మదిన వేడుకల పేరిట డబ్బు వృథా చేయొద్దు

మానకొండూర్ ఎమ్మెల్యే,టీపీసీసీ

ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి



మానకొండూర్, సెప్టెంబర్24(సింగిడి): జన్మదిన వేడుకల పేరుతో డబ్బును ఆర్భాటంగా ఖర్చు చేయకుండా సమాజానికి, విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలకు వెచ్చించాలని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. గన్నేరువరం మండలం జంగపల్లి గ్రామ సర్పంచ్ తాడూరి కరుణశ్రీ --రమణారెడ్డి దంపతుల కుమార్తె జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ కుమార్తె జన్మదినం సందర్భంగా సొంత ఖర్చులతో పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు అందించడం అభినందనీయమన్నారు. జన్మదిన వేడుకల పేరుతో తల్లిదండ్రులు ఆర్భాటాలకు వెళ్లి అధికంగా డబ్బు ఖర్చు చేస్తున్నారని, ఆ మొత్తాన్ని విద్యార్థులకు అవసరమైన వస్తువులు అందించేందుకు లేదా ఇతర సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తే మరింత సార్థకత ఉంటుందని అన్నారు. పిల్లలు కూడా తమ పుట్టినరోజు సందర్భంగా తోటి విద్యార్థులకు పుస్తకాలను కానుకగా అందించే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు.



నగరంలో ప్రశాంతంగా, వైభవంగా ముగిసిన గణేశ్ నిమజ్జనోత్సవాలు

ప్రజలు, అధికారులు, ఉత్సవ కమిటీల సమన్వయంతో విజయవంతం

డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు



కరీంనగర్, సెప్టెంబర్24(సింగిడి): నగరంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు, గణేశ్ నిమజ్జన వేడుకలు ప్రశాంతమైన, ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా ముగిశాయని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉప మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు. నగరవ్యాప్తంగా ప్రతిష్ఠించిన సుమారు 2,300 గణేశ్ విగ్రహాలను వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు ప్రశాంతంగా నిమజ్జనం చేశారని పేర్కొన్నారు. చింతకుంట, మానకొండూర్, కొత్తపల్లి తదితర ప్రధాన నిమజ్జన కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమం సజావుగా సాగిందన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచనల మేరకు నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు నగరపాలక సంస్థ పూర్తి స్థాయిలో చేపట్టిందని తెలిపారు. అనివార్య కారణాలతో బండి సంజయ్ ప్రత్యక్షంగా హాజరు కాలేకపోయినా, ఢిల్లీ నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితులను తెలుసుకుంటూ అధికారులకు సూచనలు, ఆదేశాలు ఇచ్చారని వెల్లడించారు. నిమజ్జన ప్రక్రియ ప్రారంభం నుంచి చివరి విగ్రహం వరకు తాను, మేయర్, కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించామని సునీల్ రావు తెలిపారు. పారిశుధ్యం, విద్యుత్, తాగునీరు, నిమజ్జన కేంద్రాల వద్ద ఏర్పాట్లను అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించారని చెప్పారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణలో సహకరించిన జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖకు, అలాగే ఉత్సవాల విజయవంతానికి సహకరించిన నగర ప్రజలు, భక్తులు, మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీలు, హిందూ సంఘాలు, పారిశుధ్య కార్మికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

టవర్ సర్కిల్‌లో వైభవంగా వినాయక నిమజ్జన వేడుకలు

వేడుకల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం



కరీంనగర్, సెప్టెంబర్24(సింగిడి): కరీంనగర్ పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిమజ్జన వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. విశ్వహిందూ పరిషత్, హిందూ ఉత్సవ సమితి, కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ప్రసిద్ధ టవర్ సర్కిల్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ శోభాయాత్రలతో తరలివచ్చిన గణనాథుల ప్రతిమలకు టవర్ సర్కిల్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ, వినాయక నవరాత్రి ఉత్సవాలు కుల, మతాలకు అతీతంగా ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి హిందూ ఐక్యతను చాటుతాయని అన్నారు. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడిని కడసారి దర్శించుకోవడం సనాతన సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమన్నారు. భక్తులు, యువజన సంఘాలు సమన్వయంతో వ్యవహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులు కరీంనగర్ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు, బీజేపీ కార్యకర్తలు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టవర్ సర్కిల్ ప్రాంతం 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో మార్మోగింది.

పిట్టల లింగయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ ఈటల రాజేందర్

కరీంనగర్‌లో దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై చిత్రపటానికి నివాళులు



కరీంనగర్, సెప్టెంబర్24(సింగిడి): పట్టణంలోని కట్టరాంపూర్ వాస్తవ్యులు స్వర్గీయ శ్రీ పిట్టల లింగయ్య ఇటీవల మృతి చెందగా, గురువారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ శ్రీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లింగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు కార్యక్రమం లో మాజీ ఏంఎల్ఏ బోడిగే శోభ, ముదిరాజ్ సంఘ నాయకులు నర్సయ్య, బీజేపీ నాయకులు జంగాలపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన తీర్థాల పనులను వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



మహాదేవపూర్ సెప్టెంబర్ 24 (సింగిడి): రాబోయే గోదావరి పుష్కరాల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరిగే అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రంలో నూతన తీర్థాల అభివృద్ధి పనులను , పుష్కరాలకు వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పనకు అవసరమైన రహదారి నిర్మాణ పనులను వీర్వంతం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. సిరోంచ అంతరాష్ట్ర బ్రిడ్జి నుంచి ప్రధాన ఘాట్ వరకు సుమారు రెండు కిలోమీటర్లు, సరస్వతి ఘాట్ నుంచి పక్షి తీర్థం వరకు 0.8 కిలోమీటర్ల పరిధిలో నూతనంగా ఏర్పాటు చేయుచున్న ఐదు తీర్థాల ప్రతిపాదిత స్థలాలను ఆయన పరిశీలించారు. అవసరమైన మౌలిక వసతులు, రహదారి సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. ఆదిముక్తీశ్వర దేవాలయం నుంచి సరస్వతి ఘాట్ వరకు భూసేకరణ పూర్తయిన శాశ్వత రహదారి నిర్మాణ స్థలాన్ని పరిశీలించి, రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం నిమజ్జన ప్రాంతంలో భద్రత ఏర్పాట్లను పరిశీలించి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు చోటు చేసుకోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రీ సర్వే పనులపై కన్నెపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి రిసర్వే పనులను వేగవంతంగా నిర్వహిస్తూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సర్వే సిబ్బందికి స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ తహసిల్దార్ సత్యనారాయణ స్వామి, మండల సర్వేయర్ తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారదకు ఘన సన్మానం...

దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు



జమ్మికుంట, సెప్టెంబర్ 24 (సింగిడి): తెలంగాణ మహిళా కమిషన్ చైర్మన్ గా ఇటీవల ఎన్నికైన నేరెళ్ల శారద ను మర్యాదపూర్వకంగా కలిసిన ఇల్లంతకుంట దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు. హైదరాబాద్ బుద్ధ భవన్‌లో రెండవసారి తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ గా నేరెళ్ల శారద పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా, వారిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసి శాలువాతో సన్మానం చేసి శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం మెమెంటో ముత్యాల తలంబ్రాలను అందించిన ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి మేక మల్ల అశోక్, మడిపల్లి గ్రామ సర్పంచ్ మేకమళ్ళ తిరుమల వెంకటేష్, ఏ ఏం సి డైరెక్టర్ ఎగ్గేటి సదానందం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద ఘటనపై ఎంపీ ఈటల రాజేందర్ ఆరా..

మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి..

గాయపడిన రమేష్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలి

నిమ్స్ వైద్యులకు సూచించిన ఈటెల



జమ్మికుంట, సెప్టెంబర్ 24 (సింగిడి): హుజురాబాద్ మండలంలోని పెద్దపాప య్యపల్లి సమీపంలో బుధవారం నేషనల్ హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కొంకటి సులోచన (44) మృతి చెందగా, ఆమె భర్త బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు కొంకటి రమేష్ తీవ్రంగా గాయపడిన ఘటనపై మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. రోడ్డు ప్రమాదంలో సులోచన మృతి చెందడం పట్ల ఈటల రాజేందర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న కొంకటి రమేష్‌ను మెరుగైన వైద్యం కోసం నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. రమేష్ ఆరోగ్య పరిస్థితిపై ఈటల రాజేందర్ స్వయంగా నిమ్స్ వైద్యులు, ఆసుపత్రి ఉన్నతాధికారులతో మాట్లాడి, అవసరమైన వైద్య సహాయం అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఈటల రాజేందర్ హామీ ఇవ్వడం జరిగింది.

సాంకేతిక మేళవింపుతో రైతులు వ్యవసాయం చేయాలి

● జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచన





వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 24 (సింగిడి): రోజు రోజుకు మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా కొంగొత్త ఆలోచనలు, సాంకేతిక మేళవింపుతో రైతులు వ్యవసాయం చేయాలని, అప్పుడే రైతులు లాభాలు ఆర్జిస్తారని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని పద్మావతి శ్రీనివాస గార్డెన్ లో నిర్వహించిన కిసాన్ మేళ –2026 కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కిసాన్ మేళలో ఆయా కంపెనీలు తాము రూపొందించిన మేలురకం విత్తనాలు, సోలార్ ఫెన్సింగ్, రసాయన మందులు, కోళ్లు, పొట్టేళ్ళు, గిరి జాతి ఆవులు, సమీకృత ఉద్యాన, పట్టు పరిశ్రమ, పామాయిల్, కిసాన్ క్రెడిట్ కార్డు, ఆధునిక వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు ఈ కిసాన్ మేళాలో ప్రదర్శనకు ఉంచి రైతులకు వారి ఉత్పత్తులపై అవగాహన కల్పించగా జిల్లా కలెక్టర్ అన్ని స్టాళ్లను సందర్శించి ఉత్పత్తుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన కిసాన్ మేళా కార్యక్రమంలో కలెక్టర్ ప్రసంగిస్తూ వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు ఒక ప్రణాళిక ప్రకారం కిసాన్ మేళాను ఏర్పాటు చేసి వేల సంఖ్యలో రైతులను మేళాను సందర్శించే విధంగా చేసినందుకు అధికారులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. కిసాన్ మేళా అనేది ఒక చక్కని కార్యక్రమం అని, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా దేశంలోని పరిశ్రమలు ఈ ప్రాంత వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉండే విధంగా కనుగొన్న కొత్త కొత్త వంగడాలు, రసాయన ఎరువులు, యాంత్రిక పరికరాలు ఒకే చోట స్టాల్స్ లో పెట్టి రైతులకు వ్యవసాయ పద్ధతులు, పండించే పంటలపై అవగాహన కల్పిస్తారని, వీటి ద్వారా రైతులు కొత్త ఆలోచనలతో లాభసాటి వ్యవసాయం చేసేందుకు దోహదపడతాయని తెలిపారు. ప్రతి మంగళవారం రైతు వేదికల ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటలు సాగు చేసే విధానం, వాటికి వచ్చే చీడపురుగుల నివారణ, లాభసాటి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తారని అందువల్ల రైతులు ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రస్తుత సంవత్సరం ఎల్ నీనో ప్రభావం వల్ల వర్షపాతం చాలా తక్కువగా నమోదు అయిందని, గత సంవత్సరం ఈ సమయానికి 100 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైతే ఈ సంవత్సరం కేవలం 42 సెంటీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదయిందన్నారు. వరి పంట సాగుకు సరిపడా నీళ్లు లేకపోయే పరిస్థితి ఉన్నందున రైతులకు వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని అనేక రకాలుగా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. పర్యావసానంగా గత సంవత్సరం వాన కాలంలో 2.25 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తే ఈ వాన కాలంలో 1.70 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు చేయడం జరిగిందని అన్నారు. రైతులు వాతావరణానికి అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సంవత్సరం జిల్లాలో మినుము పంట సాగు 30000 ఎకరాలకు ఎగబాకినందుకు అభినందించారు. పామాయిల్ పంట వల్ల చాలా లాభాలు ఉంటాయని, కేవలం మూడు సంవత్సరాలు అంతర్ పంటలు వేసుకుంటూ పామాయిల్ సాగును కాపాడుకుంటే 30 సంవత్సరాల వరకు లాభాలు అర్థించవచ్చని చెప్పారు. వచ్చే సంవత్సరం వనపర్తి జిల్లాలో యూనిక్ పామ్ ఆయిల్ కంపెనీ ప్రారంభమవుతుందని, అప్పుడు జిల్లాలోని పామాయిల్ క్రషింగ్ చేసి ఆయిల్ తీయడం జరుగుతుందన్నారు. తద్వారా రైతులకు మరింత లాభసాటిగా ఉంటుందని చెప్పారు. ఇప్పుడు వరి పండిస్తున్నరైతులు ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి తీస్తూ ఉండవచ్చు కానీ రాబోయే తరానికి ఆ భూమిలో 10 క్వింటాలు సైతం దిగుబడి సాధించలేరని, అంతగా భూమి తన సారాన్ని పూర్తిగా కోల్పోతుందని వెల్లడించారు. రాబోయే తరానికి సారవంతమైన భూమిని అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని రైతులను కోరారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు మాట్లాడుతూ రైతులకు కొత్త పద్ధతులు కొత్త వంగడాలు యాంత్రిక పరికరాలను పరిచయం చేయడమే కిసాన్ మేళ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రస్తుతం ఎల్ నీనో ప్రభావం వల్ల సాగు నీటి లభ్యత లేనందున యాసంగిలో రైతులు వరి కి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కె.వి.కె వ్యవసాయ శాఖ రాజేందర్ రెడ్డి, సాయిచరణ్ రెడ్డి, మాజీ సర్పంచ్ సూర్య చంద్రారెడ్డి ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ పద్ధతులపై మాట్లాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి రమేష్, వ్యవసాయ అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి స్వర్ణగిరి క్షేత్రంలో వైభవంగా గిరి ప్రదక్షిణం



యాదాద్రి ప్రతినిధి, సెప్టెంబర్ 24 (సింగిడి): తెలంగాణ రాష్ట్రం లోనే ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్ర మైన యాదాద్రి తిరుమల స్వర్ణగిరి దేవస్థానంలో శ్రవణా నక్షత్రం వెంకటేశ్వర స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని ఉదయం 6 గంటల 30 నిమిషాలకు స్వర్ణగిరి క్షేత్రంలోని స్వామివారి పాదాల వద్ద ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు , చైర్మన్లు మానేపల్లి మురళీ కృష్ణ , గోపికృష్ణల ఆదేశాల మేరకు గిరి ప్రదక్షిణ యొక్కవిశిష్టతను విచ్చేసిన భక్తులకు వివరించిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్య క్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి గోవింద నామాలను స్మరిస్తూ గిరి ప్రదక్షిణ గావించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించు కోని దివ్యాను భూతిని పొందారు. సాయంత్రం 6:30 నిమిషాలకు పద్మా వతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య విమాన రథోత్సవానికి ఆలయ ఈవో అమరనాథ్ , ఆలయ సిఐఆర్ఓ సాయిబాబా సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాస్ కొబ్బరికాయలు కొట్టి స్వర్ణగిరీషుని దివ్య విమాన రథోత్సవ కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి రథాన్ని లాగి మహతానందాన్ని పొంది ఆనంద పరవశు లయ్యారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టారు. అలాగే గిరి ప్రదక్షణకు వచ్చే చంటి పిల్లల తల్లుల కోసం ప్రత్యేక ఏర్పాటు చేయడం జరిగిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఖానాపురంలో ఘనంగా వినాయక నిమజ్జనం



కోదాడ, సెప్టెంబర్ 24 (సింగిడి): అనంతగిరి మండలంలోని ఖానాపురం గ్రామం 7వ వార్డులో వినాయకుడి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు, యువత ఉత్సాహంగా పాల్గొని డప్పులు, మేళతాళాలతో వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తరలించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువత సందడిగా నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు చర్యలు చేపట్టారు.

లడ్డుతో పాటు స్కూటీని దక్కించుకున్న మాధురి



చింతపల్లి, సెప్టెంబర్ 24 (సింగిడి): మండల కేంద్రంలోని శివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీ గణేష్ విగ్రహ మండపం వద్ద లడ్డూ ప్రసాదం, ఇతర కానుకలకు నిర్వహించిన వేలంపాట, లాటరీ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి లడ్డూతో పాటు ఎలక్ట్రిక్ స్కూటీని లాటరీ పద్ధతిలో డ్రా తీయగా, మండల కేంద్రానికి చెందిన వందనపు మాధురి అంజనేయులు దక్కించుకున్నారు. వరుసగా రెండో ఏడాది కూడా స్వామివారి లడ్డూ డ్రాలో తమకు రావడం ఎంతో ఆనందంగా ఉందని మాధురి తెలిపారు. గణేశుడి ఆశీస్సులతోనే ఈ అదృష్టం దక్కిందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా స్వామివారి చిన్న లడ్డూను గోవిందు రవి రూ. 60 వేలకు, స్వామివారి రూపాయి హారాన్ని కుంభం శ్రీనివాస్ రెడ్డి రూ. 11 వేలకు వేలంపాటలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సోమరాజు ప్రదీప్ కుమార్, గోవిందు ప్రసాద్ లతోపాటు కృష్ణ, దాచేపల్లి మధు, నామపురపు సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మామునూరు విమానాశ్రయానికి 'కాకతీయ' పేరు పెట్టాలి

● ప్రజల డిమాండ్



హనుమకొండ, సెప్టెంబర్ 24 (సింగిడి): ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న మామునూరు విమానాశ్రయం పనులు వేగవంతం అవుతున్న తరుణంలో దానికి పేరు ఏమి పెట్టాలనే చర్చ రాష్ట్ర వ్యాప్తంగా జోరుగా సాగుతోంది. మామునూరు ఎయిర్ పోర్ట్ కు "కాకతీయ విమానాశ్రయం" లేదా "కాకతీయ టెర్మినల్" అని పేరు పెట్టాలని చరిత్రకారులు, ప్రజా సంఘాలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కాకతీయుల రాజధానిగా ఓరుగల్లు ఖ్యాతి ప్రపంచవ్యాప్తంగా ఉంది. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయం, వేయి స్తంభాల గుడి, వరంగల్ కోట వంటి కట్టడాలు కాకతీయుల గొప్పతనానికి నిదర్శనం. అలాంటి గొప్ప చరిత్ర కలిగిన ప్రాంతంలో వస్తున్న విమానాశ్రయానికి కాకతీయుల పేరు పెడితే చరిత్రకు గౌరవం దక్కుతుందని, పర్యాటకంగా కూడా ఎంతో ఉపయోగపడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్‌లో రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం తరహాలోనే, వరంగల్ లో కాకతీయ అంతర్జాతీయ విమానాశ్రయం ఉండాల్సిన ప్రాముఖ్యత ఎంతైనా ఉంది. ఫ్లైట్ దిగగానే ప్రయాణికులకు ఓరుగల్లు చరిత్ర గుర్తుకు రావాలి. మామునూరు పేరుతో పాటు కాకతీయ పేరును జోడించి మామునూరు కాకతీయ విమానాశ్రయం అని నామకరణం చేయాలనే అభిప్రాయం కూడా పలువురిలో వ్యక్తమౌతుంది. ఈ విషయంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కాకతీయ పేరును ఖరారు చేయాలని విద్యార్థి, చరిత్ర అభిమానులు విజ్ఞప్తి చేస్తున్నారు. విమానాశ్రయానికి వచ్చి వెళ్లే ప్రయాణికులకు రహదారులు విశాలంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఈ రహదారులను ప్రధాన రహదారులకు అనుసంధానం చేసే విధంగా రోడ్ల నిర్మాణం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలుస్తుంది. ప్రధానంగా మామునూరు విమానాశ్రయం కాకతీయ కళా సంస్కృతి, శిల్ప నైపుణ్య వాస్తు కలలకు పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిసింది.

గంగమ్మ ఒడికి గణనాథులు

ట్రై సిటీలో అంగరంగ వైభవంగా వినాయక నిమజ్జనం



హనుమకొండ, సెప్టెంబర్ 24 (సింగిడి): వినాయక చవితి ఉత్స వాల ముగింపు సందర్భంగా గణేష్ నిమజ్జనానికి వరంగల్, హనుమ కొండ, కాజీపేట ట్రై-సిటీ పరిధిలో అధికారులు 14 ప్రధాన చెరువులను సిద్ధం చేశారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది ప్రధానంగా చిన్న వడ్డెపల్లి (దేశాయిపేట), ఉర్సు గుట్ట రంగసముద్రం (కరీమాబాద్), పద్మాక్షి సిద్దేశ్వర గుండం లను ప్రధాన నిమజ్జన కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఇక్కడ అత్యధికంగా విగ్రహాల నిమజ్జనం జరుగుతుంది. వీటితో పాటు ఇతర నిమజ్జన ప్రదేశాలు వరంగల్ కోట చెరువు , అగర్తల చెరువు, మామునూరు పెద్ద చెరువు, బెస్తం చెరువు, కాజీపేట బంధం చెరువు, చల్లా చెరువు గోపాల్ పూర్, భీమారం, హసన్ పర్తి, ముచ్చర్ల, గీసుగొండ కట్ట మల్లన్న చెరువులు. నిమజ్జనం కోసం అన్ని చెరువుల వద్ద క్రేన్లు, తెప్పలు, గజ ఈతగాళ్లు, వైద్య బృందాలు, భారీ లైటింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఆంక్షలు, శాంతిభద్రతల కోసం దాదాపు 2000 మంది పోలీసు, మున్సిపల్ సిబ్బందిని నియమించారు. భక్తులు ప్లాస్టిక్ వాడకాన్ని నివారించి, మట్టి గణపతులను పర్యావరణ హితంగా నిమజ్జనం చేయాలని, డీజేలకు దూరంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

నిమజ్జనం ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్

వినాయక విగ్రహ నిమజ్జనంలో భాగంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ బుధవారం నిమజ్జన ప్రధాన ప్రాంతాలైన బంధం చెరువు, చిన్న వడ్డేపల్లి చెరువులను సందర్శించి ఆయా నిమజ్జనాల ప్రాంతాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట వరంగల్ కలెక్టర్ సత్య శారద,కూడా చైర్ పర్సన్ గుండు సుధారాణి డీసీపీ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ చివరి నాటికి ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించేలా చర్యలు

● గత సీజన్‌లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా ముందస్తు ప్రణాళిక
● కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలకు శిక్షణతో పాటు ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలి
● జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం



వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 24 (సింగిడి): వనపర్తి జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోళ్లను అక్టోబర్ నెలాఖరులోగా ప్రారంభించేలా అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో వరి ధాన్యం కొనుగోళ్లపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి జిల్లాలో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ఇన్‌చార్జిలకు రానున్న 10 నుంచి 15 రోజుల్లోగా మండలాల వారీగా పక్కాగా శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేయాలని ఆదేశించారు. గత సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా ఎదురైన సమస్యలు ఈసారి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గతంలో అవకతవకలకు పాల్పడిన కొనుగోలు కేంద్రాలవారికి ఈసారి కొనుగోళ్ల బాధ్యతలు అప్పగించకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలను ముందుగానే సమకూర్చాలని కలెక్టర్ ఆదేశించారు. తేమ కొలిచే యంత్రాలు, బరువు కొలిచే యంత్రాలు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు తదితర సామగ్రి అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వినియోగించే తేమ యంత్రాలు, బరువు కొలిచే యంత్రాలు, ఇతర కొలత పరికరాలను రానున్న 15 రోజుల్లోగా తనిఖీ చేసి ధ్రువీకరించాలని సంబంధిత అధికారులను కోరారు. ధాన్యం కొనుగోళ్లలో హమాలీల కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ధాన్యం నిల్వ సామర్థ్యంపై ముందస్తు చర్యలు

జిల్లాలో కొనుగోలు చేసే ధాన్యాన్ని నిల్వ చేసేందుకు అవసరమైన స్థలాలను గుర్తించే ప్రక్రియను పౌరసరఫరాల శాఖ అధికారులు వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం 42 మిల్లులు ధాన్యం కేటాయింపునకు అర్హత కలిగి ఉన్నాయని, ఆయా మిల్లుల నుంచి బ్యాంకు గ్యారంటీలతో పాటు అగ్రిమెంట్లను తీసుకునే ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుతం గోడౌన్లలో 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ చేయడానికి అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని, అయినప్పటికీ గోడౌన్లలో ధాన్యం నిల్వ చేయడానికి అందుబాటులో ఉన్న స్థలం, వాటి పూర్తి సామర్థ్యంపై సమగ్ర నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం నిల్వకు ఇంకా అవసరమైన అదనపు స్థలాలను గుర్తించి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

లారీలకు తప్పనిసరిగా జీపీఎస్

ధాన్యం రవాణాకు సంబంధించి లారీ కాంట్రాక్టర్లు నిబంధనల ప్రకారం తప్పనిసరిగా అవసరమైన వాహనాలను సమకూర్చుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కాంట్రాక్టర్లు కనీసం 50 వాహనాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని, ఆయా వాహనాలకు అక్టోబర్ 10వ తేదీలోగా జీపీఎస్ పరికరాలను అమర్చాలని స్పష్టం చేశారు. ధాన్యం రవాణాలో ఎలాంటి జాప్యం లేకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు.

2.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా

ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో సుమారు 2.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు సుమారు 450 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని విధాలుగా సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ట్యాబ్ ఎంట్రీలు, రైతుల వివరాల నమోదు, ధాన్యం తూకం, కొనుగోలు ప్రక్రియ తదితర అంశాల్లో ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేసేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. రైతులు తమ ధాన్యాన్ని విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. డిఆర్ డి ఓ రామ మహేశ్వర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు, జిల్లా పౌరసరఫరాల అధికారి ఆంజనేయులు, పౌరసరఫరాల డిఎం హరీష్, డిటిఓ సురేష్, కార్మిక శాఖ అధికారి రవి, మార్కెటింగ్ ఆఫీసర్ పుష్పవతి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో ఘనంగా గణేష్ నిమజ్జన శోభాయాత్ర



చింతపల్లి, సెప్టెంబర్ 24 (సింగిడి): మండల కేంద్రంలో మాల మహానాడు ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన శ్రీ గణేష్ విగ్రహ నిమజ్జన శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రారంభమైన శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ఘనంగా వీడ్కోలు పలికారు. శోభాయాత్ర సందర్భంగా మహిళలు భక్తి శ్రద్ధలతో కోలాటాలు ఆడుతూ, భజనలు చేస్తూ సందడి చేశారు. గణపతి నామస్మరణలు, భక్తిగీతాలతో పరిసర ప్రాంతం మార్మోగింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని, నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నల్లవెల్లి సదానందం, నల్లవెల్లి సైదులు, బండి లక్ష్మికాంత్, బండి సైదులు,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ప్రణీత



చింతపల్లి, సెప్టెంబర్ 24 (సింగిడి): ఉపాధ్యాయ దినోత్సవం, 2026. 27 వేడుకల సందర్భంగా మండలంలోని ఎంపీపీఎస్ కురంపల్లి పాఠశాల ఉపాధ్యాయురాలు వై. ప్రణీత, ఎస్‌జీటీ కి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. విద్యా రంగంలో ఆమె అందిస్తున్న విశేష సేవలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు అనుసరిస్తున్న వినూత్న బోధనా పద్ధతులను గుర్తించిన జిల్లా యంత్రాంగం ఈ అవార్డును ప్రదానం చేసింది. వై. ప్రణీత మండలంలోనే సుమారు 14 సంవత్సరాలుగా ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తున్నారు. తొలుత ఎంపీపీఎస్ హరిజనపురం పాఠశాలలో పనిచేసిన ఆమె ప్రస్తుతం ఎంపీపీఎస్ కురంపల్లి పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధించడంతో పాటు, వారి సృజనాత్మకతను వెలికితీసే విధంగా అనేక వినూత్న పద్ధతులను అవలంబిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. అదేవిధంగా మండల స్థాయిలో గణితం రిసోర్స్ పర్సన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ తోటి ఉపాధ్యాయులకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తున్నారు. గణిత బోధనలో సులభమైన పద్ధతులు, ఆచరణాత్మక విధానాలను పరిచయం చేస్తూ ఉపాధ్యాయుల ప్రశంసలు పొందారు. విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు పాఠశాల ప్రగతికి ఆమె చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. కురంపల్లి పాఠశాలలో విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, పాఠ్యాంశాలను ఆసక్తికరంగా బోధిస్తూ విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించారు. దీంతో పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, కురంపల్లి గ్రామ ప్రజల నుంచి కూడా ఆమెకు ఆదరాభిమానాలు లభించాయి. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్, ఎస్పీ, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు ఇతర ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా వై. ప్రణీత ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విద్యా రంగానికి అందిస్తున్న సేవలను పలువురు అభినందించారు. వై. ప్రణీతకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించడంపై మండల విద్యాధికారి నీరుడు అంజయ్య, మండల పీఆర్‌టీయూ అధ్యక్షులు పాల్వాయి వాసుదేవరెడ్డి, ప్రధాన కార్యదర్శి బెక్కెం యాదయ్యతో పాటు సంఘ సీనియర్ నాయకురాలు కాకర్ల రమాదేవి, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చైతన్య, రాధ, ఆశా రాణి, సుజాత, తదితరులు అభినందించారు.

తమ్ముడు.... వినయ్..! ఉద్యమ గుర్తులను, మళ్ళీ గుర్తు చేశావు

● నర్వస్ కావద్దు, ప్రజా ఉద్యమమే ఊపిరిగా పని చేయాలి
● బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుంది
● మాజీ ప్రభుత్వ చీఫ్ వినయ్ భాస్కర్‌ను ఫోన్లో పరామర్శించిన మాజీ సీఎం కేసీఆర్



హనుమకొండ, సెప్టెంబర్ 24 (సింగిడి): హలో... తమ్ముడు వినయ్ భాస్కర్, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తులను మళ్ళీ గుర్తు చేశావు, అధైర్య పడవద్దు ప్రజా ఉద్యమంలో ఊపిరిగా పనిచేయాలి, బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఉద్యమనేత బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మాజీ ప్రభుత్వ చీఫ్ వినయ్ భాస్కర్ ను ఫోన్లో పరామర్శించారు. ఆసుపత్రి ఆరోగ్యశ్రీ వార్డులో స్లాబ్ బిచ్చలు ఊడి ఒక పేషెంట్ కు గాయాలైన విషయం మరవక ముందే మంగళవారం మరోసారి ఎంజీఎం లోని ఫిజియోథెరపీ విభాగంలో మరోసారి బిచ్చలూరి పోయాయి. వరుస ఘటనలపై స్పందించిన వినయ్ భాస్కర్ మంగళవారం ఎంజిఎంను సందర్శించారు. వినయ్ భాస్కర్ ఎంజీఎం రాకను ముందే గమనించిన పోలీసులు ఎంజీఎం పరిసరాలను బందోబస్తు నిర్వహించారు. వినయ్ భాస్కర్ ఎంజీఎం ప్రవేశానికి పోలీసులు నిరాకరించడంతో పోలీసులకు బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో పోలీసులు వినయభాస్కర్ పై చేయి చేసుకోవడంతో పాటు తీసివేయడంతో ఉద్రిక్త వాతావరణానికి దారితీసింది. వినయ్ భాస్కర్ ను పోలీసులు కడుపులో కొట్టడంతో విచక్షణ రహితంగా తోయడం మూలంగా స్వల్ప గాయాలయ్యాయి. ఈ క్రమంలో చికిత్స నిమిత్తం ములుగు రోడ్ లోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్పందించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వినయ్ భాస్కర్ కు ఫోన్ చేసి జరిగిన విషయంపై ఆరా తీసి పరామర్శించారు. ఆరోగ్య విషయంపై వాకప్ చేశారు. కే సీ ఆర్ తో పాటు బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు లు కూడా ఫోన్ల ద్వారా పరామర్శించారు.

అతివ Athiva

సింగిడి



వేసవిలోనూ మీ జుట్టు

పట్టుకుచ్చులా మెరవాలంటే..

ఈ టిప్స్ ఫాలో అవ్వండి

ఏసీలో ఎక్కువసేపు కూర్చోవడం వల్ల హైబీపీ వస్తుందా?

అధిక వేడి, శరీర రక్తనాళాలపై ప్రభావం తీవ్రమైన వేడి మన గుండె రక్తనాళాలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. బయట ఉష్ణోగ్రత పెరిగినప్పుడు, శరీరం తనను తాను చల్లబరచుకోవడానికి రక్తనాళాలను విస్తరింపజేస్తుంది ఎక్కువ చెమటను ఉత్పత్తి చేస్తుంది.

దీనివల్ల శరీరంలో నీటి శాతం తగ్గి (ణవష్ట్రఎఎతీఓఅశీఅ), రక్తం చిక్కబడటం లేదా రక్తపోటు పెరగడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి సమయంలో ఏసీ గది ఉష్ణోగ్రతను సౌకర్యవంతంగా ఉంచి, గుండెపై భారాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా వృద్ధులకు గుండె రోగులకు ఏసీ కొంత మేర ప్రయోజనకరంగా ఉంటుంది.

ఉష్ణోగ్రతలో ఆకస్మిక మార్పులు తెచ్చే ముప్పు
ఏసీ గాలి వల్ల కలిగే అసలు సమస్య ఉష్ణోగ్రతలో ఆకస్మిక మార్పులు. మీరు బయట మండుటెండ నుండి నేరుగా వచ్చి చాలా తక్కువ ఉష్ణోగ్రత (ఉదాహరణకు 16 లేదా 18 డిగ్రీలు) ఉన్న ఏసీ గదిలోకి వెళ్లినప్పుడు, మీ శరీరం ఆ మార్పును తట్టుకోలేదు. ఆకస్మిక చలి కారణంగా రక్తనాళాలు సంకోచించి రక్తప్రవాహానికి అడ్డంకి ఏర్పడుతుంది. దీనివల్ల రక్తపోటు తాత్కాలికంగా ఒక్కసారిగా పెరిగే ప్రమాదం ఉంది. సీలింగ్ ఫ్యాన్లు ఏసీ సెట్టింగ్‌లు చాలా తక్కువగా ఉండటం వల్ల కూడా ఈ సమస్య తలెత్తుతుంది.

అధిక రక్తపోటు ఉన్నవారు సాధారణ వ్యక్తులు కూడా ఏసీని వాడుతున్నప్పుడు ఈ క్రింది జాగ్రత్తలు తీసుకోవాలి:
ఏసీని ఎప్పుడూ 24 నుండి 26 డిగ్రీల సెల్సియస్ మధ్యమాత్రమే ఉంచాలని నిపుణులు సూచిస్తున్నారు. దీనికంటే తక్కువకు సెట్ చేయడం వల్ల శరీరానికి హాని కలగవచ్చు.
బయటి నుండి వచ్చిన వెంటనే ఏసీ ఆన్ చేయకుండా, శరీరం సాధారణ ఉష్ణోగ్రతకు వచ్చే వరకు వేచి ఉండాలి.
ఏసీ గాలి తేమను పీల్చేస్తుంది కాబట్టి, ఏసీలో ఉన్నప్పుడు కూడా తగినంత నీరు త్రాగుతూ ఉండాలి.
ఏసీ అనేది వేసవిలో ఒక వరమే అయినప్పటికీ, దానిని సరైన పద్ధతిలో వాడటం ముఖ్యం. 24-26 డిగ్రీల వద్ద ఏసీని నిర్వహించడం ద్వారా మీ గుండె ఆరోగ్యాన్ని రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చు.

చర్మంలాగే, వేసవిలో జుట్టును కూడా జాగ్రత్తగా చూసుకోవాలి. జుట్టును జాగ్రత్తగా చూసుకోకపోతే జుట్టు రాలుతుంది. వేడి కారణంగా తల చర్మం, జిగటగా మారుతుంది.

తల చర్మం సున్నితమైనది. అందువల్ల తల చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవడం అవసరం. వేసవిలో చమట కారణంగా చర్మం వెంటనే జిగటగా మారుతుంది.

వేసవిలో జుట్టును జాగ్రత్తగా చూసుకోవాలంటే ప్రతి రెండు మూడు రోజులకు ఒకసారి తలస్నానం చేయడం చాలా అవసరం. దీనివల్ల జుట్టు జిగురుగా ఉండకుండా నిరోధించవచ్చు.

చర్మవ్యాధి నిపుణుల అభిప్రాయం ప్రకారం వేసవి రోజులలో తల చర్మంపై దురద, చుండ్రు వంటి సమస్యలు కూడా తలెత్తుతాయి. సూర్యరశ్మి కూడా తల చర్మం దురద కలిగిండచానికి కారణం అవుతుంది.

తల చర్మం విపరీతంగా దురద పెడుతుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి. వేసవిలో టోపీ లేదా స్కార్ఫ్ ధరించకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లడం మానుకోవాలి.

లాభాల్లో సూచీలు..
సెన్సెక్స్ 600 పాయింట్లు పైకి



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ, ఆటో, రియల్టీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ఓ దశలో వెయ్యికి పైగా పాయింట్లు లాభపడిన సెన్సెక్స్.. తర్వాత లాభాల స్వీకరణతో మోస్తరు లాభాలకు పరిమితమైంది.

సెన్సెక్స్ ఉదయం 77,245.83 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,886.91) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 77,982.51 పాయింట్ల వద్ద గరిష్ఠాలను తాకిన సూచీ.. చివరికి 609.45 పాయింట్ల లాభంతో 77,496.36 వద్ద ముగిసింది. నిఫ్టీ 181.95 పాయింట్ల లాభంతో 24,177.65 వద్ద స్థిరపడింది.

డాలరుతో రూపాయి మారకం విలువ 94.86గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఐటీసీ, టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ, రిలయన్స్, భారతీ ఎయిర్‌టెల్ స్టాక్స్ ప్రధానంగా లాభపడ్డాయి. ఇండిగో, ఎన్టీపీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్, ఏషియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 114 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4569 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



స్మార్ట్ రెస్పాన్స్ కోసం యూట్యూబ్‌లో ఏఐ ఫీచర్

వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ స్మార్ట్ రెస్పాన్స్ కోసం కొత్త ఫీచర్‌ను తీసుకొస్తోంది. తన సెర్చ్‌బార్‌లో 'ఆస్క్ యూట్యూబ్' ఏఐ ఫీచర్‌ను తీసుకురాబోతోంది. ప్రస్తుతం ఈ ఫీచర్ అమెరికాలో 18 ఏళ్లు పైబడిన కొంతమంది యూట్యూబ్ ప్రీమియం సబ్‌స్క్రైబర్లకు మాత్రమే అందుబాటులోకి ఉంది.

ఒకసారి ఈ ఫీచర్ అందరికీ అందుబాటులోకి వచ్చాక యూట్యూబ్‌లో సెర్చ్ పూర్తిగా ఏఐ రూపం దాల్చనుంది. ఏదైనా విషయంపై ప్రశ్నలు అడిగినప్పుడు అందుకు సంబంధించి వీడియోలతో పాటు ఏఐ రూపొందించిన టెక్స్ట్ సారాంశాన్ని కూడా ఈ ఏఐ చాట్‌బాట్ అందిస్తుంది. అవసరమైన సలహాలను ఇస్తుంది.
యూట్యూబ్ సెర్చ్‌బార్‌లో మీకు కావాల్సిన అంశాన్ని టైప్ చేస్తే ప్రస్తుతం వీడియోల లిస్ట్ మాత్రమే వస్తుంది. ఇకపై కొత్తగా అక్కడ 'ఆస్క్ యూట్యూబ్' అనే ఆప్షన్ కనిపిస్తుంది. దానిమీద ట్యాప్ చేస్తే.. యూజర్లు ప్రశ్నలను అడగడానికి ఓ టెక్స్ట్ బాక్స్‌తో కూడిన ఫుల్‌పేజీ ఇస్తుంది. అడిగిన ప్రశ్నలకు సంబంధించిన వీడియోలను చూపించడంతో పాటు ఏఐ ఆధారిత టెక్స్ట్ సారాంశాలను లాంగ్ వీడియో, షార్ట్స్ రూపంలో అందిస్తుంది. ఇందుకు సంబంధించిన వీడియోను యూట్యూబ్ తన బ్లాగ్‌లో పోస్టు చేసింది. ఉదాహరణకు లాంగ్ ట్రిప్స్, కాఫీ షాప్స్ వంటి వాటిపై సమాచారం కోరితే.. అందుకు సంబంధించిన వీడియోలతో పాటు మార్గమధ్యంలో చూడాల్సిన ప్రత్యేకమైన ప్రదేశాలపై సలహాలు ఇస్తుంది.

స్టాక్ మార్కెట్ Stock Market



తులం బంగారం అమ్మితే ఎంత లాభమో తెలుసా..?

బంగారం ధరలు అనేవి ఎప్పుడూ మారుతూ ఉంటాయి. ఎల్లప్పుడూ హెచ్చుతగ్గులు నమోదవుతూ ఉంటాయి. రోజూ ఒకేలా బంగారం ధరలు అనేవి అసలు ఉండవు. అంతర్జాతీయ పరిణామాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే ట్యాక్సులను బట్టి రేట్లలో మార్పులు ఉంటాయి.

గత ఏడాదిగా పసిడి ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ ఏడాదిలో ఏకంగా తులం బంగారం రూ. 1.90 లక్షలకు చేరుకుని ఆల్ టైం రికార్డ్ నమోదు చేయగా.. ప్రస్తుతం రూ. 1.50 లక్షల వద్ద కొనసాగుతున్నాయి. దీంతో కొనుగోలుదారులు కాస్త ఊరట చెందుతున్నారు. అయితే బంగారం విక్రయించే షాపుల యజమానులకు ఎంత లాభం వస్తుందనే డౌట్ చాలామందికి ఉంటుంది. దీనికి సమాధానాలు ఇప్పుడు చూద్దాం.

మేకింగ్ ఛార్జీల వల్ల..
మేకింగ్ ఛార్జీల వల్ల బంగారం షాపులకు ఆదాయం అనేది వస్తుంది. మీరు కొనే ఆభరణం డిజైన్‌ను బట్టి మేకింగ్ ఛార్జీలు అనేవి ఉంటాయి. మీ డిజైన్ క్లిష్టంగా ఉంటే మేకింగ్ ఛార్జీలు ఎక్కువగా ఉంటాయి. గ్రాముకు రూ. 300 నుంచి రూ. వెయ్యి వరకు ఉంటుంది. ఈ సొమ్ము నేరుగా షాపు యజమానికి వెళుతుంది. ఇక ఆభరణాల తయారీలో తరుగు కొంతమొత్తం పోతుంది. దాదాపు 10 శాతం నుంచి 18 శాతం వరకు ఇది ఉండే అవకాశముంది. ఆభరణం తయారు చేసేటప్పుడు ఇది కొంత వృథా అవుతుంది. ఉదాహరణకు మీరు 10 గ్రాముల గోల్డ్ కొంటే 1.5 గ్రాముల బంగారానికి అదనంగా డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. ఇది కూడా షాపులకు డబ్బు తెచ్చిపెడుతుంది. ఇక రాళ్లతో కూడిన ఆభరణాలు కొనుగోలు చేసినప్పుడు బంగారంతో పాటు వాటి ధరలను లెక్కిస్తారు. అదే మీరు విక్రయించేటప్పుడు రాళ్లను తీసివేసి లెక్కిస్తారు. దీని వల్ల దుకాణాదారుడికి లాభం వస్తుంది. దీంతో కస్టమర్లు రాళ్లు లేని బంగారాన్ని కొనుగోలు చేస్తే మంచింది. అలాగే మేకింగ్ ఛార్జీలను తగ్గించేలా మాట్లాడుకోవాలి. దీని వల్ల కస్టమర్‌కు లాభం అనేది జరుగుతుంది.

తులంపై ఎంత లాభం ఉంటుంది..?
ఇక తులం బంగారంపై షాపు యజమానికి రూ. 3 వేల నుంచి రూ. 7 వేల వరకు లాభం అనేది వస్తుందని చెబుతున్నారు. ఇక పెద్ద షాపుల్లో మేకింగ్ ఛార్జీల పేరుతో ఎక్కువ వసూలు చేస్తారు. దీని వల్ల లాభం అనేది ఎక్కువగా ఉంటుంది. ఇక ధర తక్కువగా ఉన్నప్పుడు కొనుగోలు చేసి ధర పెరిగాక అమ్మినప్పుడు కూడా అదనపు ఆదాయం వస్తుంది. ఇలా బంగారం దుకాణాదారులకు ఆదాయం అనేది వస్తుందని చెప్పవచ్చు. ధరలు పెరిగిన క్రమంలో చాలామంది బంగారం కొనుగోళ్లు తగ్గిపోయాయి.

ప్రభాతనవ సింగిడి SINGIDI తెలుగు దినపత్రిక ప్రతి రంగూ ఓ నిజం

సింగిడి

నీటిని పొదుపుగా వినియోగిస్తేనే భవిష్యత్తు తరాల మనుగడ

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

ఇండియా ఇంటర్నేషనల్ వాటర్ వీక్ లో ఉత్తమ నీటి నిర్వహణపై కలెక్టర్ ప్రజెంటేషన్.





గద్వాల బ్యూరో(సింగిడి): ఎల్ నినో వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని ఫలితంగా భవి ష్యత్తు తరాల మనుగడ సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈనెల 20-26వతేదీవరకు నిర్వహిస్తున్న తొమ్మిదవ ఇండియా ఇంటర్నేషనల్ వాటర్ వీక్ లో జిల్లా కలెక్టర్ కు ప్రత్యేక ఆహ్వానం అందడంతో గురువారం పాల్గొని జోగులాంబ గద్వాల జిల్లా నీటి నిర్వహణ ఉత్తమ పద్ధతుల ప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. ప్రజెంటేషన్‌లో రిజర్వాయర్ల నిల్వ సామ ర్థ్యాన్ని పెంచుకోవడం, విబిజి రాంజీ పథకం ద్వారా నీటి సంరక్షణ పనులు, ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, హార్టికల్చర్, మైక్రో ఇరిగేషన్, మత్స్య సంపద అభివృద్ధి వంటి చర్యలను ముఖ్యంగా వివరించారు. విబిజి రాంజీ పథకంలో ఎక్కువగా జల సంరక్షణ పనులను గుర్తించి చేపడితే కరువు కాటకాలను అధిగమించేం దుకు అవకాశం ఉంటుందన్నారు.నీటి సంరక్షణ, వ్యవసాయ వైవిధ్యీకరణ, భూగర్భ జలాల రీచార్జ్, ప్రజల భాగస్వామ్యంతో జోగులాంబ గద్వాల జిల్లాలో అమలు చేస్తున్న సమగ్ర నీటి నిర్వహణ విధానాలను క్షుణ్ణంగా తెలియజేశారు.

గ్రామాల్లో ప్రతి ఇంటికి ఇంకుడు గుంతల నిర్మాణం తోపాటు రైతుల పొలాల్లో పంట కుంటల నిర్మాణం, కమ్యూనిటీ సోప్ కిట్స్, ఊట కుంటల నిర్మాణ ఆవశ్య కతను గురించి తెలిపా రు. బిందు సేద్యంతో ఆరుతడి పంటల సాగును వివరించి ఫలితంగా కలుపు మొక్కలు పెరగకుండా తక్కువ నీటితోనే పంటలను పండించుకునే మైక్రో ఇరిగేషన్ విధానాలను విస్తృతపరచాల్సిన ఆవశ్యకత ను వ్యక్తప రిచారు. సామాజిక అడవుల పెంపకంతో పాటు చెక్ డాముల నిర్వహణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంద న్నారు. పచ్చదనం పెరిగితేనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని తెలియజేస్తూ వాతావరణం లో కాలు ష్యాన్ని తగ్గించడమే కాక ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. జల సంరక్షణకు కేవలం ప్రభుత్వాలే కాకుండా స్వచ్ఛంద సేవా సంస్థలు, పర్యావరణవేత్తలు, ప్రజల భాగస్వామ్యం కూడా పెద్ద ఎత్తున అవసరమంటుం దని పేర్కొన్నారు. జాతీయస్థాయి వేదికపై పాల్గొనీ నీటి వనరుల పెం పుపై ప్రసంగించే అవకాశం కల్పించిన నిర్వాహకు లకు ఈ సందర్భంగా కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

ప్రీ ప్రైమరీ విద్యతోనే పటిష్టమైన విద్యాభ్యాసానికి పునాది

కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్





కల్వకుర్తి(సింగిడి): వంగూరు మం డల చిన్నారుల విద్యాభ్యాసంలో ప్రీ ప్రైమరీ దశ ఎంతో కీలకమని, ప్రాథమిక విద్యను బలోపేతం చేసే దిశగా ప్రీ ప్రైమరీ తరగతులను సమర్థవంతంగా నిర్వహిం చాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఉపాధ్యా యులకు సూచించారు.వంగూరు మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రీ ప్రైమరీ తరగతులను అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి జిల్లా కలెక్టర్ పరి శీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులకు అందిస్తున్న బోధనా విధానం, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపా యాలపై ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసు కున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రీ ప్రైమరీ దశలోనే చిన్నారుల్లో చదువు పట్ల ఆసక్తి, భాషా పరిజ్ఞానం, సంఖ్యా జ్ఞానం, ఆలోచనా శక్తి, సృజనాత్మకత, సామా జిక నైపుణ్యాలు పెంపొందేలా బోధనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆటలు, కథలు, పాటలు, చిత్రాలు, వివిధ విద్యా కార్యకలాపాల ద్వారా చిన్నారులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన అందించాలని తెలిపారు.ప్రతి విద్యార్థి విద్యా సామ ర్థ్యాన్ని నిరంతరం పరిశీలిస్తూ, చదువులో వెనుకబడు తున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యా యులకు సూచించారు. చిన్నారులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా తల్లిదండ్రులతో సమన్వయం చేసుకోవాలని, వారికి ఆహ్లాదకరమైన, సురక్షితమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని అన్నారు.ప్రీ ప్రైమరీ తరగతులకు హాజరవుతున్న చిన్నారులకు అవసరమైన ఫర్నిచర్, తాగునీరు, పరిశు భ్రమైన తరగతి గదులు, మరుగుదొడ్లు, ఆటలు అభ్యసనానికి అవసరమైన విద్యా సామగ్రి అందుబా టులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చిన్నారుల వయస్సు, అభ్యసన స్థాయికి అనుగుణంగా తరగతి గదులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు.ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల సామర్థ్యాలను బలోపేతం చేయడం ద్వారా తదుపరి తరగతుల్లో వారు మెరుగైన విద్యా ప్రగతి సాధించేలా పటిష్టమైన పునాది వేయాలని కలెక్టర్ తెలి పారు. ఇందుకోసం ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధి కారులు సమన్వయంతో ప్రత్యేక శ్రద్ధతో పనిచేయా లని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, ఈడబ్ల్యూడీసీ ఈఈ రామ చందర్, ఇంజనీరింగ్ అధికారులు, వంగూరు తహసీ ల్దార్ మురళీమోహన్, ఎంపీడీవో శారద, మండల విద్యాధికారి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

26న గద్వాలలో జాబ్ మేళా

గద్వాల బ్యూరో (సింగిడి): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉదయం 11;00 నుండి మధ్యాహ్నం 2;00 వరకు ఐ.డి.ఒ.సి. ఖీ-30/1, కలెక్టరేట్ నందు జాబ్ మేళా నిర్వ హించబడును. 18-35 సంవత్సరాల వయస్సు కలిగిన SSC, ఇంటర్, డిగ్రీ, B.Pharmacy, M.Pharmacy, PCI అర్హతలు ఉన్న అభ్యర్థులు పాల్గొనవచ్చు. ఎంపికైన వారికి శిక్షణ అనంతరం గద్వాల, ఐజ, మహబూ బ్‌నగర్, హైదరాబాద్, బెంగళూరులోని అపోలో ఫార్మసీ, పుష్పల్ ఆగ్రోటెక్ లిమిటెడ్, మెడ్‌ప్లస్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ యల్.ఎన్. గ్రూప్ ద్వారా ఫోక్స్‌న్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.అర్హులైన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన నిరుపేద విద్యార్థికి

ఉప్పల వెంకటేష్ చేయూత



కల్వకుర్తి (సింగిడి):వెల్దండ మండలానికి చెందిన గుద్దేటి సరిత ఎంబీబీఎస్ కోర్సులో సీటు సాధించి, చదువుకు సంబంధించిన ఖర్చు లను భరించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ స్పందించారు. విద్యార్థినికి అండగా నిలిచి, ఆమె వైద్య విద్యను కొనసాగించేందుకు ఆర్థిక సహాయం అందించారు. ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం అభినందనీయమని, ఆర్థిక ఇబ్బందులు విద్యార్థుల ఉన్నత విద్యకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో సరితకు తన వంతు సహాయం అందించినట్లు ఉప్పల వెంకటేష్ తెలిపారు. కష్టపడి చదివి వైద్య రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగి, భవిష్యత్తులో పేదలకు సేవ చేయాలని విద్యార్థినిని ప్రోత్సహించారు.ఈ సందర్భంగా విద్యార్థిని తండ్రి గుద్దేటి శేఖర్ ఉప్పల వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని విద్యార్థిని చదువుకు సహాయం అందించడం ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పూరి రమేష్, కానుగుల జోగయ్య, చలిచీమల నిరంజన్, జంగిలి ఆనంద్, శివ, తెలగమల్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.

బండారి గ్రూప్ విజయలక్ష్మీ ఆసుపత్రిలో అన్నదానం



నిజామాబాద్ (సింగిడి): నగరంలోని ఖలీల్ వాడిలోని బండారి గ్రూప్ విజయలక్ష్మీ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గురువారం గణేష్ నవరాత్రుల్లో భాగంగా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన గణనాథుడిని ఆసుపత్రి వైద్యులు డా.బండారి సుజాత, ఫోరెన్సిక్ మెడిసిన్ డా.బి.వి.నాగమోహన్ రావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ బండారి భోజన్న, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలు-2026 పోస్టర్ ఆవిష్కరణ



గద్వాల బ్యూరో, సెప్టెంబర్ 24(నినాదం): అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలు-2026ను పురస్కరించుకొని గురువారం ఐడీఓసీలోని మీటింగ్ హాల్‌లో మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాల పోస్టర్‌ను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగరావు ఆవిష్కరించారు. ఈ నెల 24 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు నిర్వహించే వారోత్సవాల్లో వయోవృద్ధుల ఆరోగ్యం, భద్రత, గౌరవం, హక్కులు, సంక్షేమం మరియు సాధికారతపై ప్రజల్లో అవగాహన కల్పించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా వయోవృద్ధులకు ఆరోగ్య శిబిరాలు, సైబర్ భద్రత, డిజిటల్ అక్షరాస్యత, నిర్లక్ష్య నివారణపై అవగాహన కార్యక్రమాలతో పాటు యోగా, ప్రాణాయామం, వాక్‌థాన్ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వయోవృద్ధులకు అనుకూలమైన వాతావరణాన్ని ప్రోత్సహించడం వారోత్సవాల ప్రధాన ఉద్దేశ్యమన్నారు. అలాగే, సెప్టెంబర్ 25న జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వయోవృద్ధులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సునంద, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, సర్పంచులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణింపు: అదనపు కలెక్టర్ నర్సింగరావు

స్టూడెంట్స్ హెల్త్ ప్రొఫైల్ కార్డుల పంపిణీ ప్రారంభం





గద్వాల బ్యూరో (సింగిడి):
విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణిస్తారని జోగులాంబ గద్వాల జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వ పాఠశా లల విద్యార్థులకు ప్రత్యేకంగా హెల్త్ కార్డులు అంద జేస్తుందని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాల మేరకు ఆరోగ్య పాఠశాల పేరుతో ముద్రించిన స్టూడెంట్ హెల్త్ ప్రొఫైల్ కార్డుల పంపిణీ గురువారం గద్వాలలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో నిర్వహించగా అదనపు కలెక్టర్ నర్సింగరావు ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పలువురు విద్యార్థులకు కార్డులను పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు వివిధ పరీక్షల నిర్వహించి కార్డులో వివరాలను నమోదు చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అనుసరించి అవసరమైన చికిత్స పొందేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. విద్యార్థులు ఆకు కూరలు, పండ్లు, మాంసకృత్తులు, తదితర పౌష్టికా హారం సమపాలల్లో తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతోపాటు రాగి జావ కూడా ఇస్తుండడంతో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం త్వరలోనే బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రెసిడెన్షియల్, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు కార్డులను పంపిణీ చేయనున్నట్లు ఈ సం దర్భంగా అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయి, కౌన్సిలర్ వేదవతి, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సవారన్న, ఇతర వైద్యాధి కారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తి ముందు బరువెంత...!





నారాయణపేట ప్రతినిధి,(సింగిడి):ఊట్కూర్ మండల పరిధిలో గల బిజ్జారం గ్రామంలో న్యూ శాంతినికేతన్ పాఠశాలలో ప్రతిష్ఠించిన వినాయ కుడికి ప్రత్యేక పూజలు గావించి అనంతరం అన్న ప్రసా దాలను స్వీకరించిన విద్యార్థులు శిరస్సుపై బుజ్జి గణప య్యను మోస్తూ నిమజ్జోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. యువజన సంఘాల వారికి కనువిప్పుగా ఈ శోభాయాత్ర నిర్వహించారు. భక్తిముందు బరువెంతా అని తమ భక్తిని చాటిన చిన్నారులు. భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జన ఊరేగింపు గ్రామీణ ప్రాంతంలో ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవం పచ్చని పొలాల మధ్య ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జన మహోత్స వం ఎంతో ఉత్సాహంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు అనడానికి ఈ చిత్రమే ఓ ఉదాహరణ. స్థానిక విద్యా ర్థులు, ఉపాధ్యాయులు కలిసి గణపతి విగ్రహాన్ని ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్లారు.
ఊరేగింపులో భాగంగా స్కూలు నుండి చెరువు వరకు ఒక్కొక్కరుగా శిరస్సు పై బుజ్జి గణపయ్యను మోస్తూ మిగతా పిల్లలు మంగళ వాయిద్యాలు, డప్పు వాయిస్తూ ముందుకు సాగారు. పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యా యులు పెద్దలు ఈ శోభాయాత్రలో పాల్గొని "గణపతి బప్పా మోరియా" అగ్లే భరస్సే తూ జల్దీ ఆ...అంటూ నినాదాలు చేశారు. నుదుటన సిందూరం ధరించి, సాంప్రదాయ వస్త్రధారణతో పిల్లలందరూ ఎంతో ఉత్సా హంగా ఈ నిమజ్జనోత్సవంలో పాలుపంచుకున్నారు. ఈ స్కూలు విద్యార్థుల వినాయక ఉత్సవాన్ని చూసిన గ్రామ ప్రజలు రాబోయే తరానికి ఆదర్శం మీరని, సౌండ్ పొల్యూషన్ గాని ఇతర కాలుష్యకారకాలను వాడకుండా ఆదర్శంగా నిలుస్తున్నారని వీరిని చూసి ప్రస్తుతం వినాయకులను ప్రతిష్ఠించిన యువజన సంఘాలకు పలువురికి కనువిప్పు కలిగిస్తున్న సందర్భం ఇదని ప్రతి పౌరుడు తెలుసుకోవాలని హితవు పలికారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయ్యేదాకా పోరాడతాం

డిండి లిఫ్టును రద్దు చేయాలి

పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు పాదయాత్ర

మన వాటా మనం సాధించుకుందాం: జేఏసీ



గద్వాల ప్రతినిధి (సింగిడి):
ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన సమితి అలంపూరు తాలూకా జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 27న పాదయాత్ర నిర్వహించనున్నట్లు చైర్మన్ వై. రామ్మోహన్ తెలిపారు.కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో దుందుభి నది ఒడ్డున ఉన్న ఉల్పార నుంచి కల్వకుర్తి వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.పీఆర్ఎల్ఐ నీటిని నల్గొండకు తరలించే దిండి లిఫ్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. చంద్రసాగర్, అమ్రాబాద్, జూరాల, గట్టు, శేర్పల్లి వద్ద లిఫ్ట్ పథకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.జీవో 72 ప్రకారం తంగడి లిఫ్ట్ పథకాలను అమలు చేయాలని కోరారు.చిన్నోనిపల్లి రిజర్వాయర్ నుంచి ఆర్డీఎస్ కాలువకు సాగునీరు అందించాలని అన్నారు.99, 100 ప్యాకేజీల పనులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు జూరాల నుంచి ఉండవల్లి, మనోపాడు, అలంపూరు మండలాలకు నీరు విడుదల చేయాలని కోరారు.
పాదయాత్రను విజయవంతం చేసేందుకు రైతులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొనాలని అల్లంపూర్ జేఏసీ వైస్ చైర్మన్ గోపాల్ రెడ్డి, రైతులు దుబ్బన్న నాగరాజు జగ్గుల శ్రీనివాసులు సర్దార్ బీచుపల్లి ప్రకాశం రామన్న మద్దిలేటి రాజు గిడ్డన్న రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు





గద్వాల ప్రతినిధి (సింగిడి): జోగులాంబ గద్వాల్ జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమంలో భాగంగా ఐజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థు లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరీక్షించారు. ఈ సంద ర్భంగా విద్యార్థులకు బ్లడ్ గ్రూప్, హిమోగ్లోబిన్ శాతం పరీక్షలు నిర్వహించారు. అలాగే కంటి సంబంధిత సమ స్యలు, దంత సమస్యలను గుర్తించి అవసరమైన వైద్య సూచనలు, చికిత్స అందించారు. బాలికలకు రుతుస్రావ సంబంధిత సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వైద్య సేవలు అందించారు. విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్య సిబ్బంది సూచించారు. పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటిక ప్పుడు పర్యవేక్షించేం దుకు ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో పీహెచ్సీ సిబ్బంది, ఆర్బీఎస్కే సిబ్బంది, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అయిజ కళాశాలలో 'ఆరోగ్య పాఠశాల'

పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులుగా యాద్గిర్ జనార్దన్ రెడ్డి





నారాయణపేట ప్రతినిధి, (సింగిడి):జిల్లా కేంద్రంలోని అంజనా గార్డెన్ లో జరిగిన పిఆర్టియు టిఎస్ జిల్లా సర్వసభ్య కౌన్సిల్ సమావేశంలో నారాయ ణపేట జిల్లా అధ్యక్షులుగా యాద్గిర్ జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పల్లె వెంకట్ రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా ఏం రఘువీర్, లను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. వీరితోపాటు జిల్లా కార్యవర్గంలో 20 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పి ఆర్టి యుటిఎస్ రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్, ఎన్నికల అధికారులుగా వికారాబాద్ జిల్లా అధ్యక్షు లు కడియాల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి దోమ అమర్నాథ్, లు పరిశీలకులుగా భీమప్ప, యాదయ్య హాజరు కావడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కౌన్సిల్ సభ్యులు గత రెండు సంవత్సరాల కాలంలో యాద్గిర్ జనార్దన్ రెడ్డి పల్లె వెంకట్ రెడ్డి సంఘ నిర్మాణం కోసం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేయడం వలన వారిని మరల 2026-28 సంవత్స రాలకు గాను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. నూతనంగా ఏర్పడిన జిల్లా కార్యవర్గం రాష్ట్ర ప్రభుత్వము దసరాకు కేవలం రెండు డిఏలు ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వము వెంటనే పి ఆర్ సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాబోవు రెండు సంవత్సరాల కాలంలో 317 జీవో పరిష్కారం మీద పోరాటం చేస్తామని తీర్మానం చేశారు. కాంట్రి బ్యూ టర్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయకపోతే పెద్ద మొత్తంలో ఉద్యమం కోసము తీవ్రతరం చేస్తామని అదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి నారా యణపేట జిల్లాకు విద్యా వాలంటీర్లను తీసుకురావడా నికి త్వరితగతిన కార్యాచరణ జరుగుతుందని పేర్కొ న్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించుటకు కృషి చేయాలని సంఘము ద్వారా సమస్యల పరిష్కారం కోసము పనిచేస్తామని పేర్కొనడం జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలను చేయడం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన జనార్దన్ రెడ్డి గత 24 సంవత్సరాలుగా సంఘంలో అంకితభావంతో పని చేస్తూ సంఘము కోసము ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటం చేస్తూ కృషి చేస్తున్నారని రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్ పేర్కొంటూ ఇలాంటి నాయకుడిని ఏకగ్రీవంగా ఎన్నుకో వడం శుభసూచకమని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కౌన్సిల్ సభ్యులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్ర మంలో మాజీ జిల్లా అధ్యక్షులు పి నరసింహా రెడ్డి, తాజా మాజీ జిల్లా గౌరవ అధ్యక్షులు తిరుపతి, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సత్యనారా యణ, రెడ్డి రమేష్, ఎం జనార్దన్, గోవర్ధన్, నరసింహా రెడ్డి, సూర్య ప్రకాష్, రాజు నాయక్, శ్రీకాంత్, రాజేంద్ర రెడ్డి, గోపాల్ రెడ్డి, బాబు, వెంకటేష్, హరీష్, శేఖర్, అనిల్‌కుమార్, వాణిశ్రీ, జరుద్దీన్ శ్రీనివాసరావు, శ్రీనివాసులు, నవీన్ కుమార్, ముస్తఫా, కిష్టయ్య, లక్ష్మణ్, వెంకటేష్, భీమేష్, ప్రకాష్ గౌడ్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల నిర్వాహకులను

అభినందించిన సన్మానించిన ఎస్సై



ఆర్మూర్,(సింగిడి): బాల్కొండ నియోజక వర్గం కమ్మర్‌పల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించి తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించి, బుధవారం రోజు రాత్రి వినాయ కుని నిమజ్జనం భక్తిశ్రద్ధలతో, భక్తి పాటలతో భజనలు చేస్తూ, మంగళ హారతులతో, మహిళల కోలాటాలు, భక్తుల హరినా మ స్మరణలతో వినాయకుని నిమజ్జనం ప్రశాంతంగా చేసిన మండప నిర్వాహకులను, యూత్ సభ్యులను కమ్మర్‌పల్లి మండల ఎస్సై, సి. హెచ్. సతీష్ శాలువలు కప్పి సన్మానించి అభినందించారు. డీజేలు ఏర్పాటు చేసుకోకుండా, భజనలు భక్తి పాటలకు, సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రాధాన్యత నిచ్చి ప్రశాంతంగా నిమజ్జనం గావించిన మండప నిర్వాహకులను, సహకరించిన యూత్ సభ్యులకు కమ్మర్‌పల్లి మండల ఎస్సై ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. మండపాల నిర్వాహకులు గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకొని పోలీసులకు సహకరించాలని కమ్మర్‌పల్లి మండల ఎస్సై-సతీష్ కోరారు.

సత్య గణపతికి ప్రత్యేక పూజలు జరిపిన

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు...



ఆర్మూర్,(సింగిడి): నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గం డొంకేశ్వర్ మండలంలో ప్రతిష్ఠించిన సత్య గణపతి వద్ద డొంకేశ్వర్, నందిపేట్ మండలాల కాంగ్రెస్ నాయకులతోపాటు, ప్రజా ప్రతినిధులతో పాటు, కార్యకర్తలతో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగేష్ రెడ్డి గురువారం రోజు విచ్చేసి పిఏసి ఎస్ చైర్మన్, పాలకవర్గ సభ్యుల తోపాటు సత్య గణపతి వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగేష్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రెండు మండలాల కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధుల, నాయకుల, కార్యకర్తల సమక్షంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రతిపక్షాలు చేస్తున్న వాటిపై జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎదురు దాడికి దిగి ఖండించారు. ఆర్మూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీ.ఎం. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజల పథకాలను అమలు చేసి అందిస్తుందని, ప్రతిపక్షాలు తమ ఉనికిని చాటుకునేందుకే ఆరోపణలు చేస్తున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేష్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నగేష్ రెడ్డిని పిఏసిఎస్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ చైర్మన్ తో పాటు, పాలకవర్గ సభ్యులు శాలువలు కప్పి ఘనంగా సన్మానించి వినాయక చవితి శు భాకాంక్షలు తెలియజేశారు.

గ్రామాల్లో వనరులపై మ్యాప్‌ల ద్వారా అవగాహన

ప్రభాతనవ సింగిడి SINGIDI తెలుగు దినపత్రిక ప్రతి రంగూ ఓ నిజం

సింగిడి

రుణ లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలి

అర్హులైన రైతులకు సకాలంలో రుణాలు పెండింగ్ ప్రతిపాదనలను త్వరగా పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



కరీంనగర్, (సింగిడి): జిల్లాలో నిర్దేశించిన రుణ లక్ష్యాలను వం దశాతం సాధించేలా బ్యాంకర్లు, సంబంధిత శాఖల అధికారులు సమన్వ యం తో పనిచేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్‌రెడ్డి సూచిం చారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, జిల్లా అధి కారు లతో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లా డారు. రైతులు, స్వయం సహాయక సంఘాలు, యువతతో పాటు అర్హులైన లబ్ధిదారుల కు ఆర్థిక సహాయం అందించడంలో బ్యాంకర్లు చొరవ చూపాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న రుణ ప్రతిపాదనలను త్వరగా పరిష్కరించి అర్హులకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. రైతులు రుణాలను సకాలంలో పునరుద్ధ రించుకునేలా వ్యవసాయ శాఖతో కలిసి ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించాలని సూచించారు.

గత ఏడాది రూ. 20,000 కోట్లకు పైగా రుణాలు..

2025-26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో మొత్తం రూ. 20,000.67 కోట్ల రుణాలు మంజూరయ్యాయని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇందులో వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ. 5,975.41 కోట్లు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రూ. 2,768.59 కోట్లు, విద్యా రుణాలకు రూ. 17.31 కోట్లు, గృహ రుణాలకు రూ. 197.15 కోట్లు, ఇతర రంగాలకు రూ. 5,242 కోట్ల మంజూరైనట్లు వివరించారు.

రూ. 14,846 కోట్లతో 2026--27 రుణ ప్రణాళిక..

2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ. 14,846 కోట్లతో రూపొందించిన వార్షిక రుణ ప్రణాళికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఇందులో వ్యవసాయ రంగానికి రూ. 5,755 కోట్లు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రూ. 3,583 కోట్లు, విద్యకు రూ. 53.25 కోట్లు, గృహ రుణాలకు రూ. 328.50 కోట్లు కేటాయించారు. ఇతర ప్రాధాన్యతా, మౌలిక సదుపాయాలు, పునరు త్పాదక ఇంధనం, ఎగుమతులు తదితర రంగాలకు కూడా రుణాలు అందిం చేలా ప్రణాళిక రూపొందించారు. రుణాలు పొందిన లబ్ధిదారులు, స్వయం సహాయక సంఘాలు సకాలంలో చెల్లింపులు చేసేలా అవగాహన కల్పించాలని, రుణాల వసూళ్లను మెరుగుపరిచేందుకు బ్యాంకర్లు, శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రధానమంత్రి స్వనిధి పథకం కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని బ్యాంకర్లను ఆదేశించారు. సమావేశంలో ఎల్‌డీఎం ఉమాశంకర్ నందన, ఆర్‌బీఐ అధికారి యశ్వంత్‌సాయి, నాబార్డ్ డీడీఎం జయప్రకాశ్, బ్యాంకు అధికారులు, జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో కలెక్టరేట్ ప్రారంభోత్సవం

30న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం.భద్రత, ట్రాఫిక్‌పై పకడ్బందీ ఏర్పాట్లు: మంత్రి పొన్నం ప్రభాకర్





కరీంనగర్, (సింగిడి): కరీంనగర్ జిల్లా నూతన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ఈ నెల 30న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పండుగ వాతావరణంలో ప్రారంభించేందుకు పక డ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షే మ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం, కార్యాలయ భవనం, ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను సుం దరంగా అలంకరించి, స్వాగత తోరణాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో మంత్రి సమీక్ష నిర్వహించారు. మనకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. భద్రతను కట్టుదిట్టం చేయడంతో పాటు, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. నూత న కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించిన మంత్రి, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ప్రాంగణం, సభా వేదిక, కలెక్టర్ ఛాంబర్, సమావేశ మందిరం తదితర ప్రాంతాల్లో ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యమంత్రి రాక కోసం నూతనంగా నిర్మించిన హెలిప్యాడ్‌ను కూడా పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసు కున్నారు. ముఖ్యమంత్రి కలెక్టరేట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అనంతరం జిల్లా అధికారులతో సమా వేశమై దిశానిర్దేశం చేయనున్నారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. సీఎం పర్యటన ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ఎలాంటి లో టుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. సమావే శంలో అద నపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి స్వామి, ఆర్డీవో పర్శిల, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్‌తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం
కళాశాల చైర్మన్ వి. రవీందర్ రెడ్డి



కరీంనగర్,(సింగిడి): ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం రోజున, మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిం చారు. కళాశాల చైర్మన్ వి. రవీందర్‌రెడ్డి మొక్కనాటి కార్య క్రమాన్ని ప్రారంభిం చారు. ఆయన మాట్లాడుతూ, పర్యావ రణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని సూచించారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ గోలి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారులు ఎన్. రాజిత, పి. విజయ, వి. సంతోష్, అంజనేయులు, ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకులు కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి కార్యక్రమాన్ని కొనసాగించాలని ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోలి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎన్. రాజిత, పి. విజయ, వి. సంతోష్, అంజనేయులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారదకు సన్మానం

దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు



జమ్మికుంట, (సింగిడి): తెలంగాణ మహిళా కమిషన్ చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన నేరెళ్ల శారదను మర్యాదపూర్వకంగా కలి సిన ఇల్లంతకుంట దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు. హైదరాబాద్ బుద్ధభవన్‌లో రెండవసారి తెలం గాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ గా నేరెళ్ల శారద పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా, వారిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసి శాలువాతో సన్మానం చేసి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మెమెంటో ముత్యాల తలంబ్రాలను అందించిన ఆలయ చైర్మెన్ ఇంగిలే రామారావు . ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి మేక మల్ల అశోక్, మడిపల్లి గ్రామ సర్పంచ్ మేకమళ్ళ తిరుమల వెంకటేష్, ఏ ఏం సి డైరెక్టర్ ఎగ్గేటి సదానందం తదితరులు పాల్గొన్నారు.

పిట్టల లింగయ్యకు యాదగిరి సునీల్‌రావు నివాళి

పెద్దకర్మలో పాల్గొని కుటుంబ సభ్యులకు పరామర్శ



కరీంనగర్,(సింగిడి): పట్టణ ముదిరాజ్ సంఘం గౌరవా ధ్యక్షుడు, రాంపూర్ మాజీ సర్పంచ్ పిట్టల లింగయ్య పెద్దకర్మ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర ఉప మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు పాల్గొని నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా లింగయ్య చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన కుమారులు, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

సిరిసిల్ల సభకు భారీగా తరలిరావాలి

సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయాలి
మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్



కరీంనగర్, (సింగిడి): సెప్టెంబర్ 30న సిరిసిల్లలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పాల్గొనే భారీ బహిరంగ సభకు కరీంనగర్ జిల్లా నుంచి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "చలో సిరిసిల్ల గడ్డ, కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం" అనే నినాదంతో జిల్లా నుంచి భారీగా తరలిరావాలని కోరారు. ముఖ్యమంత్రి పాల్గొనే సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. సిరిసిల్లలో జరిగే సభకు కరీంనగర్ జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి తమ మద్దతును చాటాలని నరసన్న పటేల్ కోరారు. సెప్టెంబర్ 30న కరీంనగర్ నుంచి సిరిసిల్లకు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్



మల్యాల (సింగిడి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జగిత్యాల జిల్లా సంక్షేమ అధికారి భాస్కరు అన్నారు. గురువారం ముత్యంపేట గ్రామపం చాయతీ ఆవరణలో పోషణ మాసం కార్యక్రమం చేపట్టడం జరిగింది 9వ పోషణ మాసం లో భాగంగా ఈ సంవత్సరం మన అంగన్వాడి – మనందరి బాధ్యత అనే అంశం పై కార్యక్ర మం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ పాల్గొని మాట్లాడుతూ పోషకాహారం తినడం ద్వారా ఎలాంటి వ్యాధులు రావని సమయానికి పిల్లలకు టీకాలు వేయించుకోవాలని ఇంటి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకొని మంచినీటిని ఎక్కువ తీసుకొని ఆకుకూరలు ఎక్కువ తినాలని ఆయన కోరారు. సందర్భం గా క్విజ్ పోటీలు నిర్వహించారు ఈ పోటీల్లో గెలిచిన నలుగురు తల్లులకు బహుమతులు అంద చేశారు. 5గురు చిన్నారులకు అన్నప్రాశన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దారం ఆదిరెడ్డి , సిడిపిఓ వీరలక్ష్మి, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ మధు , సూపర్వైజర్ శారద, అంగన్వాడి కార్యకర్తలు శోభారాణి, గంగ, మమత, శారద, పద్మ ,శారద, ఏఎన్ఎంలు, ఆశా, కార్యకర్తలు, బాలింతలు, తల్లులు, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద ఘటనపై ఎంపీ ఈటల రాజేందర్ ఆరా..

మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి..
గాయపడిన రమేష్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలి
నిమ్స్ వైద్యులకు సూచించిన ఈటెల

జమ్మికుంట,(సింగిడి): హుజురాబాద్ మండలంలోని పెద్దపాపయ్యపల్లి సమీపంలో బుధవారం నేషనల్ హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కొంకటి సులోచన (44) మృతి చెందగా, ఆమె భర్త బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు కొంకటి రమేష్ తీవ్రంగా గాయపడిన ఘటనపై మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు.రోడ్డు ప్రమాదంలో సులోచన మృతి చెందడం పట్ల ఈటల రాజేందర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమా దంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో



ఉన్న కొంకటి రమేష్‌ను మెరుగైన వైద్యం కోసం నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. రమేష్ ఆరోగ్య పరిస్థితిపై ఈటల రాజేందర్ స్వయంగా నిమ్స్ వైద్యులు, ఆసుపత్రి ఉన్నతాధికారులతో మాట్లాడి, అవసరమైన వైద్య సహాయం అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఈటల రాజేందర్ హామీ ఇవ్వడం జరిగింది.

కరీంనగర్‌లో ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనం

2,252 విగ్రహాల నిమజ్జనం. సహకరించిన ప్రతి ఒక్కరికీ మేయర్ కొలగాని శ్రీనివాస్ కృతజ్ఞతలు



కరీంనగర్,(సింగిడి): నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేశ్ నిమజ్జన వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా, వైభవంగా ముగిశాయని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. బుధ వారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన నిమ జ్జన కార్యక్రమం గురువారం సాయంత్రం 7 గంట ల వరకు కొనసాగింది. నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 2,252 గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేశారు.నిమజ్జన ప్రక్రియను మేయర్ స్వయంగా మానకొండూర్, కొత్తపల్లి, చింతకుం ట తదితర ప్రధాన కేంద్రాలను సందర్శించి పర్య వేక్షించారు. చింతకుంటలో 740, మానకొం డూర్‌లో 850, కొత్తపల్లిలో 550, బొమ్మకల్‌లో 62, గోపాల్‌పూ ర్‌లో 30, దుర్శేడ్‌లో 20 విగ్రహాలు నిమజ్జనం అ-య్యాయి.నిమజ్జన వేడుకలు సజా వుగా సాగేం దుకు సహకరించిన నగర ప్రజలు, పాలకవర్గ సభ్యులు, ఉత్సవ కమిటీలు, మండపాల నిర్వాహ కులు, వివిధ శాఖల అధికారులు, నగర పాలక సంస్థ సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు మేయర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అధికారులు, సిబ్బంది సమర్థ వంతంగా విధులు నిర్వహించారని ప్రశంసించా రు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, నిమజ్జన కేంద్రాల్లో పారిశుధ్యం మెరుగ్గా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

50 ఏళ్ల విమలక్క ప్రజా కళా ప్రస్థానానికి ఘన నివాళి

ఈ నెల 26 నుంచి 28 వరకు హైదరాబాద్‌లో ప్రజా కళా జాతర, 50 గంటల పాటు పాట, ఆట, మాట కార్యక్రమాలు



కరీంనగర్,(సింగిడి): 52 ఏళ్ల అరుణోదయంలో 50 ఏళ్ల విమలక్క ప్రస్థానం" పేరుతో ఈ నెల 26 నుంచి 28 వరకు హైదరా బాద్‌లో నిర్వహించనున్న ప్రజా కళా జాతరను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయ కులు పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్ లోని అమరవీరుల స్తూపం వద్ద ప్రజా కళా జాతర కరపత్రాలను ఆవిష్కరించారు. తెలంగాణ యునై టెడ్ ఫ్రంట్ జిల్లా పూర్వ అధ్యక్షుడు బొల్లం లింగ మూర్తి పటేల్, పూర్వ కార్యదర్శి బిజిగిరి నవీన్‌కు మార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అరు ణోదయ కళాకారులు, ప్రజాసంఘాల నాయకు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 52 ఏళ్ల అరుణోదయ సాంస్కృతిక ప్రస్థా నంలో 50 ఏళ్లుగా విమలక్క కొనసాగిస్తున్న ప్రజా కళా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఈ జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఆర్టిస్ కళ్యాణ మండపం (నాగన్న ప్రాంగణం)లో మూడు రోజుల పాటు కార్యక్రమాలు కొనసాగుతా యని, 50 గంటల పాటు వివిధ కళా రూపాలు, పాటలు, ఆటలు, మాటల కార్యక్రమాలు నిర్వ హించనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలు, సామాజిక చైతన్యం, ఉద్యమాల నేపథ్యాన్ని కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు.

విమలక్క ఐదు దశాబ్దాలుగా వివిధ ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేశారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ ధూంధాం కార్యక్ర మాల ద్వారా ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లా రని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో సాంస్కృ తిక కళాకారుల పాత్రను గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ప్రజా కళలు,సాంస్కృతిక ఉద్యమా లతో సుదీర్ఘ అనుబంధం ఉందని, జిల్లాకు చెందిన కళాకారులు, కవులు, గాయకులు, ప్రజాసంఘాల నాయ కులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజా కళా జాతరను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వేములకుర్తిలో హర్షాతిరేకాలు.. ఘన సన్మానం

పౌల్ట్రీ రైతుల అభ్యున్నతికి కృషి చేస్తా: గుజ్జె గంగాధర్

మెట్‌పల్లి,(సింగిడి): పౌల్ట్రీ రం గంలో కొన్నేళ్లుగా కొనసాగుతూ రైతుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్న ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తికి చెందిన గుజ్జె గంగాధర్‌కు జిల్లా స్థాయిలో బాధ్యతలు దక్కాయి. జగిత్యాల జిల్లా లేయర్ పౌల్ట్రీ ఫార్మ్ అసోసియేషన్ జిల్లా ఉపా ధ్యక్షుడిగా ఆయన నియమితులయ్యారు. మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన నూతన కార్యవర్గ ప్రమా ణ స్వీకార కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పుడుకా రం నవీన్ ఆధ్వర్యంలో గంగాధర్‌తోపాటు ఇతర కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు.

గంగాధర్‌కు జిల్లా స్థాయి పదవి దక్కడంతో వేము లకుర్తిగ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. గ్రామ యువకులు, రైతులు, పెద్దలు, మిత్రులు కలిసి ఆయనను శాలువాలతో సన్మానించి పుష్ప గుచ్ఛాలు అందజేశారు. గ్రామానికి చెందిన వ్యక్తి జిల్లా స్థాయి బాధ్యతలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. గంగాధర్ గత కొన్నేళ్లుగా పౌల్ట్రీ రంగంలో కొనసాగుతు న్నారు. పౌల్ట్రీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత వర్గాలదృష్టికితీసుకెళ్లడంతోపాటురైతుల ప్రయోజనాల కోసం తనవంతు కృషి చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం పట్ల పౌల్ట్రీ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పౌల్ట్రీ రంగంతోపాటు ప్రజాసే వలోనూ గంగాధర్ వివిధ బాధ్యతలు నిర్వహిం చారు. గతంలో గ్రామ పంచాయతీ కో-ఆప్షన్ సభ్యుడిగా, యామాపూర్ సహకార సంఘం డైరెక్టర్‌గా, వేములకుర్తి గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. ఆయా బాధ్యతల్లో గ్రామా భివృద్ధి, రైతు సంక్షేమం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ తనపై నమ్మ కం ఉంచి బాధ్యతలు అప్పగించిన అసోసియేషన్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోనిలేయర్ పౌల్ట్రీ రైతులు ఎదుర్కొం టున్న సమస్యలను పరిష్క రించేందుకుతనవంతుకృషి చేస్తానన్నారు. పౌల్ట్రీ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసంపనిచేస్తానని,రైతులం దరినీ కలుపుకొని అసోసి యేషన్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. గంగాధర్ నియామకం పట్ల పౌల్ట్రీ రైతులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, మిత్రులు, అభిమానులు అభినం దనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అనర్హులకు వికలాంగుల సర్టిఫికెట్లు?

ఇతర జిల్లా సర్టిఫికెట్ల మతలబేంటి?
అర్హత లేకున్నా వికలాంగుల సర్టిఫికెట్ ఎలా?
పరీక్షలు లేకుండానే సర్టిఫికెట్లా?

మల్లాపూర్, (సింగిడి): మండలం లోని పలు గ్రామాల్లో అర్హత లేని కొందరు వ్యక్తు లకు వికలాంగుల (ఫిజికల్ హ్యాండీక్యాప్డ్) సర్టిఫి కెట్లు జారీ అయ్యాయనే ఆరోపణలు మండలంలో చర్చనీయాంశంగా మారింది. వికలాంగుల సర్టిఫికెట్లు జగిత్యాల జిల్లాలో కాకుండా ఇతర జిల్లాల నుంచి జారీ అయినట్లు సమాచారం. ఇతర జిల్లాల నుంచి పొందిన వికలాంగుల సర్టిఫికెట్ల ఆధారంగా ప్రస్తుతం పలువురు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. అర్హత కలిగిన వారితో పాటు అనర్హులు కూడా దరఖాస్తు చేసుకోవడంతో నిజమైన అర్హులకు ఇబ్బందులు ఎదురవుతున్న యి. అయితే ఆయా సర్టిఫికెట్లు ఎక్కడ, ఎలా జారీ అయ్యాయి? ఎవరి ద్వారా పొందారు? సంబంధిత వైద్య పరీక్షలు, ధ్రువీక రణ ప్రక్రియ సక్రమంగా జరిగిందా? అనే అంశా లపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారా లేదా పెండింగ్‌లో ఉంచారా అనేది కూడా తెలియాల్సి ఉంది. అర్హత లేని వారికి సర్టిఫికెట్లు జారీ అయ్యాయనే ఆరోపణలపై సంబంధిత



అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవా లను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. సర్టిఫికెట్లు నిబంధనల ప్రకారం జారీ అయ్యాయా లేదా అనే విషయాన్ని అధికారులు స్పష్టం చేస్తారో లేదో వేచి చూడాలి.

సమాజ సేవతోనే విద్యార్థినుల్లో

నాయకత్వ లక్షణాలు

మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



కరీంనగర్, (సింగిడి): కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం(ప్రతిపత్తి)లో ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు సామాజిక సేవ, బాధ్యతలపై అవగాహన కల్పించారు.కార్యక్రమానికి కళాశాల ఉప ప్రిన్సిపాల్ డాక్టర్ అఫ్సరి ఉస్మాని ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్ఎస్ ఎస్ లక్ష్యాలు, సభ్యత్వంతో విద్యార్థినులకు కలిగే ప్రయోజనా లు, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం గురించి వివరిం చారు. సమాజ శ్రేయస్సు, అభివృద్ధి కోసం విద్యార్థినులు తమ వంతు కృషి చేస్తూ సామాజిక సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు.సమాజంలోని మూఢనమ్మకాలు, చెడు సంప్రదాయాలకు దూరంగా ఉండాలని, సామాజిక మాధ్యమాలు, ఇతర మార్గాల్లో వ్యాప్తి చెందే తప్పుడు సమాచారాన్ని నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ నాలుగు విభాగాల కార్యక్రమ అధికారులు డాక్టర్ ఆర్. మొగిలి, పి. స్వరూప, డాక్టర్ ఎం.వి.లక్ష్మణ్‌రావు, కె. వెంకటరమణతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు

రూ.25,116లకు లడ్డూ దక్కించుకున్న రాగల్ల దంపతులు



మల్లాపూర్, (సింగిడి): మల్లాపూర్‌లో గణేశ నిమజ్జన వేడుకలు రెండో రోజు ఘనంగా కొనసాగాయి. మల్లాపూర్ వాసవి మాత ఆలయంలో నిర్వహించిన గణపతి లడ్డూ వేలం పాటలో మొగిలిపేట గ్రామానికి చెందిన రాగల్ల వెంకటేశ్వర్--గౌతమి దంపతులు రూ. 25,116లకు లడ్డూ ను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వైశ్య సంఘం ఆధ్వ ర్యంలో నిర్వహించిన నిమజ్జన వేడుకల్లో సంఘ సభ్యులు సంప్రదాయ పద్ధతిలో కోలాటం ఆడుతూ ఉత్సాహంగా పాల్గొ న్నారు. సంఘ నాయకులు, సభ్యులు కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొని గణనాథుడికి వీడ్కోలు పలికారు.

ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు



వెల్గటూర్, (సింగిడి):: మండలంలో వినా యక నిమజ్జన వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహిం చారు. నవరాత్రులు పూజలు అందుకున్న గణపయ్య నిమజ్జనానికి తరలి వెళ్ళాడు.

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
సింగిడి

ఉచిత హోమియోపతి వైద్య శిబిరం



కమలాపూర్, (సింగిడి): 11వ ఆయుర్వేద దినో త్సవ సందర్భంగా శనిగరం ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీ వైద్యా ధికారి డా కె ఝాన్సీ ప్రియాంక ఆధ్వర్యంలో బుధవారం గ్రామ బస్టాండ్ వద్ద ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించి, ఆరోగ్య కరమైన జీవనశైలి, వ్యాధుల నివారణ, హోమియోపతి వైద్య విధానం ప్రాముఖ్యతపై వివరించారు. అవసరమైన వారికి ఉచిత హోమి యో మందులను అందజేశారు. ఈ వైద్య శిబిరంలో యోగ శిక్షకు లు పద్మ, చంటి పాల్గొని యోగా ప్రాముఖ్యతను ప్రజలకు వివ రించారు. నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

టీబీ నిర్ధారణ పరీక్షల సీబీనాట్ యంత్రం ఏర్పాటుపై పరిశీలన



కమలాపూర్,(సింగిడి): కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో క్షయ వ్యాధి (టీబీ) నిర్ధారణ పరీక్షలను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సీబీనాట్ పరీక్షల యంత్రాన్ని ఏర్పాటు చేయడానికి జిల్లా వైద్యాధికారులు ఇంచార్జ్ డిటిసిఓ, డిప్యూటీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ రెడ్డి,సి ఎచ్ ఓ బుధవారం ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, యంత్రాం ఏర్పాటుకుగది, విద్యుత్, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. అదేవిధంగా టీబీ అనుమానితులకు త్వరితగతిన నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి సకాలంలో చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం గణేష్ నిమజ్జనం సందర్భంగా చేపట్టాల్సిన వైద్య, ఆరోగ్య, పారిశుద్ధ్య ఏర్పాట్లను వైద్యాధికారులు పరిశీలించారు. నిమజ్జనం కార్యక్రమాల సమయంలో ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు.తాగునీరు, పారిశుద్ధ్యం, పారిశుద్ధ్య సిబ్బంది, అత్యవసర మందులు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డా చందు నాయక్ ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా నాగరాజు, హెల్త్‌సూపర్వైజర్ అమృత, పల్లె దవాఖాన వైద్యురాలు డాక్టర్ రమ్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గణపతి లడ్డూ వేలంలో చిన్నారి విహాన్వి
రూ.30,516లకు విఘ్నేశ్వరుని లడ్డూ సొంతం



మహాముత్తారం,(సింగిడి):: జయశంకర్ భూపా లపల్లి జిల్లా మహాముత్తారం మండలం నర్సింగాపూర్ ఎస్టీ కాలనీలో శ్రీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన విఘ్నేశ్వరుని లడ్డూ వేలం పాటలో లక్కిరెడ్డి ప్రణతి–ప్రశాంత్ రెడ్డి దంపతుల కుమార్తె లక్కిరెడ్డి విహన్వి పాల్గొని లడ్డూను రూ. 30,516లకు దక్కించుకున్నారు. నర్సింగాపూర్ గ్రామ చరిత్రలో ఇంత పెద్ద మొత్తానికి గణపతి లడ్డూ వేలం జరగడం ఇదే తొలిసారి అని నిర్వాహకులు తెలిపారు. చిన్నారి విహన్వి లడ్డూను దక్కించుకోవడం పట్ల గ్రామస్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

గుండె ఆపరేషన్ నిమిత్తమై
నాలుగు యూనిట్ల రక్తం అందజేత

రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవు.

ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు.



కామారెడ్డి రూరల్,(సింగిడి): హైదరాబాద్ లోని కిమ్స్ వైద్యశాలలో గుండె ఆపరేషన్ నిమిత్తమై గంగారం (75) కు ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో వారి కుటుంబ సభ్యులు ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు ను సంప్రదించడంతో వారికి కావలసిన రక్తాన్ని కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఎంఏ.వాజిద్(ఏ ఆర్ కాస్టేబుల్),చెన్నబోయిన ప్రసాద్,పబ్బ ఆర్యన్,పర్వ తృషాల్ (సాఫ్ట్ వేర్ ఇంజనీర్)లు మానవతా దృక్పథంతో స్పందించి హైద్రాబాద్ కు వెళ్లి రక్తదానం చేయడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు తెలియజేశారు.నిస్వార్థంగా సేవ చేసే గొప్ప వ్యక్తులు రక్తదాతలని అన్నారు.రక్త దానానికి ముందుకు వచ్చిన రక్త దాతలకు అభినందనలు తెలియజేశారు.





గణేష్ నిమజ్జన శోభాయాత్రకు పకడ్బందీ ఏర్పాట్లు





శోభాయాత్ర వెళ్ళే మార్గంలో 3 డ్రోన్లు,అదనంగా 162 సిసి కెమెరాలతో ప్రత్యేక నిఘా

ట్రాఫిక్ డైవర్షన్లు,బారికేడింగ్‌తో ప్రత్యేక చర్యలు... సిబ్బందితో పటిష్ట భద్రతా ఏర్పాట్లు పూర్తి.

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తినా వెంటనే డయల్ 112 కు సమాచారం అందించాలి.

సిబ్బందికి దిశ నిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర.

కామారెడ్డి రూరల్ (సింగిడి): కామారెడ్డి పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్రలు శాంతియు తంగా,సురక్షితంగా జరిగేలా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యం లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర తెలిపారు. శోభాయాత్ర సందర్భంగా సుమారు 420 మంది పోలీసు అధికా రులు,సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు శోభాయాత్ర మార్గంలో 162 సీసీ కెమెరాలు, 3 డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గణేష్ నిమజ్జన బందోబస్తుపై జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర అధికారులు,సిబ్బందితో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. బందోబస్తు యందు చేయవల్సిన మరియు చేయకూడాని వాటిపై పూర్తిగా వివరించారు. శోభాయాత్ర రూట్‌లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని,జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, ట్రాఫిక్ జంక్షన్లు,నిమజ్జన ఘాట్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సమన్వ యంతో,ఓపికతో విధులు నిర్వహిస్తూ,అవసరమైనప్పుడు వెంటనే స్పందించాలని ఆదేశించారు. శోభాయాత్రలో పాల్గొనే భక్తుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ,నిర్దేశిత రూట్ మ్యాప్ ప్రకారం శోభాయాత్ర సాఫీగా కొనసాగేలా చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. జనసంచారం అధి కంగా ఉండే ప్రాంతాలు,ప్రధాన ట్రాఫిక్ జంక్షన్లు,నిమజ్జన ఘాట్ల వద్ద అదనపు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట బారికేడింగ్,ట్రాఫిక్ డైవర్షన్లు అమలు చేయనున్నట్లు చెప్పారు. గణేష్ నిమజ్జన శోభాయాత్రలో పాల్గొనే భక్తులు పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ కోరారు. అత్యుత్సాహంతో ప్రమాదకర విన్యాసాలు చేయడం,ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళలు, చిన్నారులు,వృద్ధుల భద్రతపై నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొనడం,వాహనాలు నడపడం చేయకూడదని, వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటిస్తూ నిర్దేశిత మార్గాల్లోనే ప్రయాణించాలని సూచించారు. డీజేలు,సౌండ్ సిస్టమ్స్‌కు సంబం ధించి అమలులో ఉన్న నిబంధనలు,శబ్ద పరిమితులను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో పిల్లలు, ఈత రాని వారు నీటిలోకి దిగకుండా తల్లిదండ్రులు,నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. నిమజ్జనం సమయంలో పోలీసు,రెవెన్యూ,మున్సిపల్ తదితర శాఖల సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి వివాదాలు,గొడవలకు తావివ్వకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని,ఇతరులను రెచ్చగొట్టే విధంగా నినాదాలు,వ్యాఖ్యలు చేయకుండా ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని ఎస్పీ సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బంది 24ఐ7 అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేలా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు,వస్తువులు కనిపించినా లేదా ఏదైనా అవాంఛనీయ పరిస్థితి ఎదురైనా వెంటనే సమీపంలోని పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిమజ్జనం అనంతరం రహదారులపై చెత్త,వ్యర్థాలు వేయకుండా పరిసరాల పరిశుభ్రతను కాపాడాలని ప్రజలు,నిర్వాహకులను కోరారు. భక్తి,ఆనందంతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా

వ్యవహరిస్తే గణేష్ నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా,సురక్షి తంగా నిర్వహించుకోవచ్చని ఎస్పీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోనూ గణేష్ నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా పోలీసు శాఖ తరపున అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా,సురక్షితంగా జరిగేందుకు ప్రజలు,గణేష్ మండపాల నిర్వాహకు లు,భక్తులు పోలీసు శాఖకు సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర కోరారు.

49 కుటుంబాలను బహిష్కరించిన గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు

జిల్లా పోలీస్ కమిషనర్‌కు
ఫిర్యాదు చేసిన బాధిత కుటుంబాలు

ఆర్మూర్, (సింగిడి): నిజామాబాద్ జిల్లా కేంద్రం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం రోజున నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం ఏరుగట్ల మండలంలోని తాళ్ల రాంపూర్ గ్రామానికి చెందిన 39– గౌడ కుటుంబాలను, , 10 – దళిత కుటుంబాలు జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్యను స్వయంగా కలిసి బహిష్కరణకు గురైన 49 కుటుంబాల బాధితులు ఫిర్యాదు చేసి తమ గోడును విన్నవించుకున్నారు. ఈనెల 22 సెప్టెంబర్ 2026 మంగళవారం రోజున గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు సాంఘిక గ్రామ బహిష్కరణ చేశారని జిల్లా ఎస్పీకి, ఫిర్యాదు చేసి విన్నవించుకున్నారు. ఈ గ్రామ బహిష్కరణ ఇది రెండవ సారి చేయడం జరిగిందని తెలియజేశారు. గ్రామం మొత్తం నిన్నటి మంగళవారం ఉనుండి బహిష్కరణ గురైన కుటుంబాలకు సహాయ నిరాకరణ చేస్తూ, ఎవరు కూడ మాట్లాడకుండ, గ్రామంలో గల కిరాణా కొట్టులలో సరుకులు ఇవ్వకుండా గ్రామ అభివృద్ధి కమిటీ ఆంక్షలు విధించారు. ఎవరైనా వారు చెప్పిన మాటను వినకుండ, వారితో మాట్లాడిన, సరుకులు ఇచ్చిన వారికి 25 వేల రూపాయల జరిమాన తీస్తామని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు జారీ చేయడం జరిగింది అని తెలిపారు. గ్రామ అభివృద్ధి కమిటీ వారు ఏ క్షణమైనా దాడి చేసే అవకాశం ఉందని కమీషనర్ కి తెలియజేశారు. ఈ గ్రామ బహిష్కరణకు ప్రధాన కారకులైన, వారిని కఠినంగా శిక్షించి వారిపై చర్యలు తీసుకొని, మళ్లీ గ్రామంలో ఇలాంటి సంఘటనలు తలెత్తకుండ, మాకు రక్షణ కల్పించవలసిందిగా కోరుతూ తాళ్ళరాంపూర్ కల్లుగీత కార్మిక సంఘం, బాధిత గౌడ కుటుంబాలు , బాధిత దళిత కుటుంబాలు వారు వాపోయారు.



గ్రామ అభివృద్ధి కమిటీతో పాటు, ఆవుల దేవన్న, ఇట్టేడి రాజకుమార్ రెడ్డి ,నాగులపల్లి అంజిరెడ్డి, క్యాతం దేవేందర్, క్యాతం గంగాధర్ తుమ్మల ఆనంద్ , తమ్మడి రాజేష్ , పోతుగంటి ఊహన్న , పలువురు ఉన్నారని జిల్లా సిపి సాయి చైతన్యకు విన్నవించుకున్నారు.బహిష్కరణకు కారకులైన

గంగమ్మ ఒడికి గణనాథుడు

– తొమ్మిది రోజుల పాటు ఘనంగా పూజలు..
భక్తిశ్రద్ధలతో నిమజ్జనం







డోర్నకల్ /మరిపెడ(సింగిడి):: మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని ఇందిరా కాలనీ కొత్తవాడ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు గణనాథుడికి భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజలు నిర్వహించారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, కార్యక్రమాలతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంపాట ఉత్సాహంగా సాగింది. మత సామరస్యానికి ప్రతీకగా నసీమా రూ. 12,500కు లడ్డూను దక్కించుకున్నారు. గణనాథుడి వద్ద పూజలు అందుకున్న ఉండిని సైదులు దంపతులు రూ. 2,800కు,దోతి, టవల్‌ను జంపయ్య దంపతులు రూ. 1,200కు దక్కించుకున్నారు. పూజలు అందుకున్న పండ్లను పులి శ్రీనివాస్--ఉమా దంపతులు దక్కించుకున్నారు. అనంతరం కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్లి గంగమ్మ ఒడికి చేర్చారు. ఈ సందర్భంగా భక్తులు గణపతి నామస్మరణలతో సందడి చేశారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులను కాలనీవాసులు అభినందించారు.

వర్షాకాలంలో పిల్లల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయొద్దు
పిల్లలకు తగినంత ద్రవ పదార్థాలు అందించాలి.
పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ సప్త ఋషి



హన్మకొండ (సింగిడి): వర్షాకాలంలో పిల్లలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని హన్మకొండ ప్రభుత్వ ఆసుపత్రి పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సప్త ఋషి సూచించారు. వర్షాకాలంలో వాతావరణం లో మార్పులు, దోమల సంఖ్య పెరగడం, పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం వంటి కారణాలతో పిల్లల్లో వివిధ రకాల సీజనల్ వ్యాధులు, జ్వరాలు, జలుబు, దగ్గు, నీరసం వంటి అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పిల్లలు ఉండే పరిసరాల ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడం తో పాటు ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పిల్లలకు జ్వరం వచ్చినప్పుడు శరీర ఉష్ణోగ్రతను గమనిస్తూ, వైద్యుల సూచన మేరకు మందులు ఇవ్వాలని తెలిపా రు. జ్వరం ఎక్కువగా ఉన్న సమయంలో పిల్లల శరీరాన్ని తడి గుడ్డతో తుడుస్తూ ఉష్ణోగ్రతను తగ్గించేలా చూడాలని సూచిం చారు. అదే సమయంలో పిల్లలకు తగినంత నీరు, ద్రవ పదార్థాలు అందిస్తూ శరీరంలో నీటి లోపం రాకుండా జాగ్రత్తలు తీసుకోవా లని చెప్పారు. జ్వరం, వాంతులు, విరేచనా లు, దగ్గు, నీరసం, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే సొంతంగా మందులు వాడకుండా వెంటనే వైద్యులను సంప్రదిం చాలని సూచించారు. ముఖ్యంగా చిన్న పిల్ల ల్లో జ్వరం ఎక్కువగా ఉన్నా, జ్వరం తగ్గకుం డా కొనసాగుతున్నా, పిల్లలు నీరసంగా కనిపించినా ఆలస్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించాలని డాక్టర్ సప్త ఋషి తెలిపారు. హన్మకొండ ప్రభుత్వ ఆసు పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుబా టులో ఉన్నాయని, ప్రజలు ఈ సేవలను



వినియోగించుకోవాలని తెలిపారు. వర్షాకా లంలో పిల్లల ఆరోగ్యం విషయంలో తల్లిదం డ్రులు నిర్లక్ష్యం చేయకుండా పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, వ్యక్తిగత పరిశు భ్రతతో పాటు పిల్లల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని సూచించారు.

నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

బిక్కనూర్, (సింగిడి): బిక్కనూర్‌లో వినాయక నిమజ్జనానికి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీ సిద్ధరామేశ్వరాలయం సమీపంలోని వీరభద్రస్వామి ఆలయం వెనుక ఉన్న చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జనం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.విగ్రహాలను భక్తులకు ఇబ్బంది లేకుండా సులభంగా నిమజ్జనం చేసేందుకు క్రేన్‌ను ఏర్పాటు చేశారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ఈ ఏర్పాట్లను సర్పంచ్ బాల్యాల రేఖ సుదర్శన్ పర్యవేక్షించారు.



వినాయక నిమజ్జన ఏర్పాట్లు..

క్రేన్లను ప్రారంభించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్

కామారెడ్డి రూరల్, (సింగిడి): కామారెడ్డి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వినాయకచవితి నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లలో భాగంగా,నిమజ్జన కోసం ఏర్పాటు చేసిన క్రేన్లకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా,సురక్షితంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఛైర్‌పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్‌పర్సన్ కాసార్ల



గోదావరి,మున్సిపల్ కమిషనర్ పర్వతాలు,డిఈ హన్మంత్ రావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ్‌నగర్‌లో ఘనంగా పోషణ పక్షోత్సవాలు

మహాముత్తారం,(సింగిడి): జయశంకర్ భూపా లపల్లి జిల్లా మహాముత్తారం మండలం ప్రేమ్ నగర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జాటోత్ రాజు నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్యవంతమైన కుటుంబమే గ్రామాభివృద్ధికి మూలస్తంభమన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రతిరోజూ సమతుల పౌష్టికాహారం అందించా లన్నారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, తృణధాన్యాలు, పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో పోషకాహార లోపం, రక్తహీనత లేకుండా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జాటోత్ చారన్ బాయి, ఏఎన్ఎం సులోచన, ఆశా కార్యకర్త గడ్డం సుజాత, గర్భిణులు, బాలింతలు, విద్యార్థులు, వార్డు సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రభాతనవ సింగిడి SINGIDI తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం

సింగిడి

గణేష్ మండపం వద్ద

ఘనంగా కుంకుమార్చన



చింతలమానేపల్లి,(సింగిడి):చింతలమానేపల్లి మండల కేంద్రం లోని వీరాంజనేయ ఆలయంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద మంగళవారం రాత్రి కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్ర ద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల పురుషోత్తమ చారీ ఆధ్వర్యంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం మహిళా భక్తులు కుంకువ ార్చనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కళకళలా డింది. గ్రామంలోని మహిళలు, యువత, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గణపతి నామస్మ రణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. భక్తులు కుటుంబ సభ్యు లతో కలిసి పూజల్లో పాల్గొని గణేశుడి ఆశీస్సులు పొందారు. కుంకుమార్చన అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసా దాలు అందజేశారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరిం చుకుని మండపం వద్ద ప్రతిరోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆర్యవైశ్య సంఘం

వినాయక నిమజ్జనం

భజనలతో ఊరేగింపు..
అడుగడుగునా మహిళల మంగళహారతులు



బిక్కనూర్, (సింగిడి)::బిక్కనూర్ మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించి భజనలు, భక్తిగీతాలు, నృత్యాల మధ్య ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు మార్గంలో అడుగడుగునా ఆర్యవైశ్య మహిళలు మంగళహా రతులతో గణనాథుడికి నీరాజనం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులు, సంఘ సభ్యులు, మహిళలు, పాల్గొన్నారు.



తొర్రూరులో భక్తి పారవశ్యంలో
మట్టి గణపయ్య నిమజ్జనోత్సవం







తొర్రూరు, (సింగిడి):
పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ ండ్డి ఆధ్వర్యంలో తొర్రూరు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా ముగిశాయి. పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా ప్రతిష్ఠించిన శ్రీ మట్టి గణపయ్య నిమజ్జనోత్సవాన్ని భక్తుల భారీ పాల్గొనికతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. నిమజ్జనోత్సవానికి ముందు శ్రీ గణపయ్యకు ప్రత్యేక పూజలు, అర్చనలు, హారతులుసమర్పించారు. వేదమంత్రాల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించగా, అనంతరం మంగళ వాయిద్యాలు, డప్పు చప్పుళ్లు, గణపతి నామస్మరణలతో శోభాయాత్ర ప్రారంభమైంది. శోభాయాత్రలో మహిళలు, యువత, చిన్నారులు, పార్టీ కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి పారవశ్యంలో వినాయకుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. శోభాయాత్ర తొర్రూరు పట్టణ ప్రధాన వీధుల గుండా కొనసాగి నిమజ్జన స్థలానికి చేరుకుంది. ఈ సందర్భంగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే మట్టి గణపతుల ప్రతిష్ఠాపన ప్రతి ఇంటా అలవాటుగా మారాలని పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకుబదులుగా మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించడం ద్వారా ప్రకృతిని కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో పాలకుర్తి నియోజకవర్గ ప్రజలందరికీ సుఖశాంతులు, సుభిక్షం, ఆయురారోగ్యాలు, అభివృద్ధి కలగాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. చివరి రోజు నిమజ్జనోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు స్వచ్ఛంద కార్యకర్తలు, పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేపట్టగా, భక్తులు క్రమశిక్షణతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు పట్టణ ప్రజాప్రతినిధులు, మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, పార్టీ శ్రేణులు, యువజన నాయకులు, కార్యకర్తలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పొట్యాలలో పారిశుద్ధ్యం గాలికి వదిలేసిన వైనం..!!



చెత్త కుప్పలుగా మారుతున్న వీధులు..
మురుగుతో నిండుతున్న కాలువలు
దుర్వాసన, దోమల బెడదతో అవస్థలు పడుతున్న గ్రామస్తులు
పారిశుద్ధ్య నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ ఏదీ..?

అంతర్గం (సింగిడి): పొట్యాల గ్రామం అంటే పచ్చదనం.. పరిశుభ్రత.. ప్రశాంతమైన వాతా వరణం. కానీ పొట్యాల గ్రామంలో ప్రస్తుతం ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పలు ప్రాం తాల్లో చెత్త పేరుకుపోవడం, మురుగు కాలువలు వ్యర్థా లతో నిండిపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.గ్రామంలోని కొన్ని వీధుల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో కుప్పలుగా పేరుకుపోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అలాగే గ్రామంలోని డ్రైనేజీల వెంట పిచ్చి మొక్కలతో నిండిపోయింది. కొన్ని డ్రైనేజీల్లో కిటికీలు, ఇంటి దర్వాజలు అందులో వేయడం విడ్డూరంగా ఉంది, చెత్త తొలగింపుపై క్రమం తప్పకుండా చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదని అంటున్నారు.మురుగు కాలువల్లో చెత్త, మట్టి, ఇతర వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగునీటి





ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు.

దోమల బెడదతో ప్రజల ఇబ్బందులు

మురుగు నిల్వలు, చెత్త కుప్పల కారణంగా దోమల సంఖ్య పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో దోమల బెడద అధికంగా ఉంటోందని చెబుతున్నారు. పారిశుద్ధ్య సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పరిస్థితి మరిం త ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి క్రమబద్ధమైన పర్యవేక్షణ అవసరమని ప్రజలు కోరుతున్నారు. చెత్త సేకరణ, కాలువల శుభ్రత, మురుగు తొలగింపు, దోమల నివారణ వంటి



అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్

పొట్యాల గ్రామంలోని పారిశుద్ధ్య సమస్యలపై సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్ర మాలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. పేరుకుపో యిన చెత్తను తొలగించడం, మురుగు కాలువలను శుభ్రం చేయడం, అవసరమైన చోట డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, దోమల నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, గ్రామ పరిశుభ్రతకు సంబంధించిన అంశాలను అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని పొట్యాల గ్రామంలో పారిశుద్ధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఈస్థానికులు కోరుతున్నారు.

చందర్ జన్మదిన వేడుకలు..

అంతర్గాంలో బీఆర్ఎస్ శ్రేణుల సందడి!





అంతర్గాం,(సింగిడి):బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ జన్మదిన వేడుకలు అంతర్గాం మండల కేంద్రంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. బీఆర్ఎస్ అంతర్గాం మండల అధ్యక్షుడు కోల సంతోష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సందడి చేశారు.జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మిఠాయిలు పంపిణీ చేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమం సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణుల నినాదాలతో అంతర్గాం మండల కేంద్రం మార్మోగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కోరుకంటి చందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలతో మమేకమై రాజకీయ, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటున్న చందర్‌కు మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరుకున్నారు.వేడుకలకు వివిధ గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావడంతో అంతర్గాం మండల కేంద్రం సందడిగా మారింది. జన్మదిన వేడుకల సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. కార్యకర్తలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ వేడుకలను ఘనంగా నిర్వహించారు.పాల్గొన్నవారు: మాజీ అంతర్గాం వైస్ ఎంపీపీ శ్రీమతి మట్ట మహేందర్ రెడ్డి, గోలివాడ మాజీ సర్పంచ్ ధరణి రాజేష్, రాయదండి మాజీ సర్పంచ్ ధర్మాజీ కృష్ణ, ఎలక కొమురయ్య, నక్క జితేందర్, గాంధీ, అంజి, బండి మహేష్, గాదం శివ, బోడకుంట తిరుపతి, బరపటి తిరుపతి, గోశిక తిరుపతి, అర్జనపల్లి రాజు, ఆవునూరి రాజేష్, కాంపెల్లి సంతోష్, చంద్రమౌళి, ఓల్లెపు మల్లేష్, గోర్క సంతోష్, బరపటి చొక్కయ్య, మెండ రమేష్, గద్దల రాజశేఖర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన శోభాయాత్రలో సేవా కార్యక్రమం

5 వేల వాటర్ బాటిళ్ల పంపిణీ!
జెండా ఏరియాలో భక్తుల దాహార్తి తీర్చిన కొలిపాక శ్రీనివాస్
భక్తుల రద్దీని లెక్కచేయకుండా భక్తులకు ఉచిత తాగునీటి అందజేత
ఆధ్యాత్మిక వేడుకకు మానవతా సేవను జోడించిన సేవా కార్యక్రమం





పెద్దపల్లి,(సింగిడి):వినాయక నిమజ్జనో త్సవం.. భక్తి పారవశ్యంతో సాగుతున్న శోభాయాత్ర.. మరోవైపు భక్తుల దాహం తీర్చేందుకు ముందుకొచ్చిన సేవా హస్తం.. పెద్దపల్లి పట్టణంలోని జెండా ఏరియాలో నిర్వహించిన తాగునీటి పంపిణీ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.వినాయక నిమ జ్జన శోభాయాత్రలో పాల్గొనే భక్తులు, యువత, మహిళలు, చిన్నారులకు తాగునీటి ఇబ్బంది కలగ కుండా సుమారు 5 వేల వాటర్ బాటిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. బీసీ నాయకుడు కొలిపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.

భక్తుల దాహమే.. సేవకు ప్రేరణ!

నిమజ్జనోత్సవం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు రోడ్లపైకి తరలిరావడంతో తాగునీటి అవసరాన్ని గుర్తించిన నిర్వాహకులు ప్రత్యేకంగా వాటర్ బాటిళ్లను అందుబాటులో ఉంచారు. ఎండ, రద్దీ మధ్య శోభాయాత్రలో పాల్గొంటున్న భక్తులకు ఎక్కడికక్కడ నీటిని అందిస్తూ సేవా కార్యక్రమాన్ని కొనసాగిం చారు.

పండుగ వేళ.. మానవతా పరిమళం

వినాయకుడి నిమజ్జనం భక్తి, ఉత్సాహంతో సాగుతున్న వేళ దాహంతో ఇబ్బంది పడుతున్న వారికి ఉచితంగా తాగునీటిని అందించడం ద్వారా సేవా స్ఫూర్తిని చాటారు. భక్తుల అవసరాన్ని గుర్తించి ముం దస్తుగా భారీ స్థాయిలో వాటర్ బాటిళ్లను ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

సేవా కార్యక్రమంపై భక్తుల ప్రశంసలు

నిమజ్జన శోభాయాత్రలో తాగునీటి సౌకర్యం కల్పించ డంతో భక్తులకు ఎంతో ఉపశమనం లభించిందని పలువురు పేర్కొన్నారు. పండుగల సమయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ప్రజలకు ఉపయో గపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం సమాజా నికి స్ఫూర్తిదాయకమని అభిప్రాయపడ్డారు.భక్తి ఉన్న చోట సేవ.. సేవ ఉన్న చోట మానవత్వం కనిపిస్తుం దని చాటుతూ జెండా ఏరియాలో నిర్వహించిన తాగునీటి పంపిణీ కార్యక్రమం నిమజ్జన వేడుకల్లో ప్రత్యేకంగా నిలిచింది.

వరి ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలి

డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియలు వెంటనే పూర్తి చేయాలి:
రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్



నిర్మల్ ప్రతినిధి,(సింగిడి): వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్నిజిల్లాల్లో అధికారులు తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్రవ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ అధికారులను ఆదే శించారు. బుధవా రం వ్యవసాయ శాఖ కార్యదర్శి, అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, అధికారులతో హైదరాబాదు నుంచి వరి ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు, డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ (ఫార్మర్ ఐడీ నమోదు) ప్రక్రియలపై ఇతర ఉన్నతాధికా రులతో కలిసి విడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, అన్ని జిల్లాల్లో వరి ధాన్యం కొనుగోలుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాల న్నారు. తగినన్ని లారీలు, టార్పాలిన్ లు, గన్నీ సంచులు, హమాలీలు, సామాగ్రి సమకూర్చుకోవాల న్నారు. సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో కొను గోలు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు.

ప్రభుత్వం నిర్ణయించిన ఏడు రకాల సన్న వరి వడ్లు పండించిన రైతులకు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ అందిస్తామన్నారు. రికార్డుల ప్రకారం 10 లక్షల 50 వేలకు పైగా రైతులు దాదాపు 34 లక్షల 84 వేల ఎకరాల్లో సన్న వరి రకాలు సాగు చేశారని అన్నా రు. డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియలు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదే శించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ ద్వారా రైతులకు వ్యవసాయ సంబంధిత అనేక అంశాల్లో ఉపయో గా లు ఉంటాయన్నారు. డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహ ణలో గ్రామీణ స్థాయిలో స్థానికంగా వ్యవసాయ అంశాలపై అవగాహన ఉన్న వారిని వాలంటీర్లుగా నియమించుకోవాలని పేర్కొన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వేల వివరాలను జిల్లాల వారీగా అది కారులను అడిగి తెలుసుకున్నా రు. జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్ పాల్గొన్నారు. వీసీ అనంతరం అధికారులతో ఆయన మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ వివరాలను సమీక్షించారు. మిగిలిన రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే ను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. ఈ వీసీలో జిల్లా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, వ్యవసాయ అధికారి సుజాత, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై హిందూ ఉత్సవ కమిటీ సమావేశం

సమావేశంలో పాల్గొన్న బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి







నిర్మల్ ప్రతినిధి,(సింగిడి):నిర్మల్ పట్టణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం సంద ర్భంగా నిర్వహించిన ఉత్సవ కమిటీ సమావేశంలో బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేలా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబం ధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచిం చారు. నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, పట్టణ బీజేపీ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

singidinews@gmail.com



అతడు నాకు సొంతమైనా

క్రష్ తగ్గట్లేదు..

రష్మిక ఎమోషనల్ పోస్ట్

విజయ్ దేవరకొండ రష్మిక వైవాహిక బంధంలోకి అడుగుపెట్టిన తరువాత తొలిసారి జంటగా నటిస్తున్న చిత్రం 'రణబాలి' . సింగనమల బొబ్బిలి రణబాలిగా విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తుండగా, ఆయన భార్యగా జయమ్మ పాత్రలో రష్మిక కనిపించనున్నారు. ఈ సినిమాలోని ఇప్పటికే విడుదల చేసిన 'ఏందయ్యా సామీ..' పాటకు మంచి స్పందన వస్తోంది. అందులో విజయ్, రష్మికల మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంటోంది. తాజాగా ఆ పాట క్లిప్‌ను రష్మిక ఇన్‌స్టాలో పంచుకుంటూ, విజయ్‌పై తన ప్రేమను వ్యక్తం చేయడం విశేషం. "అతడు పూర్తిగా నాకే సొంతమయ్యాడు. కానీ తనపై క్రష్ ఏమాత్రం తగ్గడం లేదు. ఇదేం విచిత్రమో" అని రష్మిక పోస్ట్ చేయగా, విజయ్ దీనికి తనదైన శైలిలో రిప్లై ఇచ్చారు. "నేను ఎంతో అదృష్టవంతుడిని. జయమ్మను మిస్ అవుతాను కానీ, నువ్వు జీవితాంతం నా దగ్గరే ఉంటావు" అని విజయ్ స్పందించారు. వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధం చూసి నెటిజన్లు ముచ్చటపడుతున్నారు. ఇదిలా ఉండగా, రాహుల్ సాంకృత్యాన్ తెరకెక్కిస్తున్న 'రణబాలి' దసరా కానుకగా అక్టోబరు 16న విడుదల కానుంది.



డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు సుమలతపై దాడి



తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డాన్సర్స్ అండ్ డాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ (ఖీణణూా) జనరల్ బాడీ సమావేశంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కొందరు వ్యక్తులు తనపై భౌతిక దాడికి పాల్పడ్డారని, చంపుతామని బెదిరించారని ఆరోపిస్తూ అసోసియేషన్ అధ్యక్షురాలు వి. వి. సుమలతా దేవి బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దొంగ అని ముద్ర వేసినందుకు బాధగా ఉంది: రాధ ఫిర్యాదుపై అంబిక

ఇందిరానగర్‌లోని రాఘవ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ ఘటన జరిగినట్లు ఫిర్యాదులో సుమలతా దేవి పేర్కొన్నారు. సమావేశాన్ని అడ్డుకోవడంతో పాటు అసోసియేషన్‌కు సంబంధించిన ముఖ్యమైన రికార్డులను అక్రమంగా తీసుకెళ్లేందుకు కొందరు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించారని ఆమె ఆరోపించారు. తాను అధ్యక్ష పదవికి రాజీనామా చేయకపోతే చంపేస్తామని కొందరు తీవ్రంగా బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. ఘటనకు సంబంధించిన వాస్తవాల కోసం సీసీటీవీ రికార్డులు పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

ఓటీటీలోకి నయనతార కొత్త సినిమా..
స్ట్రీమింగ్ ఎప్పుడంటే!

వరుస సినిమాలతో అలరిస్తోన్న నయనతార ఇటీవల 'హాయ్' (ఎఱ) సినిమాతో పలకరించారు. కవిన్, నయన్ ప్రధానపాత్రల్లో నటించిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ చిత్రం ఓటీటీలో డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. జీ5 వేదికగా సెప్టెంబర్ 25 నుంచి స్ట్రీమింగ్ కానుంది. కొన్ని రోజులుగా ఈ చిత్రం ఓటీటీ తేదీపై వార్తలు వచ్చినప్పటికీ తాజాగా జీ5 అధికారికంగా ప్రకటించింది. విష్ణు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో భాగ్యరాజ్, రాధికా శరత్‌కుమార్, ప్రభు, సుహాసిని కీలకపాత్రల్లో నటించారు.

కథేంటంటే..: రాజమహేంద్రవరానికి చెందిన సుబ్రహ్మణ్యం (కవిన్) పెళ్లీడు వచ్చినా, తల్లిదండ్రుల చాటు బిడ్డగానే ఉంటాడు. ఇంట్లో చెప్పనిదే ఏ పని చేయడు. మేనమామ కూతురంటే ప్రాణం. ఆమెకు లవ్ ప్రపోజ్ చేస్తే, 'మరీ నీ అంత మంచివాడు నాకు అక్కర్లేదు' అని తిరస్కరిస్తుంది. దీంతో లెటర్ రాసి హైదరాబాద్ వెళ్లిపోతాడు. భీమవరానికి చెందిన దేవసేన (నయనతార) తల్లి చిన్నప్పుడే ఇల్లు వదిలి వెళ్లిపోవడంతో తండ్రి (ప్రభు) పెంచి పెద్ద చేస్తాడు. కానీ, తనకున్న తాగుడు అలవాటు కారణంగా ఊళ్లో ఆసామి కొడుకుకు తన కూతురిని ఇచ్చి పెళ్లి చేస్తానని మాట ఇస్తాడు. అయితే, పెళ్లిరోజే దేవసేన ఇంటి నుంచి తప్పించుకుని హైదరాబాద్ వెళ్లిపోతుంది. అనుకోకుండా సుబ్రహ్మణ్యం, దేవసేన కలిసి ఒక చోట ఉండాల్సి వస్తుంది. ఆ తర్వాత ఏం జరిగిందనేది కథ.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737